మొదటి దశ పోలింగ్‌లో ఆరు శాతం ఓట్ల తేడా ఎందుకు?

- అనవసర జాప్యానికి కారణమేంటి
- ఎన్నికల కమిషనర్‌కు ఏచూరి లేఖ

9

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 269 | విజయవాడ, శనివారం 4 మే 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 4 May 2024 | Rs



వాంఖడేలో కోల్‌కతా హవా

- ముంబయిపై 24పరుగుల తేడాతో గెలుపు


8

వేల కోట్లు కుమ్మరింత

ఏకంగా 60,750 కోట్లు ఖర్చుచేస్తున్న బిజెపి

లోక్‌సభ ఎన్నికలపై అంచనా

న్యూఢిల్లీ : ఎలక్టోరల్ బాండ్లతో పాటు , ఇతర రూపాల్లో కార్పొరేట్ సంస్థల నుండి భారీ మొత్తంలో నిధులు గుంజుకున్న భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఎంత మొత్తం ఖర్చు చేయనుందో ఊహించగలరా? ఏకంగా 60,750 కోట్ల రూపాయలు! నమ్మశక్యం కావడం లేదా! బిజెపి గత ఎన్నికల్లో చేసిన ఖర్చును, ఇప్పటికే జరిగిన రెండువిడతల పోలింగ్‌లలో ఆ పార్టీ అభ్యర్థులు చేసిన ఖర్చు ప్రాతిపదికగా పరిశీలకులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు వేస్తున్న అంచనాలో విస్మయకర వాస్తవాలు వెలుగుచూశాయి. ఆ వివరాలతో 'ది వైర్' ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ వంటి వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న శాసనసభ ఎన్నికలకు చేస్తున్న ఖర్చును కూడా కలుపుకుంటే 2024 ఎన్నికల్లో బిజెపి అక్షరాల లక్ష కోట్ల రూపాయలపైనే ఖర్చు చేయనుంది! ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బిజెపికి అందింది ఇప్పటివరకు వెల్లడైన సమాచారం ప్రకారం సుమారుగా 6 వేల కోట్ల రూపాయలే. అయినా ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేయడం ఎలా సాధ్యమంటే, నిధులు గుంజుకోవడానికి ఆ పార్టీకి ఉన్న మార్గాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా!




బిజెపి ప్రకటించిన ఆదాయం (రూ. కోట్లలో)

ఆధారం : ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లోని బిజెపి వార్షిక నివేదికలు. లోక్‌సభ ఎన్నికల ముందు (2014,2019, 2024) ఆదాయం పెరుగుదల గమనించవచ్చు.

ఎంత మొత్తం ...?

2015-16 ఆర్థిక సంవత్సరం నుండి 2022-23 వరకు ఎన్నికలు, సాధారణ ప్రచారం కోసం ప్రతి సంవత్సరం 5,744 కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు బిజెపి తన అకౌంట్లలో చూపింది. అయితే, వివిధ సంస్థలు, పరిశీలకులు దీనికి భిన్నంగా చెబుతున్నారు. సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సిఎంఎస్)తో పాటు పలు సంస్థలు చేసిన అధ్యయనం ప్రకారం ఒక్క 2019 ఎన్నికల్లోనే బిజెపి 27వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసింది. దేశ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మొత్తానికన్నా అధికంగా భారీ స్థాయిలో ఖర్చు చేసినట్లు పలు నివేదికలు తేల్చాయి. సిఎంఎస్ అధ్యయనం ప్రకారం 2019 ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు చేసిన మొత్తం వ్యయం 60వేల కోట్ల రూపాయలు. దానిలో బిజెపి వాటా సుమారుగా 45 శాతం. 1998 సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన ఖర్చులో బిజెపి వాటా 20శాతంగానే ఉండటం గమనార్హం. 1998 ఎన్నికలతో పోలిస్తే 2019 ఎన్నికల నాటికి బిజెపి అదనంగా మరో 25శాతం ఖర్చు చేసింది. దీనికి రాష్ట్రాల శాసనసభ ఖర్చులు అదనం! పెరుగుదల రేటును పరిగణలోని తీసుకోకుండా కేవలం 2019 ఎన్నికల్లో మిగతా2లో



భూమి, భవనాలపై బిజెపి చేసిన ఖర్చు

ఆధారం : ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లోని బిజెపి వార్షిక నివేదికలు.

ఇంటి వద్దే పెన్షన్లు పంపిణీ చేయాలి

- వృద్ధుల వద్ద వసూలు చేసిన ఛార్జీలు ఇచ్చేయాలి
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వృద్ధులకు పెన్షన్ బ్యాంకు ఖాతాలో వేస్తామని చెప్పి రకరకాల కారణాలతో ఛార్జీలు వసూలు చేయడం అమానుషమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మంచంపై ఉన్నవారికి ఇంటివద్దే పెన్షన్లు పంపిణీ చేస్తామని చెప్పి బ్యాంకుల్లో జమచేసి, నానా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎటువంటి ఛార్జీలనూ వసూలు చేయకూడదని, వసూలు చేసిన మొత్తాన్ని లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని, కదలలేని వారికి ఇంటివద్దే పంపిణీ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 65.49 లక్షల పింఛనుదారులుంటే 48.92 లక్షల మందికి బ్యాంకు ఖాతాలున్నాయని ప్రభుత్వ అధికారులు ప్రకటించినప్పటికీ పింఛను దారుల ఖాతాలు లావాదేవీలు జరగలేదని, మినిమం బ్యాలెన్స్ లేవని ఇతర కారణాలు చెప్పి రూ.300 నుంచి రూ.400 వరకూ ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమని తెలిపారు. ముందునుండి రాజకీయ పార్టీలు పింఛన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మొత్తుకున్నా ప్రభుత్వ అలసత్వం ఫలితంగా పండుటాకులు ఎండవేడి తాళలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారని, అక్కడ కూడా సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయని వివరించారు. మంచంపై ఉండి బ్యాంకులకు వెళ్లలేని వారికి ఇంటింటికీ పింఛను పంపిణీ చేస్తామని చెప్పి బ్యాంకు ఖాతాల్లో వేశారని వివరించారు. వృద్ధులు ఆటోలు మాట్లాడుకుని, ఇతరుల సహాయం తీసుకుని బ్యాంకుల మిగతా2లో



ఎన్‌టిఆర్ జిల్లా మైలవరంలో యూనియన్ బ్యాంకు వద్ద క్యూలో ఉన్న వృద్ధులు

ఆగని మృత్యుఘోష

- రాష్ట్రంలో మరో పింఛను మరణం
- బ్యాంకుల ముందు తప్పని పడిగాపులు
- టిడిపి, వైసిపి రాజకీయ లబ్ధి కోసం జనానికి తిప్పలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఎన్నికల్లో లబ్ధి కోసం రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ యంత్రాంగాన్ని వివాదంలోకి నెట్టిన టిడిపి, వైసిపిల నిర్వాకం లబ్ధిదారులకు శాపంగా మారింది. పింఛను డబ్బుల కోసం వృద్ధులు మండుటెండల్లో తిరగాల్సిరావడం, బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సిరావడంతో మృత్యుఘోష ఆగడం లేదు. పశ్చిమగోదావరి జిల్లాలో శుక్రవారం ఒకరు వడదెబ్బకు గురై మరణించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల సొమ్మసిల్లిపోయిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా టిడిపి, వైసిపిలు రాజకీయ వ్యూహ, ప్రతివ్యూహాల్లో నిమగ్నమైనాయి. పింఛన్ల పంపిణీలో ఈ పరిస్థితి నెలకొనడానికి మీరు కారణమంటే, మీరు కారణమని ఇరు పార్టీల నేతలు విమర్శలకు దిగుతున్నారే తప్ప దొందూదొందే అని ఒప్పుకోరు.

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరు శివారు చిల్లేవారిపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు ఇంజేటి తాయారు (69) పెన్షన్ కోసం బ్యాంకుకు వెళ్లి తిరిగి ఇంటికెళ్లాక వడదెబ్బతో మృతి చెందారు. ఆమె భర్త మసీన్ ఇటీవల మరణించారు. దీంతో, ఆమె తన చిన్న కుమార్తె సుజాత ఇంటి వద్ద పెనుగొండ మండలం చినమల్లం గ్రామంలో ఉంటున్నారు. పింఛను కోసం సమీప బంధువు ఆమెను మోటారు సైకిల్‌పై ఆచంట మండలం వల్లూరులోని ఎస్‌బిఐ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ రద్దీగా ఉంది. ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని బ్యాంకు సిబ్బంది ఆమెకు సూచించారు. దీంతో, ఆమె అక్కడ నుంచి ఆధార్ కేంద్రం ఉన్న మట్టావానిపాలెం వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేయించుకున్నారు. అప్పటికే మధ్యాహ్నం కావడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో బ్యాంకుకు శనివారం వెళ్దామని బంధువు ఆమెను చిల్లేవారిపాలెం తీసుకెళ్లారు. ఇంటికెళ్లాక సొమ్మసిల్లి పడిపోయి తాయారు మృతి చెందారు. పింఛను కోసం ఎండలో తిరగడం వల్లే ఆమె మృతి చెందారని బంధువులు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని యూనియన్ బ్యాంకు మిగతా2లో

నిష్పక్షపాతంగా ఎన్నికలు

అన్ని రాజకీయ పార్టీలనూ సమానంగా పరిగణించాలి : నితీష్ వ్యాస్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ముఖేష్‌కుమార్, పోలీస్ ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అన్ని రాజకీయ పార్టీలనూ సమానంగా పరిగణిస్తూ నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనరు నితీష్ వ్యాస్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలను ఆదేశించారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్‌పిలు, ఎన్నికల సాధారణ, పోలీస్, వ్యయ పరిశీలకులతో శుక్రవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా నితీష్ వ్యాస్ మాట్లాడుతూ.. ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాల్లో తరచూ ఎన్నో సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని, ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాలను సునిశితమైన రాష్ట్రాలుగా గుర్తించామన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల నిర్వహణలో ఎటువంటి హింస, అల్లర్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పటిష్టంగా అమలు పరచాలని, ఎటువంటి విధాన పరమైన లోపాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆయా కేంద్రాల్లో జరిగే ఎన్నికల సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా ఇంటిగ్రేటెడ్, కంట్రోల్ సెంటర్లలో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎన్నికలకు ఒకరోజు ముందుగానే వెబ్ కాస్టింగ్ పనితీరును ట్రయల్ రన్ ద్వారా పరీక్షించుకోవాలన్నారు. ఎన్నికల రోజు వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డయ్యే ఫీడ్‌ను భద్రపరుచుకోవాలని మిగతా 2లో



రైతు నేత, సిపిఐ జాతీయ కార్యదర్శి

అతుల్ కుమార్ అంజన్ కన్నుమూత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతు నేత, సిపిఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ (70) లక్నోలోని ఆస్పత్రిలో శుక్రవారం తెల్లవారుజామున 3:40 గంటలకు తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ మరణించారు. ఆయన మరణం పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ప్రగాఢ సంతాపం తెలిపింది. ఎఐకెఎస్, ఎస్‌కెఎం తదితర రైతు సంఘాలు సంతాపాన్ని తెలియజేశాయి. ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని లక్నోలో సిపిఐ కార్యాలయంలో ఉంచారు. అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు లక్నోలో జరగనున్నాయి. అతుల్ కుమార్ అంజన్ ప్రస్తుతం అఖిల భారత కిసాన్ సభ (అజయ్ భవన్) ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఫ్రాన్స్ వర్శిటీలోకి పోలీసులు

- శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థుల అరెస్టు
- నిరాహార దీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

పారిస్ : ఫ్రాన్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన సైన్సెస్ పిఓ యూనివర్శిటీలోకి శుక్రవారం పోలీసులు ప్రవేశించారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధాన్ని నిరసిస్తూ ఆందోళన జరుపుతున్న విద్యార్థులను కేంపస్ నుండి తరలించారు. దాదాపు 70మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అమెరికా వ్యాప్తంగా కొన్ని కాలేజీ కేంపస్‌ల్లో గత కొన్ని రోజులుగా ఆందోళనలు ఉధృతంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఫ్రాన్స్‌లో శాంతియుతంగా నిరసనలు కొనసాగుతున్నా, విద్యార్థులను పోలీసులు కేంపస్ భవనాల నుండి బయటకు తరలించారు. ఫ్రెంచి విద్యార్థుల నిరసనలకు సైన్సెస్ పిఓ వర్శిటీ కేంద్రంగా మారింది. ఫ్రాన్స్‌వ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నాయి. శుక్రవారం యూనివర్శిటీని మూసివేశారు. ప్రధాన భవనం చుట్టూ పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తంగా యూనివర్శిటీ భవనాలను ఖాళీ చేయాలని, నిర్దేశించిన చిన్న ప్రాంతానికే పరిమితం కావాలని విద్యార్థులకు యూనివర్శిటీ అధికారులు అల్టిమేటమ్ ఇచ్చారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు ఆ అల్టిమేటమ్‌ను తిరస్కరించారని జాక్ అనే విద్యార్థి తెలిపారు. పోలీసులు వచ్చి జోక్యం చేసుకోవడానికి ముందుగా వర్శిటీ ప్రతినిధి మాట్లాడుతూ, విద్యార్థులతో నెలకొన్న ప్రతిష్టంభనను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి ప్రయత్నించినట్లు తెలిపారు. ఇజ్రాయిల్ యూనివర్శిటీలతో గల సంబంధాలను రద్దు చేసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. దానికి సైన్సెస్ పిఓ డైరెక్టర్ జేన్ బాసర్స్ తిరస్కరించారు. దీంతో నిరాహార దీక్షకు దిగాలని నిర్ణయించినట్లు ఆందోళనకారులు తెలిపారు.

అమెరికాతో పోలిస్తే ఫ్రాన్స్‌లో ఆందోళనలు శాంతియుతంగా జరుగుతున్నాయని, చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలనే ఆసక్తి ఎక్కువగా వుందని ఫ్రాన్స్ యూదు విద్యార్థుల యూనియన్ అధ్యక్షుడు శామ్యూల్ తెలిపారు.



వర్శిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులను బయటకు పంపుతున్న పోలీసులు

నంద్యాలలో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదయ్యాయి. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు, గోస్పాడు మండలాల్లో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే ప్రకాశం జిల్లా అర్ధవీడులో 47.3, కడప జిల్లా చిన్నచెప్పలిలో 47.2, నెల్లూరు జిల్లా వేపినాపి అక్కమాంబపురంలో 47.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే తిరుపతి జిల్లా పెద్దకన్నాలిలో 46.9 డిగ్రీలు, కర్నూలు జిల్లా పంచలింగాలలో 46.8, చిత్తూరు జిల్లా తవణంపల్లి, పల్నాడు జిల్లా రావిపాడులో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు జిల్లాల్లో 47 డిగ్రీలకుపైగా నమోదు కాగా, మరో 15 జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 63 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 208 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. అలాగే శనివారం 58 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 169 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం వుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో 12 మండలాల్లో, విజయనగరం 23, పార్వతీపురం మన్యంలో 14, విశాఖపట్నంలో ఒకటి, అనకాపల్లిలో 8 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం వుందని తెలిపారు.

నిర్వీర్యమైన సాగునీటి ప్రాజెక్టులు

- కూటమి నేతల విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రివర్స్ టెండర్లతో సాగునీటి ప్రాజెక్టులను సిఎం జగన్ నిర్వీర్యం చేశారని కూటమి నేతలు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతోపాటు పలువురు కూటమి నేతలు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టులను ఎండగట్టి, పోలవరాన్ని నట్టేట ముంచి రాష్ట్రాన్ని ఎడారిగా మార్చారని విమర్శించారు. జగన్‌కు ముస్లిం రిజర్వేషన్ల పట్ల చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ మరో సమావేశంలో విమర్శించారు.

ఓటరు స్లిప్ పంపిణీ వ్యవహారంపై ఆర్‌ఒలకు సరైన డైరెక్షన్ ఇవ్వాలని సిఇఒ ఎంకె మీనాను టిడిపి కోరింది. సచివాలయంలో మీనాను ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్యతోపాటు పలువురు కలిసి వినతిపత్రం అందించారు. వైసిపికి అనుకూలంగా పనిచేస్తున్నారని పేర్కొంటూ నెల్లూరు రూరల్, రాజమండ్రి సిటీ డిఎస్‌పిలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

లోపభూయిష్టంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్టు

- జనసేన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు లోపభూయిష్టంగా ఉందని, ఈ చట్టంపై మంత్రి బొత్స సత్యనారాయణకు అవగాహన లేదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి శివశంకర్ విమర్శించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు, రిజిస్ట్రేషన్ శాఖలో కార్డ్ ప్రైమ్ 2.0 విధానం ద్వారా భూముల రీ సర్వేతో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎల్‌పిఎమ్, ఎల్‌పిఎస్‌లలో దొర్లే పొరపాట్లు కారణంగా బ్యాంకుల్లో రైతులు రుణాలు పొందలేకపోతున్నారన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు

మొదటిపేజి తరువాయి

నితీష్‌వ్యాస్ పేర్కొన్నారు. షాడో ఏరియాల్లో ఉండే పోలింగ్ కేంద్రాల్లో పటిష్టమైన కమ్యూనికేషన్ వ్యవస్థను ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

తాగునీరు, వైద్యులు అందుబాటులో..

ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లో గత ఎన్నికల్లో ఓటింగ్ చీకటి పడే వరకు జరిగిందని, ఆ అనుభవాల దృష్ట్యా ఈ దఫా పోలింగ్ బూత్‌ల వద్ద లైటింగ్, బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లు, ఎస్‌పిలను నితీష్‌వ్యాస్ ఆదేశించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఓటర్లు ఎవరూ వడదెబ్బకు గురికాకుండా క్యూలైన్లన్నీ షామియానాలతో కవర్ అయ్యేలా చూడాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులైన మంచినీరు, ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇవిఎంల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి ముందస్తు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని, సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తినా వెంటను సమస్యను పరిష్కరించేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే నగదు, లిక్కర్, డ్రగ్స్, ఉచితాల అక్రమ రవాణాను నియంత్రించాలని, రాష్ట్ర సరిహద్దులు, జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల్లో నిరంతరం నిఘా ఉంచాలన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎపిఎస్‌పి బెటాలియన్స్ అడిషనల్ డిజిపి అతుల్‌సింగ్, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి, అడిషనల్ డిజిపి (లా అండ్ ఆర్డర్) ఎస్ బాగ్చీ, అదనపు సిఇఒ హరీందర్ ప్రసాద్, ప్రొవిజన్ అండ్ లాజిస్టిక్ ఐజిపి వెంకటరామిరెడ్డి, టెక్నికల్ సర్వీసెస్ డిజిపి ఎస్ హరికృష్ణ, సెబ్ ఐజి రవిప్రకాష్, లా అండ్ ఆర్డర్ డిజిపి సెంథిల్‌కుమార్, కమ్యూనికేషన్ డిఐజి ఎన్ఎస్‌జె లక్ష్మీతోపాటు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, ఎన్నికల వ్యయ పరిశీలకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ పింఛన్ల ఫైల్‌పై తొలి సంతకం

- చంద్రబాబు రాజకీయం వల్లే అవ్వతాతలు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు
- కూటమి మేనిఫెస్టోను నమ్మొద్దు
- ఆలోచించి ఓటేయండి : ముఖ్యమంత్రి జగన్



కనిగిరిలో అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- యంత్రాంగం

ఒక్క నెల ఓపిక పట్టండని, తాను మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే వలంటీర్లు ఇంటింటికీ వచ్చి పింఛన్లు పంపిణీ చేసే ఫైల్‌పైనే తొలి సంతకం చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. చంద్రబాబు రాజకీయం వల్లే అవ్వతాతలు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి మేనిఫెస్టోను నమ్మొద్దని, ఆలోచించి ఓటేయాలని కోరారు. శుక్రవారం ఆయన ప్రకాశం జిల్లా కనిగిరి, పల్నాడు జిల్లా క్రోసూరు, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించారు. తాను అధికారంలో ఉంటేనే బటన్ నొక్కుడు పథకాల అమలు జరుగుతాయని, చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలు అమలు జరగవని అన్నారు. చంద్రబాబు మాయమాటలతో అధికారంలోకి రావాలని సాధ్యం కానీ హామీలు ఇస్తున్నారని, వాటిని నమ్మి మోసపోవద్దని కోరారు. పింఛన్ల పంపిణీని చంద్రబాబు రాజకీయం చేసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని, ఫలితంగానే అవ్వతాతలు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడాల్సి వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేశానని గొప్పలు చెప్పుకోవడమే తప్ప పేదలకు చేసిందేమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను ఎప్పుడూ నెరవేర్చలేదని విమర్శించారు. 2014 ఎన్నికల్లో గెలిచాక రుణామాఫీ చేశారా? ఒక్క విడత చేయాల్సిన మాఫీని ఐదేళ్లు సాగదీసి చివరికి రైతులకు మొండిచేయి చూపారన్నారు. చంద్రబాబు హయాంలో ఎంత మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. అమరావతిని సింగపూర్‌గా చేస్తామన్నారని, చేశారా? ఆడబిడ్డపుడితే రూ.25 వేలు డిపాజిట్ చేస్తామన్నారని, ఎంతమందికి చేశారని? ఇప్పుడు కొత్త హామీలతో విడుదల చేసిన మేనిఫెస్టోనూ అమలు చేయరని, చంద్రబాబును నమ్మొద్దని కోరారు.

తాను 59 నెలల పాలనలో నాడు-నేడు, విద్యా కానుక, ఇంగ్లీష్ మీడియం, జగనన్న విద్య దీవెన, వసతి దీవెన, అమ్మఒడి, చేయూత, కాపు నేస్తం, ఇబిసి నేస్తం, ఆసరా, సున్నా వడ్డీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేశానని, రాష్ట్రాభివృద్ధికి కృషి చేశానని వివరించారు. రాష్ట్రంలో ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు 93 శాతం పూర్తి ఫీజును కడుతున్నామన్నారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయ కోర్సులు వంటివి తీసుకొచ్చి విద్యలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటరీ వ్యవస్థతోపాటు మహిళా పోలీసులు, దిశ చట్టం 50 శాతం రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు, ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా వైద్యం కోసం ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షలు వరకు అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలన్నీ మరింత సమర్ధవంతంగా అమలు కావాలంటే వైసిపిని మళ్లీ గెలిపించాలని కోరారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు గంగవరం పోర్టు నుంచి సరఫరా కావాల్సిన కోకింగ్ కోల్ సరఫరా కానందున విశాఖ స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్ డిపార్టుమెంట్‌లో తీవ్ర సమస్యలు ఏర్పడ్డాయని హైకోర్టులో సి అసోసియేషన్ పిటిషన్ వేసిందని, గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యనియన్ (సిఐటియు) కూడా హైకోర్టు కేసులో చేరిందని తెలిపారు. పోర్టులో కార్మికులు సమ్మె చేస్తున్నందువల్ల కోకింగ్ కోల్ సరఫరా చేయలేకపోతున్నామని గంగవరం పోర్టు యాజమాన్యం హైకోర్టులో వాదనలు వినిపించగా ఈ వాదనలను కోర్టు తిరస్కరించిందని తెలిపారు. శుక్రవారం హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం గంగవరం పోర్టు యాజమాన్యం యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. గంగవరం పోర్టు కార్మికులు వెంటనే విధులకు హాజరు కావాలని హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే జూన్ 24న హైకోర్టు తిరిగి విచారించి తగిన నిర్ణయాలు చేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. దీని ప్రకారం కార్మికులు ఈ నెల 4 నుంచి గంగవరం పోర్టులో విధులకు హాజరవుతారని తెలిపారు. జిల్లా అధికారులు కార్మిక సమస్యల పరిష్కారానికి ప్రయత్నించినా పోర్టు యాజమాన్యం చర్చల్లో నోరుమెదపలేదని పేర్కొన్నారు. ఈలోగా యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని వెల్లడించారు. ముగ్గురు నాయకులను మూడు రాష్ట్రాల సిమెంట్ కంపెనీలకు ట్రాన్స్‌ఫర్ చేసిందని, ఐదుగురిని అక్రమంగా సస్పెండ్ చేసిందని తెలిపారు. పోర్టులో కార్మికులందరికీ యాజమాన్యం ఐదు రోజులపాటు జీతంలో కోత విధించిందని పేర్కొన్నారు. ఈ కక్షసాధింపు చర్యలను విరమించు కోవాలని డిమాండ్ చేశారు. పోర్టు ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న స్కిల్డ్ కార్మికులకు నెలకు రూ.15 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, కార్మికులందరికీ బేసిక్ రూ.3700 మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఇఎస్ఐ లేని కార్మికులకు ఏ మెడికల్ సౌకర్యమూ లేదని తెలిపారు. డ్యూటీ తరువాత మూడు గంటలు అదనంగా పనిచేసినా ఏమీ ఇవ్వకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.

బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేని 74,399 మందికి డోర్ టు డోర్ పింఛన్లు

- శశిభూషణ్ కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బ్యాంకు ఖాతాలు వాడుకలో లేక డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) అకౌంట్లలోకి నిధులు బదిలీ కాని 74,399 మంది పింఛనుదారులకు ఈ నెల 4, 5 తేదీల్లో పంపిణీ చేసేందుకు వీలుగా వారి పేర్లను డోర్ టూ డోర్ డిస్ట్రిబ్యూషన్ మోడ్‌లోకి మార్చడానికి ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని పంచాయతీరాజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 65,49,864 మంది పింఛనుదారులుండగా, ఈ నెల 3 వరకు 64,13,200 మందికి (97.91 శాతం) పింఛన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. డోర్ టు డోర్ 16,57,361 మందికి గానూ, 15,95,482 మందికి పెన్షన్లు పంపిణీ చేయగా, డిబిటి ద్వారా 48,92,503 మందికి గానూ 48,17,718 (98.47 శాతం) మందికి పెన్షన్ పంపిణీ చేసినట్లు శశిభూషణ్ కుమార్ తెలిపారు.



యువగళం సభలో యువతతో మాట్లాడుతున్న లోకేష్

కర్నూలును హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం : లోకేష్

ప్రజాశకి-నంద్యాల కలెక్టరేట్

మిషన్ రాయలసీమ పేరుతో ఉమ్మడి కర్నూలు జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా, ఆటో మోటివ్, ఎలక్ట్రికల్ గూడ్స్ హబ్‌గా మారుస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. పరిశ్రమలు తెస్తామని, పాడి పరిశ్రమను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నంద్యాలలో శుక్రవారం యువగళం సభలో భాగంగా యువతతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి ప్రజల భూములను లాక్కోవాలని చూస్తున్నారని, మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనమేనని ఆరోపించారు. టిడిపి అధికారంలోకి రాగానే వంద రోజుల్లో గంజాయిని రూపు మాపుతామని తెలిపారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని యువతకు భరోసా ఇచ్చారు. సిఎఎ వల్ల మైనార్టీలు బయపడవద్దని, మైనార్టీల భద్రతకు చంద్రబాబు బాధ్యత తీసుకుంటారని హామీ ఇచ్చారు. సమావేశంలో నంద్యాల ఎంపి అభ్యర్థి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

బిజెపి పాలనలో రాజ్యాంగ వ్యవస్థలకు తూట్లు

- వి హనుమంతరావు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

బిజెపి పాలనలో రాజ్యాంగ వ్యవస్థలకు తూట్లు పడ్డాయని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కాంగ్రెస్ వర్కింగ్ అధ్యక్షులు వి.హనుమంతరావు విమర్శించారు. శుక్రవారం ఆయన కాకినాడలోని ఓ హోటల్‌లో ఇండియా వేదిక నాయకులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

దేశంలోని ప్రతిపక్షాలపై కక్ష సాధించే రీతిలో కేంద్రంలోని బిజెపి పాలన సాగుతోందన్నారు. రైతులకు, మహిళలకు తీరని ద్రోహం చేస్తోన్న బిజెపిని గద్దె దించడమే లక్ష్యంగా ఇండియా వేదిక పని చేస్తోందని తెలిపారు. రైతులకు సంబంధించి మూడు నల్ల చట్టాలపై ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీని పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేశారన్నారు. రూ.10 లక్షల కోట్ల రుణాలను ఆదానీ, అంబానీల కోసం బిజెపి సర్కారు మాఫీ చేసిందని, సంపన్నుల కోసం మాత్రమే పనిచేస్తోందని విమర్శించారు. ముస్లిం రిజర్వేషన్లపై మతతత్వ బిజెపి నేతలు తెలంగాణలో ఒకలా, ఆంధ్రలో మరోలా మాట్లాడుతున్నారని అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చడానికి బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలిపారు. కోర్టులను ఆధీనంలో ఉంచుకుని ఇష్టానురీతిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీలను, అన్ని అంశాల్లోనూ బిజెపితో అంటకాగుతున్న వైసిపిని ఓడించాలని కోరారు. ఇండియా వేదిక తరఫున పోటీ చేస్తున్న వారిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి ఎంఎం.పల్లంరాజు, సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సిపిఐ నాయకులు కె.బోడకొండ, ఆప్ నాయకులు నరాల శివ పాల్గొన్నారు.

ఒపిఎస్ అమలు చేస్తాం

ఐఎఎస్‌లు వైసిపికి వంతపాడడం హేయనీయం : షర్మిల

ప్రజాశక్తి- కడప ప్రతినిధి, చాపాడు/మైదుకూరు/ఖాజీపేట



మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉద్యోగులను చూసుకున్న తరహాలోనే ప్రభుత్వోద్యోగులకు అండగా ఉంటానని, ఒపిఎస్ అమలు చేస్తామని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల హామీ ఇచ్చారు. శుక్రవారం ఆమె కడప డిసిసి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో ఒపిఎస్ అమలు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ముఖ్యమంత్రి జగన్‌ను ప్రశ్నించారు. జిపిఎస్ అక్కర్లేదని, ఒపిఎస్ కావాలని ఉద్యోగులు అడుతున్నా ఆయన స్పందించడం లేదన్నారు. మంత్రి బొత్సలాంటి నాయకులు ఉద్యోగులను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. ఉద్యోగుల హక్కులను కాలరాయడం దారుణమన్నారు. ఉద్యోగ సంఘాలకు అపాయింట్‌మెంట్ కూడా ముఖ్యమంత్రి ఇవ్వడం లేదని విమర్శించారు. ఉద్యోగుల విషయంలో తామడిగిన నవ సందేహాలకు, 12వ పిఆర్‌సి అమలు ఆలస్యంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషన్ నివేదిక వచ్చే వరకు ఐఆర్ ఇస్తామన్న హామీ ఏమైందన్నారు. హెచ్ఆర్ఎ సచివాలయ ఉద్యోగులకు 30 శాతం నుంచి 24 శాతానికి, జిల్లా స్థాయి ఉద్యోగులకు 20 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం దారుణమని పేర్కొన్నారు. రూ.22 వేల కోట్ల ఉద్యోగుల బకాయి చెల్లింపుల సంగతేమిటని ప్రశ్నించారు. రూ.2,500 కోట్ల టిఎ, డిఎల బకాయిలను 2027లో చెల్లిస్తామనడంలో అర్థం లేదన్నారు. రూ.2,500 కోట్ల సరెండర్ లీవుల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.118 కోట్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల సంగతేమిటని ప్రశ్నించారు. పెన్షన్ పంపిణీ పేరుతో ప్రభుత్వం వృద్ధులను చంపడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రవర్తిస్తోందని విమర్శించారు. ఐఎఎస్‌లు ఒత్తిళ్లకు లొంగి వైసిపి ప్రయోజనాలకు వంతపాడటం హేయమన్నారు.

వైసిపి, టిడిపి దొందూ దొందే...

వైసిపి, టిడిపి దొందూ దొందేనని షర్మిల విమర్శించారు. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు నియోజకవర్గంలోని మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో మాట్లాడుతూ జగన్, చంద్రబాబు ఇద్దరూ ప్రధాని నరేంద్ర మోడీ వద్ద మోకరిల్లుతున్నారని, వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం వెంపర్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, పరిశ్రమలు, పోలవరం ప్రాజెక్టు, ఉద్యోగాలు, పరిశ్రమలు, రాజధాని గురించి మోడీని ఎందుకు ప్రశ్నించడం లేదే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆగని మృత్యుఘోష

మొదటిపేజి తరువాయి

వద్దకు పింఛను తీసుకోవడానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ నేపథ్యంలో జరిగిన తోపులాటలో కిందపడిపోయిన ఒక వృద్ధురాలు స్వల్పంగా గాయపడింది. తెనాలి రూరల్ మండలం కొలకలూరు యూనియన్ బ్యాంకు వద్ద ఎండలో వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం బుచ్చిపాలెం గ్రామానికి చెందిన 72 ఏళ్ల జక్కుల అమ్మిరాజు రెండు రోజులుగా పింఛను కోసం పది కిలోమీటర్ల దూరంలోని బ్యాంకు చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నాడు.. అల్లూరి జిల్లా జికె.వీధి మండలం సీలేరు యూనియన్ బ్యాంకు వద్ద పింఛనుదారులు పడిగాపులు కాశారు. దుప్పిలివాడ పంచాయతీ కాట్రగెడ్డ, పిల్లిగెడ్డ గ్రామాలకు చెందిన కొంతమంది తమకు పింఛను డబ్బులు ఖాతాల్లో పడలేదని తెలిపారు. సీలేరులోని యూనియన్ బ్యాంకు వద్ద వృద్ధులు తమ ఖాతాల్లో పడిన డబ్బులు తీసుకోవడానికి ఎక్కువసేపు నిరీక్షించాల్సి వచ్చింది.

రెండవరోజూ అందలేదు

వై.రామవరం మండల కేంద్రంలోని ఎస్‌బిఐకి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న రేగడిపాలెం, బుల్లెట్‌పాలెం, బూరుగుపాలెం గ్రామాల లబ్ధిదారులకు రెండో రోజు కూడా పింఛను అందలేదు. దీంతో వారు పెన్షన్ కోసం వస్తే బస్ ఛార్జీలు, భోజనానికి రూ.250 చొప్పున ఖర్చయినట్లు వాపోయారు. చింతూరు మండలం మోతుగూడెం యూనియన్ బ్యాంక్, పాడేరులోని ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంకుల వద్ద పింఛనుదారులు పడిగాపులు కాశారు. అరకు సంతబయలు ఎస్‌బిఐ బ్యాంకు పింఛనుదారులతో కిక్కిరిసింది.

అనకాపల్లి జిల్లా నక్కపల్లి ఐఒబి బ్యాంకు వద్ద పింఛనుదారులు బారులు తీరారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలో సాంకేతిక కారణాలతో కొంతమంది పింఛను డబ్బులు బ్యాంకు ఖాతాలలో జమ కాలేదు. ఈ విషయం తెలియక డబ్బులు విత్‌డ్రా చేసేందుకు వచ్చిన పింఛనుదారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వేపాడ మండలంలో కొందరికి ఎప్పుడో పదేళ్ల క్రితం ఉపాధి పనుల కోసం ప్రారంభించిన జీరో అకౌంట్ ఖాతాల్లో పింఛను డబ్బులు పడ్డాయి. ప్రస్తుతం ఈ ఖాతాలు రన్నింగ్‌లో లేకపోవడం, జిల్లా కేంద్రంలో ఆ బ్యాంకులు ఉండడంతో అక్కడికి వెళ్లలేక డబ్బులు తీసుకోలేకపోయారు.



ఉక్కు కార్మికుల దీక్షలకు మద్దతు తెలుపుతూ మాట్లాడుతున్న విమలక్క

ఉక్కు జోలికొస్తే సహించేది లేదు : విమలక్క

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

త్యాగాలతో ఏర్పడ్డ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరించాలని చూస్తే సహించేది లేదని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల అధ్యక్షురాలు విమలక్క అన్నారు. 'విశాఖ ఉక్కును అమ్మడానికి వాడెవడు.. కొనడానికి వీడెవడు.. కొనేవాడిని అమ్మే వాడిని బంగాళాఖాతంలో కలిపేస్తాం' అని ఆమె హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1177వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ డబ్ల్యుఆర్ఎం 1, 2 విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం దారుణమని, పోరాటాలతో ఆ నిర్ణయాన్ని తిప్పికొడతామని అన్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన కాంగ్రెస్ విశాఖ ఎంపి అభ్యర్థి పి సత్యారెడ్డి, సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ పోరాటాలు, బలిదానాలు, త్యాగాలతో సిద్ధించిన విశాఖ ఉక్కు వంటి ఉన్నతమైన కర్మాగారాన్ని కారు చౌకగా అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు అమ్మే హక్కు మోడీ సర్కారుకు ఎవరిచ్చారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు దేశాభివృద్ధికి పట్టుకొమ్మలన్నారు. వాటిని నరికేసి ప్రజలకు దారిద్ర్యంవైపునకు నెట్టాలని పాలకులు చూస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు కూలీ సంఘం నాయకులు కె వీరాంజనేయులు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, కో -కన్వీనర్ జె అయోధ్యరాం, నాయకులు పరంధామయ్య, ఎన్ రామారావు, పెద్దిరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి మండపేట విలేకరి సుబ్బరాజు మృతి

ప్రజాశక్తి- మండపేట



సుబ్బరాజు(ఫైల్)

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండల ప్రజాశక్తి విలేకరి పల్లి సుబ్బరాజు (39) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆయన బాధపడుతున్నారు. కాకినాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఇటీవలే ఇంటికి వచ్చారు. గురువారం అర్ధరాత్రి శ్వాస సంబంధిత సమస్య రావడంతో ఆయనను హుటాహుటిన కాకినాడ ట్రస్ట్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సుబ్బరాజు దశాబ్ద కాలానికిపైగా ప్రజాశక్తిలో విలేకరిగా కొనసాగుతున్నారు. దళితుల శ్మశానాల సమస్యపై ఆయన రాసిన కథనానికి మోటూరు హనుమంతురావు పురస్కారాన్ని అందుకున్నారు. సుబ్బరాజుకు భార్య, కుమారుడు ఉన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక శ్మాశనంలో ఆయన అంతక్రియలను నిర్వహించారు. సుబ్బరాజు మృతికి ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, సిజిఎం అచ్యుతరావు, సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కృష్ణవేణి, ప్రజాశక్తి సిబ్బంది సంతాపం తెలిపారు.

సబ్ ఎడిటర్ మాధవయ్యకు మాతృవియోగం

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజాశక్తి సబ్ ఎడిటర్ మాధవయ్యకు మాతృవియోగం కలిగింది. . ప్రకాశం జిల్లా. కనిగిరి మండలం లింగారెడ్డిపల్లి (కొత్తపల్లి గ్రామం)కు చెందిన మధవయ్య తల్లి లక్ష్మమ్మ (75) శుక్రవారం అనారోగ్య కారణంతో మృతిచెందారు. ఆమెకు ఐదుగురు కుమారులు ఉన్నారు. మాధవయ్య ఆఖరి కుమారుడు. కొత్తపల్లి గ్రామంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఆమె అంత్యక్రియలు జరుగుతాయి. వారి కుటుంబానికి ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, ప్రజాశక్తి సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/ గిద్దలూరు (ప్రకాశం జిల్లా)



కైకలూరు సభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. ఏలూరు జిల్లా కైకలూరులో, ప్రకాశం జిల్లా గిద్దలూరులో జరిగిన వారాహి విజయభేరి సభల్లో ఆయన ప్రసంగించారు. ఎంతో విశిష్టత కలిగిన కొల్లేరు ఇబ్బందుల్లో పడిందన్నారు.

ఇక్కడ జలజీవన్ పథకం కింద రూ.150 కోట్లు ఖర్చుచేస్తే తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం యువతను గంజాయి మత్తుకు బానిసను చేసిందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సొమ్మును జగన్ లాగేశారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల భూములను దోచేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆస్తి పత్రాలు అధికారుల వద్ద ఉండటం ఏవిధంగా సమంజసమన్నారు. పశ్చిమ ప్రకాశం జిల్లా ఎంతో వెనుకబడి ఉందన్నారు. తాము అధికారంలోకి వస్తే గుండ్లమోటు, తెలుగుగంగ కాలువ అనుసంధానం చేస్తామని, వెలిగొండ ద్వారా పశ్చిమ ప్రాంతానికి నీరందిస్తామన్నారు. నల్లమల అడవుల ద్వారా టూరిజం హబ్ నిర్మిస్తామన్నారు.

వేల కోట్లు కుమ్మరింత

మొదటిపేజి తరువాయి

చేసిన విధంగానే ఈ ఎన్నికల్లోనూ బిజెపి ఖర్చు చేస్తుందని భావిస్తే ఆ మొత్తం 60,750 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. రాష్ట్రాల శాసనసభకు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చు 40 లక్షల రూపాయలు. ఛత్తీస్‌గర్‌లో బిజెపి ఎన్నికల ప్రచారాన్ని సన్నిహితంగా పరిశీలించిన నిపుణుల అభిప్రాయం ప్రకారం ఆ పార్టీ ఒక్కో నియోజకవర్గంలో మూడు, నాలుగు కోట్ల రూపాయల మొత్తాన్ని ఆ పార్టీ అభ్యర్థులకు నేరుగా అందచేసింది. ఇది కాకుండా సోషల్ మీడియాతో పాటు ఇతర రంగాల్లో ప్రచారానికి విడిగా ఖర్చు చేసింది. బిజెపి అభ్యర్థులు కూడా సొంతంగా భారీ మొత్తంలోనే నిధులు ఖర్చు చేశారు. ఇదంతా కలిపి చూస్తే ఎన్నికల సంఘం నిర్దేశించిన మొత్తానికి, బిజెపి చేసిన ఖర్చుకు ఎక్కడా పొంతన ఉండదని వీరు చెబుతున్నారు. మరో అంచనా ప్రకారం జిల్లా కార్యాలయాల నిర్మాణానికి 2,661 కోట్ల రూపాయలను, ఇతర భవనాల నిర్మాణాలకు రూ.900 కోట్లు. రాష్ట్రాల ఎన్నికలకు 16,492 కోట్ల రూపాయలు. లోక్‌సభ ఎన్నికలు 54 వేల కోట్ల నుండి 87,750 కోట్ల రూపాయల వరకు బిజెపి ఖర్చు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇంత మొత్తం ఎక్కడ నుంచి ?

బిజెపికి ఇంత మొత్తంలో నిధులు ఎక్కడ నుండి, ఎలా అందుతున్నాయన్నది చర్చనీయాంశంగా మారింది. దేశ వ్యాప్తంగా బిజెపి పెద్ద ఎత్తున కార్యాలయాలను నిర్మిస్తోంది. వీటితో పాటు ఎన్నికల ప్రచారానికి కలిపి అతి తక్కువగా అంచనా వేసినా 1.07 లక్షల కోట్ల రూపాయలు అవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇది బిజెపి 2014 -15 నుండి 2022-23 వరకు అధికారికంగా ప్రకటించిన 14,663 కోట్ల రూపాయల ఆదాయంతో పోలిస్తే ఐదు నుండి ఏడు రెట్లు ఎక్కువ! దీనిని పరిగణలోకి తీసుకుంటే ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ఆ పార్టీకి అందింది కేవలం 10శాతం మాత్రమే!

ఇంటి వద్దే పెన్షన్లు పంపిణీ చేయాలి

మొదటిపేజి తరువాయి

చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఈ పరిస్థితికి ప్రభుత్వమే కారణమని విమర్శించారు. ఒకవైపు బిజెపి బ్యాంకు ఛార్జీల పేరుతో వృద్ధుల సొమ్ము జమ చేసుకుంటుంటే మరోవైపు వైసిపి ఈ పరిణామాలను రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని, బిజెపి, వైసిపి, టిడిపి రాజకీయ చదరంగంలో పింఛనుదారులను బలిచేయడం తగదని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. బ్యాంకుల్లో జమచేసిన పింఛనుకు ఎటువంటి ఛార్జీలూ విధించరాదని, వసూలు చేసిన మొత్తాన్ని లబ్ధిదారులకు తిరిగి ఇవ్వాలని, కదలలేని వృద్ధులకు ఇంటివద్దే పెన్షన్ పంపిణీ చేయాలని కోరారు.

ద్రావిడ వర్సిటీకి ఐఎస్‌ఓ సర్టిఫికేషన్

ప్రజాశక్తి - కుప్పం

కుప్పం ద్రావిడ విశ్వ విద్యాలయానికి మొట్టమొదటిసారిగా ఇంటర్నేషనల్ అక్రిడిటేషన్ ఫెడరేషన్ నుండి ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ పొందినట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య కొలకలూరి మధు జ్యోతి తెలిపారు. ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ ప్రక్రియలో విద్య నాణ్యత బోధనా, బోధనేతర సిబ్బంది మౌలిక సదుపాయాలు నమోదు, గ్రాడ్యుయేషన్ రేట్లతో సహా విశ్వవిద్యాలయంలోని వివిధ అంశాల సమగ్ర ఆడిట్ ఉంటుందన్నారు. వర్సిటీకి న్యాక్ అక్రిడిటేషన్ సాధించడంలో ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. వర్సిటీకి రెండవసారి న్యాక్ అక్రిడిటేషన్ దరఖాస్తుకు కొన్ని వారాలు గడువు మాత్రమే ఉందని, ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ గ్రేడ్‌ను మెరుగుపరచడంలో వర్సిటీకి సహాయం చేస్తుందని అన్నారు. ఈ ధ్రువీకరణ ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్, న్యాక్ అక్రిడిటేషన్ కోసం సమర్పించబడిన డేటాకు విశ్వసనీయతను అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య టి.అనురాధ, రిజిస్ట్రార్ ఆచార్య ఏకే వేణుగోపాల్ రెడ్డి, వర్సిటీ ఐక్యూఏసీ డైరెక్టర్ శ్యామల పాల్గొన్నారు.

ఎవరికీ భయపడేది లేదు : ముద్రగడ

ప్రజాశక్తి - పిఠాపురం

తాను ఎవరికీ భయపడే వ్యక్తిని కాదని, ఎవరికీ భయపడేది లేదని కాపు ఉద్యమనేత వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక రాజుగారి కోటలో వైసిపి నాయకులు కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముద్రగడ మాట్లాడుతూ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు ఊపిరిని ఇస్తున్నాయన్నారు. అధికారం అనే ఆకలి తీర్చుకునేందుకు ఏర్పడిందే కూటమి అని విమర్శించారు. తన ఇంట్లో కూడా కుటుంబ చిచ్చు పెట్టారన్నారు. తన కుమార్తెతోనే తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారన్నారు. తన వియ్యంకుడు, జనసేన నాయకులు తన కుమార్తెతో తప్పుగా మాట్లాడించారన్నారు. తనపై ఎన్ని విమర్శలు, తప్పుడు ఆరోపణలు చేసినా భయపడేది లేదన్నారు. ఎన్నికల్లో వైసిపి శ్రేణులు అంతా ఐక్యంగా పనిచేస్తే రాబోయే ఐదేళ్లలో ప్రభుత్వం మన కోసం పనిచేస్తుందన్నారు. ఎంఎల్‌ఎగా వంగా గీతను, ఎంపీగా సునీల్ గెలిపించుకోవాలని కోరారు. ఎన్నికలు ముగిసిన తర్వాత తన పేరు ముద్రగడ పద్మనాభంగా ఉండాలా లేదా ముద్రగడ పద్మనాభ రెడ్డిగా ఉండాలో నిర్ణయించేది మీరే అన్నారు.

పోలవరం నిర్వాసితులను ముంచుతున్న నాలుగు పార్టీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి, జనసేన, బిజెపితో పాటు వైసిపి అనుసరిస్తున్న వైఖరి పోలవరం నిర్వాసితులకు శాపంగా మారింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పునరావాసానికి అవసరమైన నిధులను విడుదల చేయడానికి ససేమిరా అంటున్న సంగతి తెలిసిందే. అధికారంలో ఉన్నప్పుడు నిధులకోసం ఒత్తిడి చేయల్సిన టిడిపి,వైసిపిలు దానికి భిన్నంగా కేంద్రం అడుగులకు మడుగులొత్తాయి. జనసేన కూడా ఏ రోజు ఒత్తిడిచేసే ప్రయత్నం చేయలేదు. ఇప్పుడు ఎన్నికల వేళ ఆ పార్టీలు ప్రజలను గందరగోళ పరిచి పబ్బం గడుపుకునే వ్యూహానికి తెరతీశాయి.

రాష్ట్ర విభజన చట్టంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రప్రభుత్వమే పూర్తి చేయాలని ఉన్న విషయం తెలిసిందే. 2019 నాటికి పూర్తి చేస్తామని తెలుగుదేశం ప్రభుత్వం చెప్పినా 2021 ఖరీఫ్‌నాటికి పూర్తి చేస్తామని వైసిపి ప్రభుత్వం చాలెంజ్ చేసినా ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు నిధులను ఇవ్వడంలో పూర్తి అలసత్వం ప్రదర్శిస్తుండగా, టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఒత్తిడి పెంచి నిధులు సాధించడలో విఫలమైనాయి. సాధారణంగా ఏ ప్రాజెక్టు నిర్మాణానికి అయినా నిర్మాణం, పునరావాసం రెండింటిని కలిపి అంచనాలు రూపొందిస్తారు. కేవలం ప్రాజెక్టు నిర్మాణానికి మాత్రమే నిధులు ఇస్తామని, పునరావాసం బాద్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. రాష్ట్రం కోరుతున్న అడహాక్ నిధులు కాదుకదా ఇప్పటికే ఖర్చు చేసిన రూ 1200 కోట్ల బకాయిని విడుదల చేసేందుకు కేంద్రం కొర్రీలు పెడుతోంది. అందుకే అధికార వైసిపి పార్టీ మేనిఫెస్టో నుండి పోలవరం ప్రాజెక్టును మాయం చేసిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఆందోళన చేస్తున్న నిర్వాసితులు (ఫైల్)

బిజెపితో కూటమి కట్టిన తెలుగుదేశం, జనసేనల మేనిఫెస్టోలో పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. అయినా, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పెట్టిన తిరకాసు రాష్ట్ర ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. పోలవరం ప్రాజెక్టు కింద పునరావాస బాదితులకు డబ్బును చెల్లించేందుకు సెస్‌ను విధిస్తామని, అలాగే ప్రజల నుండి నిధులను సమీకరిస్తామని తన వంతుగా రూ కోటి ఇస్తామని చేసిన ప్రకటన పట్ల సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. కేంద్రం నుండి నిధులను రాబట్టి పూర్తి చేస్తామని చెప్పకుండా ప్రజలనుండి సెస్ ద్వారా విరాళాల ద్వారా నిధులను సేకరించి పూర్తి చేస్తామని చెప్పడం బాద్యతారాహిత్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రాజకీయ పార్టీకి కొమ్ముకాసేలా నిర్ణయాలు సరికావు

- సిఎస్‌కు చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఒక రాజకీయ పార్టీకి కొమ్ముకాసేలా నిర్ణయాలు తీసుకోవడం అభ్యంతరకరమని, అత్యంత దుర్మార్గమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ముందు సామాజిక పెన్షన్ల లబ్ధిదారుల్ని వేధించి అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. పింఛన్ల పంపిణీపై సిఎస్‌కు చంద్రబాబు శుక్రవారం లేఖ రాశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఇతర పింఛనుదారులు ఇబ్బందులు పడకుండా పెన్షన్ పంపిణీ సకాలంలో జరగాలని ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 2న మెమోలో పేర్కొన్నదని తెలిపారు. అయినా ఆ ఉత్తర్వుల్ని తుంగలో తొక్కుతూ గత నెలలో 33 మంది ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. ఈ నెల కూడా పింఛనుదారులను రోడ్లపై మండుటెండల్లో బ్యాంకుల చుట్టూ తిరిగేలా చేసి నరకయాతనకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క రోజులో పెన్షన్ల పంపిణీ పూర్తి చేసేంత వ్యవస్థ గ్రామస్థాయిలో ఉన్నప్పటికీ ఇళ్ల వద్ద ఇవ్వకుండా బ్యాంకు ఖాతాల్లో జమచేశారని, వాటిని తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులను ఇళ్లకు పంపించి చెప్పిస్తున్నారని పేర్కొన్నారు. అలా చెప్పే సమయంలో పెన్షన్ పంపిణీ పూర్తిచేసే అవకాశం ఉన్నా.. అలా చేయకుండా రాజకీయ కుట్రలకు ప్రాధాన్యమివ్వడం దుర్మార్గమని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఆడుతున్న రాజకీయ పైశాచిక క్రీడలో ప్రభుత్వ అధికారిగా భాగస్వామిగా మారడం పక్షపాత వైఖరికి నిదర్శమని విమర్శించారు. గత నెలలో 33 మంది చనిపోతే, ఈ నెల ఇప్పటికే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. తక్షణమే ప్రతి లబ్ధిదారుడికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు లేఖ

ఎన్నికల్లో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులకు చంద్రబాబు మరో లేఖ రాశారు. పోస్టింగులు, బదిలీల కోసం రాజకీయ నాయకుల చుట్టూ తిరగకుండా, వారి గౌరవాన్ని పెంచేందుకు రాష్ట్రంలో మొదటిసారిగా కౌన్సిలింగ్ విధానాన్ని టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఎంతటి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఒకటినే జీతాలు ఇవ్వడంలో ఏనాడూ వెనుకాడలేదని పేర్కొన్నారు.

పెన్షన్ల కష్టాలకు చంద్రబాబుదే బాధ్యత: వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పెన్షన్‌దారుల కష్టాలకు చంద్రబాబే బాధ్యత వహించాలని మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటివద్దకు అందే పెన్షన్‌లను చంద్రబాబు తన మనుషుల ద్వారా అడ్డుకోవడంతో బ్యాంకుల వద్ద వృద్ధులు పెన్షన్ తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెన్షన్ల పంపిణీని అడ్డుకున్న చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ విమర్శించారు. పండుటాకుల మీద టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రతాపం చూపిందని వైసిపి అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అన్నారు.

ఇసికి ఫిర్యాదు

ఎన్నికల నిబంధనావళిని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఉల్లంఘించారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఈ మేరకు సిఇఒ ఎంకె మీనాకు వైసిపి రాష్ట్ర నాయకులు అంకంరెడ్డి నారాయణమూర్తితో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... ఈ నెల 2న చంద్రబాబు రాయచోటిలో, పవన్‌కల్యాణ్ విశాఖపట్నం దక్షిణ, పాలకొండ ఎన్నికల సభల్లో సిఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

సమాజ సేవకులుగా ఎదగాలి

- ఉపకులపతి వి.శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి)



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

సాంఘిక శాస్త్రాలు చదివే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా, సమాజ సేవకులుగా ఉన్నత స్థాయిలో రాణిస్తారని ఉపకులపతి ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస ఆడిటోరియంలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పద్మనాభం విద్యార్థులు శ్రమతో, నేర్పుతో విద్యాభ్యాసం చేయాలని కోరారు. ఆర్ట్స్ విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతారన్నారు. పట్టుదలతో చదివిన విద్యార్థులు భవిష్యత్తులో రాణిస్తారని చెప్పడానికి ఎస్వీయులో లా చదివిన విద్యార్థులు జిల్లా జడ్జిలుగా నియమించబడ్డారని తెలిపారు. చాలా సంవత్సరాల తర్వాత ఉపకులపతి చొరవతో కళాశాల దినోత్సవ ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. కళాశాల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మన అభిప్రాయంతో పాటు తోటి వారి అభిప్రాయాన్ని అర్థం చేసుకోవాలి అన్నారు. మన ప్రవర్తనను కాలాన్ని బట్టి దిశానిర్దేశం చేసుకుంటూ అభివద్ధి పథంలో పయనించాలని విద్యార్థులను కోరారు. స్నేహం నాలుగు కాలాల పాటు శాశ్వతం కావాలంటే మనం అహంకార రాహిత్యంతో గడపాలని విద్యార్థులను కోరారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలతో కూడిన జ్ఞాపకాలతో విశ్వవిద్యాలయం నుండి వెళ్లాలని కోరారు. డీన్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ఆచార్య మురళీధర్, ఎస్వీయూ పాలకమండలి సభ్యులు సుమకిరణ్ పాల్గొన్నారు.

జూన్ ఆఖరు వరకు ట్యాంకర్ల ద్వారా నీరు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బంది రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. తాగునీరు, ఉపాధి హామీ పనులపై శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాగునీటి ఎద్దడిని తగ్గించేందుకు జూన్ ఆఖరు వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేయాలన్నారు. భూగర్భ జలమట్టాలను ఎప్పటికప్పుడు అంచనా వేయాలని ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్‌కు సంబంధించిన పనులను ఈ నెల 13న ఎన్నికల అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆమోదంతో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ.. తాగునీటికి ఇబ్బంది గల 281 ఆవాసాలకు ప్రస్తుతం ట్యాంకుల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. మొత్తం 3,075 ఆవాసాలకు జూన్ ఆఖరు వరకు ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. కరువు మండలాల్లో వేసవి కార్యాచరణ ప్రణాళిక అమలుకు రూ.39 కోట్లకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిందన్నారు. తాగునీటి అవసరాల నిమిత్తం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపేందుకు ప్రకాశం బ్యారేజి, నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువల ద్వారా ఈ నెల ఒకటి వరకు నీటిని విడుదల చేశామని చెప్పారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇఎన్‌సి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మారిన ప్రాధాన్యత

- సామాజిక పింఛన్లకు చాలని నిధులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత ఒక్కసారిగా మారింది. ఇన్నాళ్లు సామాజిక పింఛన్లకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ ఉద్యోగుల జీతాల విషయం పట్టించుకోని ప్రభుత్వం ఈ సారి దానికి భిన్నమైన వైఖరి తీసుకుంది. ఒకటవ తేదిన ఉద్యోగులకు జీతాలు చెల్లించివేసింది. దీంతో సామాజక పింఛన్ల పంపిణీకి కొంత మేర నిధుల కొరత ఏర్పడినట్లు సమాచారం. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, ఆర్థికశాఖ అధికారుల మధ్య తీవ్రంగానే చర్చలు నడిచినట్లు తెలిసింది. అయితే చివరకు ముఖ్యమంత్రి కార్యాలయం అభీష్టం మేరకే ప్రాధాన్యతల్లో మార్పులు చేసినట్లు ఆర్థికశాఖ చెబుతోంది.

గత కొన్నేళ్లుగా నవరత్నాల అమలుకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం, ఉద్యోగుల జీతాలు, పింఛన్లపై మాత్రం పెద్దగా ఆసక్తి చూపని విషయం తెలిసిందే. దీనికోసం ముందు నెల చివరి రోజుల్లో వచ్చిన ఆదాయాన్ని కూడా ఒక్కపైసా ఖర్చు చేయకుండా దాచి పింఛన్లకు వినియోగించారు. ఈకారణంగానే ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేకపోయినట్లు అధికారికంగా ప్రభుత్వం చెప్పిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పుడు పరిస్థితి మారి ఉద్యోగులకు ఒకటో తేదినే జీతాలు, పింఛన్లు అందాయి. దీంతో సామాజిక పింఛన్లకు కొంత మేర నగదు కొరత ఏర్పడినట్లు చెబుతున్నారు. తాజాగా సెక్యూరిటీల వేలం ద్వారా వచ్చే రుణం ప్రస్తుతం చేతికందడంతో కొద్ది రోజుల్లోనే పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని యోచిస్తున్నారు.

వైసిపి పాలనంతా అవినీతిమయం

- సినీ నటుడు బాలకృష్ణ

ప్రజాశక్తి - మాధవధార, ఆరిలోవ (విశాఖపట్నం)

రాష్ట్రంలో వైసిపి ఐదేళ్ల పాలనంతా అవినీతిమయంగా మారిందని సినీ నటుడు, టిడిపి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విమర్శించారు. విశాఖ జిల్లాలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత పార్క్ హోటల్ నుంచి బాలకృష్ణ రోడ్ షో నిర్వహించారు. అప్పుఘర్, జోడుగుళ్లపాలెం, పోలీస్ క్వార్టర్స్ మీదుగా విశాలాక్షినగర్, హనుమంతువాక, పాత డెయిరీఫారం, ఆదర్శనగర్, తోటగరువు, బాలాజీనగర్, అంబేద్కర్ కూడలి, ఆరిలోవ టిఐసి పాయింట్, ఆరిలోవ కాలనీ తదితర చోట్ల ఆయన యాత్ర సాగింది. కంచరపాలెం మెట్టు వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని జగన్ మోసం చేశారన్నారు. జాబ్ కేలండర్‌ను విస్మరించారని అన్నారు. ఆయన తీరుతో రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని, ప్రశాంతమైన విశాఖ నగరాన్ని భూకబ్జాల నగరంగా మార్చారని, ప్రకృతిని ధ్వంసం చేశారని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించారని ఆరోపించాఉ. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు రప్పించుకోలేకపోయిన అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి విశాఖపట్నం ఎంపి అభ్యర్థి శ్రీ భరత్, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు, బిజెపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న బాలకృష్ణ

బ్రిజ్‌భూషణ్ కుమారుడికి బిజెపి టికెట్ సర్వత్రా విమర్శల వెల్లువ



న్యూఢిల్లీ : ఆరుసార్లు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై, మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌కు టికెట్ ఇవ్వకుండా బిజెపి వ్యూహాత్మకంగానే పక్కనపెట్టింది. ఆయనకు బదులు ఆయన కుమారుడైన కరణ్ భూషణ్‌సింగ్‌ను ఈసారి ఎన్నికల పోటీలో నిలిపింది. బ్రిజ్‌భూషణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న యుపిలోని కైసర్‌గంజ్ స్థానం నుంచే కరణ్ భూషణ్ సింగ్‌ను బరిలోకి దింపడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా బ్రిజ్ భూషణ్ వల్ల తమ కెరీర్‌నే పణంగా పెట్టి పోరాడుతున్న రెజ్లర్లు బిజెపి నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరణ్‌కి ఎంపి టికెట్ ఇచ్చినట్లు బిజెపి ప్రకటన అనంతరం ప్రముఖ రెజ్లర్ సాక్షిమాలిక్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో భావోద్వేగభరితమైన పోస్టు పెట్టారు. ఎండనకా.. వాననకా ఎన్నోరోజులు నిరసనలు చేసినా బ్రిజ్‌భూషణ్‌ను ఇంతవరకు అరెస్టు ఎందుకు చేయలేదు అని ఆమె ప్రశ్నించారు. అరెస్టు సంగతి పక్కనపెట్టండి.. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి కుమారుడికే ఎంపి టిక్కెట్ ఇచ్చి.. దేశంలోని కోట్లాది మంది ఆడబిడ్డల మనోధైర్యాన్ని దెబ్బతీశారని.. ఒక వ్యక్తి ముందు దేశ ప్రభుత్వం ఇంత బలహీనంగా ఉందా అని సాక్షిమాలిక్ ఈసందర్భంగా మోడీ ప్రభుత్వాన్ని నిలదీశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తులను శిక్షించడంలో తీవ్ర అలసత్వం వహించిన బిజెపి, అటువంటి నేపథ్యం ఉన్న వారి కుటుంబాలను చట్టసభలకు పంపించడానికి ప్రయత్నించడం మహిళల పట్ల ఆ పార్టీకి ఏపాటి గౌరవముందోనని అర్థమవుతుంది. బిజెపి ప్రభుత్వం మహిళలపై ఎంత నిరంకుశంగా వ్యవహరిస్తున్నదో ఢిల్లీ మహిళా కమిషన్ (డిసిడబ్ల్యు)లో వందలాది మంది ఉద్యోగుల్ని తొలగిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా తాజా ఉత్తర్వులుఉదాహరణగా చెప్పుకోవచ్చు. కాగా బాబ్రీ మసీదు కూల్చివేత కేసులో బ్రిజ్‌భూషణ్ నిందితుడు. 2020లో కోర్టు ఆయన్ని నిర్దోషిగా ప్రకటించింది.

కోవిడ్ వ్యాక్సిన్ సర్టిఫికెట్లపై మోడీ ఫొటో ఏమైంది? ఆర్‌జెడి నేత మీసా భారతి



పాట్నా : కోవిడ్ వ్యాక్సిన్‌పై అనుమానాలు వ్యక్తం అవుతుండటం వల్లే.. ఫొటో వ్యాక్సిన్ సర్టిఫికెట్‌పై ప్రధాని ఫొటో తొలగించారని ఆర్‌జెడి నేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతి అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో మీసా భారతి పాటలిపుత్ర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోడీపై ఆమె విమర్శలు గుప్పించారు. 'ప్రధానికి ప్రతి దానిపై క్రెడిట్ తీసుకోవడం అలవాటు. అయితే కరోనా వ్యాక్సిన్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నందున వ్యాక్సిన్ సర్టిఫికెట్లపై మోడీ ఫొటో తొలగించారు.' అన్నారు. వ్యాక్సిన్‌పై పూర్తిస్థాయి దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. అయితే ఎన్నికల కోడ్ ఉన్నందువల్లే కోవిడ్ వ్యాక్సిన్ సర్టిఫికెట్లపై ప్రధాని ఫొటో తొలగించినట్లు బిజెపి నేతలు చెబుతున్నారు.


ఉత్తర కర్ణాటకలో బిజెపికి రేవణ్ణ దెబ్బ

- అంతర్గత కలహాలకు తోడు ప్రజ్వల్ సెక్స్ కుంభకోణం
- మలి విడత ఎన్నికల్లో కమలం ఎదురీత

షఫీవుల్లా



మాజీ ప్రధానమంత్రి హెచ్‌డి.దేవెగౌడ మనుమడు, సిట్టింగ్ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ కుంభకోణం కర్నాటక రాజకీయాలను కుదిపేస్తోంది. సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు ముందు రేవణ్ణ వ్యవహారం బహిర్గతం కావడంతో జెడిఎస్‌తో పాటు ఆ పార్టీతో ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్న బిజెపి పరిస్థితి కుడితిలోపడ్డ ఎలుక మాదిరి తయారైంది. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ఈ అంశం కాంగ్రెస్‌కు ప్రచారాస్త్రంగా మారింది. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ, ఖర్గే వంటి జాతీయ నాయకులతో పాటు, రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ నేతలు రేవణ్ణ సెక్స్ కుంభకోణంపై చీల్చిచెండాడుతున్నారు. దాంతో జెడిఎస్, ఆ పార్టీకి మిత్రపక్షమైన బిజెపి ఇరుకునపడ్డాయి. రేవణ్ణ లైంగిక వేధింపుల వ్యవహారం బిజెపికి ఎన్నికలకు ముందే తెలిసినా పొత్తు పెట్టుకుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పుడు అసలు విషయం బయటికొచ్చాక ఏమీ తెలియదని బిజెపి బుకాయిస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.



హసన్ మాజీ ఎంపి, ప్రస్తుత బిజెపి-జెడిఎస్ ఉమ్మడి అభ్యర్థి అయిన ప్రజ్వల్ రేవణ్ణ వందలాది మంది మహిళలను లైంగికంగా వేధింపులకు గురిచేయడమే కాకుండా వాటిని వీడియోల రూపంలో చిత్రీకరించడం జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ మేరకు కొన్ని వీడియోలకు సంబంధించిన పెన్‌డ్రైవ్‌లు బయటకు రావడం పెద్ద దుమారమే రేపింది. ఈ వ్యవహారం బయటకు పొక్కగానే రేవణ్ణ విదేశాలకు పారిపోయారు. కర్నాటక ప్రభుత్వం ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసింది. దీనిపై దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ సిట్ ఇప్పటికే లుక్‌అవుట్ నోటీసును జారీ చేసింది. ప్రస్తుతం ఈ విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో అక్కడ లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండటంతో రాజకీయ వేడిని మరింత రాజేస్తున్నాయి. రెండు విడతల్లో ఇక్కడ ఎన్నికలు జరుగుతున్నాయి.

గతంలో ఇక్కడే బిజెపికి అధిక సీట్లు

కర్నాటకలో మొత్తం 28 లోక్‌సభ సీట్లు ఉంటే దక్షిణ కర్నాటకలోని 14 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 26వ తేదీన మొదటి విడత కింద ఎన్నికలు జరిగాయి. రేవణ్ణ పోటీ చేసిన హసన్ లోక్‌సభ స్థానం ఎన్నికలు కూడా ఏప్రిల్ 26వ తేదీనే ఎన్నికలు ముగిశాయి. ఇవి పూర్తయిన తరువాత రేవణ్ణకు సంబంధించిన సెక్స్ వీడియోలు బయటకొచ్చాయి. దీని ప్రభావం మే 7వ తేదీన జరగబోయే రెండో విడత పోలింగ్‌పై ఉండే అకాశముందన్న గుబులు బిజెపి నేతల్లో ఉంది. ఉత్తర కర్నాటకలో బిజెపికి గత ఎన్నికల్లో అత్యధిక స్థానాలొచ్చాయి. షిమోగా, ఉత్తర కన్నడ, ధార్వాడ్, హావేరి వంటి కీలకమైన లోక్‌సభ స్థానాలున్నాయి. రేవణ్ణ వ్యవహారంతో ఇప్పుడు రాజకీయంగా బిజెపి, జెడిఎస్ కుటమికి ఇబ్బందికరంగా మరిందనే చెప్పవచ్చు. ఎందుకంటే రేవణ్ణ కొన్ని వందల మంది మహిళలను





లైంగికంగా వేదించాడన్న ఆరోపణలొస్తున్నాయి. దీంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లోకి బిజెపి పడింది. అక్కడనున్న కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బుకాయించే ప్రయత్నం చేస్తోంది. అయితే కాంగ్రెస్ మాత్రం ఈ విషయం ముందుగానే బిజెపికి తెలిసినా పట్టించుకోకుండా జెడిఎస్‌తో బిజెపి పొత్తులు పెట్టుకుందని తిప్పికొడుతోంది. రేవణ్ణ రేపిస్టే కాదు.. సామూహిక అత్యాచారం చేసిన వాడని షిమోగా ప్రచారంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు.

తగాదాల్లో తలమునకలు

ఉత్తర కర్నాటకలో బిజెపి అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతోంది. షిమోగాలో మాజీ ముఖ్యమంత్రి ఎడ్యూరప్ప కుమారుడు రాఘవేంద్ర పోటీ చేస్తున్నారు. ఈయనకు వ్యతిరేకంగా రెబల్ అభ్యర్థిగా మాజీ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరప్ప పోటీ చేసియున్నారు. ఇదే విధంగా ధ్వారాడ్‌లో కేంద్ర మాజీ మంత్రి ప్రహ్లాద్ జోషికి వ్యతిరేకంగా స్వామిజీ నామినేషన్ వేశారు. ఆ తరువాత ఆ పార్టీ ముఖ్యనేతల జోక్యంతో వెనక్కు తగ్గారు. అయితే వారి నుంచి జోషికి పెద్దగా సహకారం లభించే పరిస్థితులు కనిపించడం లేదు. ఇకపోతే హావేరీ నియోజకవర్గం నుంచి మాజీ ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై పోటీ చేస్తున్నారు. వీరందరికీ రేవణ్ణ వ్యవహారం పెద్ద సమస్యగానే మారింది.

మమత కోటలో 'సైరా'

- కలకత్తా దక్షిణ స్థానంలో సిపిఎం నుంచి పోటీ
- కాంగ్రెస్, లెఫ్ట్ మద్దతు
- టిఎంసి నుంచి సిట్టింగ్ ఎంపి మాలా రాయ్



మమత బెనర్జీ అడ్డా కలకత్తా దక్షిణ లోక్‌సభ నియోజకవర్గంలో సిపిఎం జెండా పాతేందుకు సైరా షా హలీమ్ కష్టపడుతున్నారు. అక్కడి రాజకీయ దృశ్యాన్ని మార్చేందుకు సిపిఎం అభ్యర్థిగా అమె బరిలోకి దిగారు. ఆమె అంటే టిఎంసికిఎంత భయమంటే, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నివాసం ఉంటున్న వీధుల్లోకి ప్రచారానికి వెళ్లకుండా సైరా షా హలీమ్ ను అడ్డుకున్నారు. 2022లో బాలిగంజ్ ఉప ఎన్నికల్లో హలీమ్ ఓడిపోయినా, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 5 శాతంగా ఉన్న సిపిఎం ఓట్ల శాతాన్ని 30 శాతానికి పెంచారు. బిజెపి మూడో స్థానానికి పడిపోయింది.



ఉప ఎన్నికల్లో నైతిక విజయం

బల్లిగంజ్ ఎమ్మెల్యే సుబ్రతా ముఖర్జీ మరణించిన నేపథ్యంలో 2022లో జరిగిన ఉప ఎన్నిక ఆసక్తికరంగా మారింది . నగరం నడిబొడ్డుగా భావించే బల్లిగంజ్ ఎన్నికలు సైరా షా మొదటి ఎన్నికల ప్రయాణం. బిజెపిని, టిఎంసిలపై పోరాడి గెలుపుకు దగ్గరగా వచ్చారు. కొన్ని బూత్‌లలో అవకతవకలు, అక్రమాలు, దౌర్జన్యాలు జరగకపోతే తనదే గెలుపని, తనదే నైతిక విజయమని సైరా షా చెప్పారు. 'ప్రజలు నాపై, నా పార్టీపై ప్రేమ, ఆప్యాయతలను కురిపించారు" అని అన్నారు.

నసీరుద్దీన్‌షా మేనకోడలు

హలీమ్ ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షా మేనకోడలు. ఆమె తండ్రి లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) జమీర్ ఉద్దీన్ షా. సిపిఎం నాయకుడు, మాజీ స్పీకర్ హషీమ్ అబ్దుల్ హలీమ్ కుమారుడు డాక్టర్ ఫువాద్ హలీమ్ ఆమె భర్త. సైరా షా హలీమ్ కలకత్తాలో జన్మించినప్పటికీ , ఆమె తండ్రి ఆర్మీ నేపథ్యం ఆమెను పంజాబ్, మణిపూర్, నాగాలాండ్, తమిళనాడు (ఊటీ)లలో విద్యనభ్యసించారు. రియాద్‌లో రెండేళ్లు ఉన్నారు. ఆమె తండ్రి గల్ఫ్‌లో దేశ రక్షణ తరపున నియమితులయ్యారు. అజ్మీర్‌లోని సోఫియా గర్ల్స్ కాలేజీలో గ్రాడ్యుయేట్, ఆంగ్ల సాహిత్యంలో మాస్టర్స్ చేసిన హలీమ్, సోషల్ వర్క్ వైపు మొగ్గు చూపడానికి ముందు పలు సంస్థల్లో పని చేశారు. కలకత్తాలో ఎన్‌ఆర్‌సి, సిఎఎ వ్యతిరేక నిరసనలలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో కలకత్తా దక్షిణ నుంచి సిపిఎం నుంచి సైరా షా హలీమ్ బరిలోకి దిగగా టిఎంసి నుంచి మాలా రాయ్, బిజెపి నుంచి కేంద్ర మంత్రి దేబశ్రీ చౌదరి పోటీ చేస్తున్నారు. 'గతసారి మేము ప్రధానంగా బిజెపి డబ్బుపై పోటీ ఇచ్చాం. ఈసారి మేము అవినీతి టిఎంసి, ఫాసిస్ట్ బిజెపి రెండింటినీ ఓడిస్తాము' అని కాళీఘాట్ వద్ద ప్రచారంలో సైరా షా హలీమ్ తెలిపారు.

ఎన్నో పాఠాలు

లోక్‌సభ ఎన్నికలు పూర్తిగా భిన్నమైన బాల్ గేమ్. గతంలోనిది అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నిక. ఈసారి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు. అలాగే, ఈ ప్రాంతం మమతా బెనర్జీకి అత్యంత ప్రతిష్టాత్మకం. ఇక్కడ గతంలో మమత గెలిచారు. ఇక్కడ ప్రస్తుత ఎంపిగా మాలా రాయ్ ఉన్నారు. సవాలుతో కూడుకున్న భూభాగం. కానీ, పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్న అక్రమ నిర్మాణాలు, నియోజకవర్గాన్ని పట్టి పీడిస్తున్న వివిధ వ్యాధులు, నిరుద్యోగం వంటి అనేక సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నది సైరా షా ప్రచారంలోని ముఖ్యాంశాలు. సిఎఎ, ఎన్‌ఆర్‌సి నిరసనల్లో కావచ్చు, ప్రతి ఒక్కరి హక్కుల గురించి నేను గొంతెత్తాను. ఏదైనా ముఖ్యమైన బిల్లు ఆమోదం పొందాల్సి వస్తే వాకౌట్ చేయడం వల్ల ఉపయోగమేంటి? సిఎఎ ఆమోదం పొందుతున్న సమయంలో టిఎంసి ఎంపిలు వాకౌట్ చేశారు. వారి హాజరు పేలవంగా ఉంది. కాబట్టి, నా అభిప్రాయం ప్రకారం, అటువంటి అభ్యర్థులు నిరోధకులుగా ఉంటారు. నా నియోజకవర్గ ప్రజలు నన్ను ఎన్నుకోవాలని నిర్ణయించుకుంటే, నేను పార్లమెంటేరియన్‌గా ఉండి ప్రజలకు అండగా నిలుస్తాను' అంటున్నారు సైరా షా.

నాన్ లోకల్ కాదు.. కలకత్తా అమ్మాయిని

నాన్‌లోకల్ అనే ప్రత్యర్థుల విమర్శలను ఆమె తిప్పి కొట్టారు. 'ఈ ప్రాంతంలోని యువతతో నాకు చాలా అనుబంధం ఉంది. ప్రజా ఉద్యమాలలో భాగస్వామ్యం అయ్యాను. కాబట్టి నా అభ్యర్థిత్వంలో బయటి వ్యక్తి అనే వారికి ఇదే నా సమాధానం. నేను కలకత్తా అమ్మాయిని. మా నాన్న యువ కెప్టెన్‌గా ఇక్కడకు వచ్చినప్పుడు నేను కలకత్తాలో పుట్టాను. ఆర్మీ మేన్ కూతురినైన నాకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పెరిగే అవకాశం కూడా ఉంది' అన్నారు. ఇండియా ఫోరంలో భాగంగా తనకు కాంగ్రెస్ మద్దతిస్తోందని, ఇతర వామపక్ష పార్టీలు సైతం మద్దతిస్తున్నాయన్నారు.

జె.జగదీష్

కలం బాణాలు

ముద్రగడ, క్రాంతి మధ్య మాటల యుద్ధం



అయ్యారే బాగున్నది
అయ్య తనయ యుద్ధం
జగన్ పవన్ పక్షంగా
వీడియోలు సిద్ధం


ఎవరి తీరు వారిదిలే
డెమోక్రసీ కాలం
ప్రాపర్టీ అన్నారే
అదే తప్పు భావం

మళ్లీ పెన్షనర్ల ఘోష

వాకిటికే వలంటీర్లు
తెచ్చినట్టి పెన్షను
ఎలక్షన్ల యుద్ధంలో
చావు బతుకు టెన్షను

మళ్ళీ మొదలయ్యేనా
బలహీనుల ఘోష
ఎవరిది తప్పో తేలని
రాజకీయ శోష

రాహుల్‌ని ప్రధాని చేయాలని పాకిస్థాన్ తహతహ : మోడీ



పాక్ నేతలు రాహుల్ కై
మరీమరీ నిరీక్షణా?
రాజకీయ లబ్దికొరకు
మతిమాలిన భాషణా?

మతం కార్డు తో మోడి
ఆపరులే దాడి
వైరిదేశ శక్తులతో
వేస్తారా లేని ముడి

- తె.ర



నంద్యాల బరిలో గెలుపు గుర్రాలెవరు?

- పార్లమెంటు బరిలో 31 మంది, అసెంబ్లీ పరిధిలో 140 మంది పోటీ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాల పరిధిలో 171 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. నంద్యాల పార్లమెంటు స్థానానికి 31 మంది పోటీ పడుతుండగా, ఏడు అసెంబ్లీ స్థానాలకు 140 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇండియా వేదిక తరపున ఆరు స్థానాల్లో కాంగ్రెస్, ఒక స్థానంలో సిపిఎం అభ్యర్థులు బరిలో ఉన్నారు.

నంద్యాల పార్లమెంటు స్థానానికి టిడిపి తరపున మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కుమార్తె బైరెడ్డి శబరి, వైసిపి తరపున సిట్టింగ్ ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థి జెంగిటి లక్ష్మీనరసింహాయాదవ్ పోటీ పడుతున్నారు. ఈ స్థానానికి ఈ ముగ్గురి మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఎవరికి వారు ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. నంద్యాల అసెంబ్లీ స్థానానికి 28 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. టిడిపి నుంచి మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, కాంగ్రెస్ తరపున నంద్యాల జెడ్పిటిసి గోకుల్ కృష్ణారెడ్డి బరిలో ఉన్నారు. ఆళ్లగడ్డ అసెంబ్లీ స్థానానికి 18 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. టిడిపి తరపున మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి, కాంగ్రెస్ తరపున బరగొడ్ల హుసేన్ బాషా బరిలో ఉన్నారు. డోన్ అసెంబ్లీ స్థానానికి 16 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. టిడిపి నుంచి కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, వైసిపి నుంచి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మద్దిలేటి స్వామి బరిలో ఉన్నారు. కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి మూడు పర్యాయాలు ఎంపిగా, కేంద్ర రైల్వే సహాయశాఖ మంత్రిగా పనిచేశారు. బుగ్గన రాజేంద్రనాథ్ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నారు. దీంతో డోన్‌లో ఉద్దండుల మధ్య పోటీ నెలకొంది. బనగానపల్లె అసెంబ్లీ స్థానానికి 28 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. టిడిపి తరపున మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి, వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాంగ్రెస్ తరపున గూటం పులయ్య అలియాస్ బాలు యాదవ్ బరిలో ఉన్నారు. నందికొట్కూరు అసెంబ్లీకి 18 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. టిడిపి తరపున గిత్త జయసూర్య, వైసిపి తరపున దారా సుధీర్, కాంగ్రెస్ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ బరిలో ఉన్నారు. ప్రచారంలో ఎవరికి వారు ధీటుగా ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆర్థర్‌కు సొంత గ్రూపు ఉండటంతో ఈ స్థానానికి త్రిముఖ పోరు నెలకొంది. శ్రీశైలం అసెంబ్లీకి 18 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. టిడిపి నుంచి మాజీ ఎమ్మెల్యే బి రాజశేఖర్ రెడ్డి, వైసిపి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, కాంగ్రెస్ తరపున సయ్యద్ ఇస్మాయిల్ పోటీ పడుతున్నారు. టిడిపి, వైసిపి అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొని ఉండగా, కాంగ్రెస్ అభ్యర్థి గట్టి పోటీ ఇవ్వనున్నారు.


పోచా బ్రహ్మానందరెడ్డి


బైరెడ్డి శబరి


జెంగిటి లక్ష్మీనరసింహాయాదవ్

రెండు జిల్లాల్లో పాణ్యం నియోజకవర్గం

ఒకే నియోజకవర్గం రెండు జిల్లాల్లోనూ భాగాలుగా విడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో సగం కర్నూలు జిల్లాలో, సగం నంద్యాల జిల్లాల పరిధిలోకి వెళ్లింది. కర్నూలు జిల్లాలోకి కల్లూరు, ఓర్వకల్లు మండలాలు, నంద్యాల జిల్లాలోకి పాణ్యం, గడివేముల మండలాలు చేరాయి. ఈసారి ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. టిడిపి, వైసిపి, సిపిఎం మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వైసిపి తరపున కాటసాని రాంభూపాల్ రెడ్డి, టిడిపి తరపున గౌరు చరితా రెడ్డి, సిపిఎం తరపున డి గౌస్ దేశాయ్ పోటీలో ఉన్నారు. పాణ్యం నియోజకవర్గంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి 2019లో ఆరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.


చరితా రెడ్డి


కాటసాని రాంభూపాల్ రెడ్డి


డి గౌస్ దేశాయ్

విద్యార్థి నాయకుడి నుంచి ఉద్యమాల్లోకి..

పాణ్యం నియోజకవర్గ అభ్యర్థి డి గౌస్ దేశాయ్ విద్యార్థి నాయకుడి నుంచి ఉద్యమాల్లోకి వచ్చారు. ప్రస్తుతం కర్నూలు జిల్లా సిపిఎం కార్యదర్శిగా ఉన్నారు. డి గౌస్ దేశాయ్ కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలం, కల్లుకుంటలో మధ్య తరగతి రైతు కుటుంబంలో డి ఖాదర్ దేశాయ్, జైనబ్బిల దంపతులకు 1969 జూన్ 1న జన్మించారు. ఇంటర్‌మీడియట్ చదువుతున్నపుడే 1986లో విద్యార్థి సంఘం (ఎస్ఎఫ్ఐ)లో చేరి బిఇడి పూర్తయ్యే వరకు విద్యార్థి ఉద్యమంలో పని చేశారు. 1988లోనే సిపిఎం సభ్యత్వం పొందారు. ఆదోని ఆర్ట్స్ కాలేజిలో హాస్టల్ విద్యార్థుల సమస్యలపై, అధిక ఫీజులకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాల్లో పాల్గొని నాయకత్వం వహించారు. 1993లోనే సొంత గ్రామంలో యువజన సంఘం పెట్టి అక్కడ సిపిఎంకు పునాదులు వేశారు. ఆ గ్రామంలో సిపిఎం సర్పంచ్‌గా గెలిచేలా కృషి చేశారు. 1995లో కర్నూలు నగరంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శిగా, 1998 నుండి 2001 వరకు జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 2002 నుండి సిఐటియు కర్నూలు నగర కార్యదర్శిగా, 2005 నుండి 2010 వరకు సిఐటియు జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. 2010 నుండి 2017 వరకు పార్టీ కర్నూలు నగర కార్యదర్శిగా, 2018 నుండి 2022 సిఐటియు జిల్లా కార్యదర్శిగా ప్రస్తుతం సిపిఎం జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్నారు. 1989లో నిరుద్యోగ సమస్యపై కర్నూలు జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్రకు నాయకత్వం వహించి పాల్గొన్నారు.

విద్యుత్ పోరాటంలోనూ, ఇళ్ళ స్థలాలు, భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలని కోరుతూ 2005లో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో జరిగిన నిరవధిక దీక్షలో కర్నూలు జిల్లా నుండి 6 రోజులపాటు పాల్గొని కోనేరు రంగారావు కమిటీ ఏర్పాటుకు కృషి చేశారు. 2010లో కర్నూలు నగరంలో ఇళ్ళ స్థలాల సమస్యపై 6 రోజులపాటు నిరవధిక దీక్షల్లో పాల్గొని ప్రభుత్వం నుండి రాత పూర్వక హామీ వచ్చేలా కృషి చేశారు. అలాగే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని, కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ 2018లో ఒకసారి, 2023లో మరోసారి పాదయాత్ర చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఆర్‌టిసి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాల్గొనడం వల్ల 13 రోజులపాటు కడప సెంట్రల్ జైలులో ఆయన్ను పెట్టారు. కర్నూలు నగరంలో ప్రజా సమస్యంపై చేస్తున్న ఉద్యమాల కారణంగా అనేక కేసులు మోపబడ్డాయి.

పోస్టల్ బ్యాలెట్ వేసే విధానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, అధికారులు ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకుంటారు. ఎక్కడ నుండైనా వారికి కేటాయించిన ప్రాంతంలో నుండి ఓటు వేసుకునే విధంగా దీనిలో అవకాశం ఉంటుంది. ఐదు, ఆరు, ఏడు తేదీల్లో కేటాయించిన ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఇలా ఓటు వేసుకునేందుకు నాలుగు రకాల ఫారాలు ఇస్తారు. ఇందులో ఫారం అంటే పూర్తి చేసి ఇచ్చేది కాదు. ఓటును పెట్టే కవర్‌ను కూడా ఫారంగానే పరిగణిస్తారు. దీనిలో 13ఎ(ఫారం-ఏ) ఇది డిక్లరేషన్, 13బి (ఫారం-బి) చిన్న కవర్, 13సి(ఫారం-సి) పెద్దకవర్, బ్యాలెట్ పేపర్-13డి ఉంటుంది. 13డిలో ఓటు ఎలా వేయాలనే అంశానికి సంబంధించిన సూచనలు ఉంటాయి. ఇది ఓటు వేసే వారికోసమే ఇస్తారు. 13ఏ ఇది పేపరు రూపంలో ఉంటుంది. దీనిమీద మన వివరాలు పూర్తిచేసి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలి. సంతకం చేసే అధికారి కూడా అక్కడే ఉంటారు. 13బి అంటే ఎన్వలప్ కవర్ ఉంటుంది. ఇది చిన్న కవరు మాత్రమే. దీనిమీద బ్యాలెట్ పేపర్ సీరియల్ రాసి ఇస్తారు. దీనిలో మనం అనుకున్న వ్యక్తికి టిక్‌మార్కుపెట్టి ఫారం బి కవర్లో పెట్టి సీల్ వేయాలి. అనంతరం 13సి రూపంలో ఇచ్చే పెద్దకవరులో పెట్టిన తరువాత ఏ అసెంబ్లీ, పార్లమెంటు అయితే వాటిపేరు రాయాల్సి ఉంటుంది. అనంతరం తొలుత ఇచ్చిన డిక్లరేషన్ ఫారం, బ్యాలెట్‌ను చిన్న కవర్లో పెట్టిన తరువాత రెండిటినీ కలిపి పెద్దకవర్లో పెట్టి సీల్ చేసిన బాక్సులో వేసేయాలి. ఒకవేళ దీనిపై అవగాహన కలగకపోతే అక్కడే పోలింగు అధికారి, అసిస్టెంట్ పోలింగు అధికారి కూడా ఉంటారు. ఓటు వేసిన తరువాత ఎలా చేయాలో ఏమి చేయాలో దగ్గరుండి వివరిస్తారు.



ప్రకాశంలో హోరాహోరీ !

- వైసిపి, టిడిపి కుస్తీ
- ఇండియా బ్లాక్ ముమ్మర ప్రచారం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రకాశం జిల్లాలో అసెంబ్లీ స్థానాలకు 115 మంది, ఒంగోలు ఎంపి స్థానానికి 25 మంది బరిలో ఉన్నా... వైసిపి, తెలుగుదేశం, కాంగ్రెస్ అభ్యర్థులే ప్రధానంగా పోటీలో ఉన్నారు. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అయితే ఎనిమిదో నియోజకవర్గమైన సంతనూతలపాడు... బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఉంది. అన్ని స్థానాల్లోనూ హోరాహోరీ నెలకొంది. ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీలే అన్న చర్చ సర్వత్రా వినిపిస్తోంది. గతంలో వైసిపికి ఉన్న ఊపు ఇప్పుడు లేదు. తెలుగుదేశం ఇతర పార్టీలతో జతకట్టడంతో కొంత బలం పెరిగింది. అయితే బిజెపితో కలవడం వల్ల మైనార్టీలు దూరమవుతారనే భయం ఉంది. ఏదేమైనా అభ్యర్థులు స్థానికంగా ఉండే పరిచయాలు, ఆర్థిక సంబంధాలు, సేవా కార్యక్రమాలతోనే ఓటర్లను ఆకర్షించే యత్నం చేస్తున్నారు. ఇప్పటికే అగ్రనేతలు ఒకటీరెండు సార్లు జిల్లాకు వచ్చి ఎన్నికల ప్రచారం చేశారు. చంద్రబాబు ఒకసారి జిల్లాకు రాగా.. సిఎం జగన్ బస్సుయాత్రతో పాటు టంగుటూరులో రెండురోజుల క్రితం ఎన్నికల సభ నిర్వహించారు. లోకేష్ ఒంగోలులో యువజనులతో సదస్సు నిర్వహించగా.. బాలకృష్ణ కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో రోడ్‌షోలు నిర్వహించారు.


చెవిరెడ్డి భాస్కరరెడ్డి


మాగుంట శ్రీనివాసులు రెడ్డి

ఎంపి స్థానంలో ఇద్దరు నేతలూ కుస్తీ....

వైసిపి, తెలుగుదేశం అభ్యర్థులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాగుంట శ్రీనివాసులు రెడ్డి..మొన్నటివరకూ వైసిపిలోనే ఉన్నారు. ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థులుగా మారారు. గెలుపు కోసం కుస్తీలు పడుతున్నారు. భాస్కరరెడ్డి తిరుపతి జిల్లా నుండి వలస వచ్చారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. చెవిరెడ్డిని ఇక్కడ పోటీలో దింపడం వ్యూహాత్మకమే. చెవిరెడ్డి మండల కేంద్రాల్లో పరిచయ వేదికల పేరుతో భారీగా విందు భోజనాలు ఏర్పాటు చేయడం హైలైట్‌గా నిలిచింది. అసెంబ్లీ అభ్యర్థులకు ఆయనే తెరచాటున అన్ని విధాలా చూసుకుంటున్నారనే చర్చ ఉంది. ప్రచారం కన్నా సమీకరణలు పెంచుకునేందుకు జరుగుతున్న భేటీలే కీలకంగా మారాయి. మాగుంట... తన కుటుంబం రాజకీయ నేపథ్యం రీత్యా గెలుపు కోసం అన్ని వ్యూహాలూ పన్నుతున్నారు. పశ్చిమాన తన సామాజికవర్గం నుంచి ఓటు వస్తుందనే ధీమాలో ఉన్నారు. చెవిరెడ్డిపై పట్టు సాధిస్తామనే ఆశాభావంలో ఉన్నారు. మాగుంటతో పాటు ఆయన కుమారుడు రాఘవరెడ్డి కూడా ఎక్కువ పశ్చిమప్రాంతంలో దృష్టి సారించారు. కొన్నిచోట్ల అసెంబ్లీ అభ్యర్థులను మాగుంటే ఇప్పుడు నడిపించాల్సి వచ్చింది.

అసెంబ్లీల్లో హోరాహోరీ

తూర్పు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు, పశ్చిమాన వైసిపి అభ్యర్థులకు ఎడ్జ్ ఉందనే చర్చ నడుస్తోంది. జనసేన పొత్తు వల్ల ఆ సామాజికవర్గం ఓటర్లతో పాటు నేతలు కూడా ఎక్కువ శాతం తెలుగుదేశం వైపు చేరుతున్నారు. ఒంగోలు పట్టణంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. గిద్దలూరులో...80 వేల మెజారిటీ వచ్చిన అన్నా రాంబాబును కూడా మార్కాపురం మార్చారు. మంత్రి ఆదిమూలం సురేష్‌ను యర్రగొండపాలెం నుండి కొండపికి మార్చారు. ఇలా జరిగిన కొన్ని బదిలీల వల్ల అసంతృప్తులు కొంత తగ్గి గట్టిపోటీ అనే స్థాయికి వచ్చింది. ఆదిమూలపు సురేష్, సంతనూతలపాడులో మంత్రి మేరుగ నాగార్జున ఇద్దరూ గట్టి పోటీనే ఎదుర్కొంటున్నారు. ఒంగోలులోనూ మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మధ్య ఉత్కంఠభరిత పోరు నెలకొంది. ఇప్పటికి ముగ్గురు కార్పొరేటర్లు వైసిపిని వీడారు. చేరికలు వ్యూహాత్మకంగానే నడుస్తున్నాయి.

జిల్లా అభివృద్ధి గోవిందా..

అభ్యర్థుల ప్రచారంలో తెలుగుదేశం సూపర్‌సిక్స్.. వైసిపి నవతర్నాలు ఇవే ప్రధానంగా ఉన్నాయి. జిల్లా అభివృద్ధి ఎజెండా లేదు. పెండింగ్ ప్రాజెక్టుల ఊసేలేదు. ఉపాధి ప్రాజెక్టులు, పరిశ్రమలు తెస్తామనే మాట వినిపించడం లేదు. వెనుకబాటుపై చర్చ లేదు. రాష్ట్ర నేతల ప్రచారంలోనూ మేనిఫెస్టోల్లో ఉన్నవే తమ ఉపన్యాసాల్లో చెపుతున్నారు. జిల్లాల్లో చేపట్టే వాటిపై హామీలు కనిపించడం లేదు.

బందరులో గెలుపెవరిదో !

- బరిలో 15 మంది అభ్యర్థులు
- వైసిపి, జనసేన, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కృష్ణాజిల్లా కేంద్రంగా ఉన్న బందరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో వైసిపి, టిడిపి కూటమి, ఇండియా బ్లాక్ తరపున ముమ్మరంగా ప్రచారం జరుగుతోంది. ఇక ప్రచారానికి దాదాపు వారం రోజులే గడువు ఉండడంతో ప్రచారం వివిధ రూపాల్లో విస్తృతంగా సాగుతోంది. వైసిపి అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, టిడిపి, బిజెపి బలపరిచిన జనసేన అభ్యర్థిగా ప్రస్తుత ఎంపి వల్లభనేని బాలశౌరి, వామపక్షాలు, ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా గొల్లు కృష్ణతోపాటు మరో 12 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు.

గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రభుత్వంపై వ్యక్తమైన తీవ్ర వ్యతిరేకతతో మచిలీపట్నం పార్లమెంట్ నియోజక వర్గంతోపాటు, దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గన్నవరం మినహా మిగిలిన ఆరు స్థానాలనూ వైసిపి గెలుచుకుంది. అయితే కొద్ది నెలల తరువాత గన్నవరం ఎంఎల్ఎ వల్లభనేని వంశీ కూడా వైసిపిలో చేరి...టిడిపి అగ్రనేతలైన చంద్రబాబు, లోకేష్‌లపైనే తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఎన్నికల్లో గెలుపుకోసం ప్రధాన రాజకీయ పార్టీలు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్ది రోజులు ముందు బందరు సిట్టింగ్ ఎంపి బాలశౌరి వైసిపిని వీడారు.

ప్రస్తుత ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిగా జనసేన తరపున బాలశౌరి రంగంలోకి దిగారు. గత ఎన్నికల్లో బాలశౌరి 5,71,436 ఓట్లు సాధించి టిడిపి అభ్యర్థి కంటే 59,141 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. టిడిపికి 5,11,295 ఓట్లు, జనసేనకు 1,13,292, బిజెపికి 6,462 ఓట్లు వచ్చాయి. కూటమి పార్టీల ఓట్లు బదిలీ అయితే తిరిగి గెలుపొందుతామని బాలశౌరి విశ్వసిస్తున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో ముస్లిం మైనార్టీల ఓట్లు 85 వేలకుపైగా ఉన్నాయి. బిజెపితో పొత్తు కారణంగా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల ఓట్లు దూరమైతే ఫలితాలు తారుమారవుతాయనే చర్చ మరోపక్క సాగుతోంది.

ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతోపాటు రాజకీయాల్లోకి నూతనంగా ప్రవేశించిన డాక్టర్ చంద్రశేఖర్‌కు ఉన్న క్లీన్ ఇమేజ్ ఈ ఎన్నికల్లోనూ వైసిపి గెలుపుకు దోహదపడుతుందని ఆ పార్టీ ఆశిస్తోంది. అయితే ధాన్యం సేకరణ సమస్యలు ఎదుర్కొన్న రైతులతోపాటు ఉద్యోగులు, ఉపాధ్యాయ వర్గాల్లో వైసిపి ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ అభ్యర్థిగా గత ఎన్నికల్లోనూ గొల్లు కృష్ణ పోటీ చేసి 12,284 ఓట్లు సాధించారు. ఈ ఎన్నికల్లో ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన తిరిగి పోటీలో నిలిచారు. దేశవ్యాప్తంగా ఇండియా వేదికకు సానుకూలత రావడం, వామపక్షాల ఓటింగ్, కాంగ్రెస్ మేనిఫెస్టో ఆకర్షణీయంగా ఉండటంతో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన పోటీలో నిలదొక్కుకుంది.


గొల్లు కృష్ణ


డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్


వల్లభనేని బాలశౌరి

ఓటర్లు ఎవరి పక్షానో !

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో గత ఐదేళ్లలో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టి ప్రారంభించారు. బందరు ఓడ రేవు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. ఇదంతా తమ ప్రభుత్వ ఘనతగా వైసిపి ప్రచారం చేసుకుంటోంది. ఎంపి బాలశౌరి మాత్రం ఈ ప్రాజెక్టులన్నింటికీ కేంద్రం నుంచి అవసరమైన నిధులు తీసుకువచ్చానని ప్రచారం చేసుకుంటున్నారు. కేంద్ర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ విడుదల చేసిన రుణం తాను ప్రత్యేక ఖాతాలో జమ చేయించడం కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం నిధులు దారి మళ్లించే అవకాశం లేకుండా పోయిందని బాలశౌరి చెబుతున్నారు. ప్రజలు ఎవరి మాటలు విశ్వసిస్తారో ఎన్నికల తర్వాత తెలుస్తుంది. అంతకుముందు ఐదేళ్ల టిడిపి పాలనలోనూ నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఓటరు ఎటువైపు మొగ్గుచూపుతారనేది వేచి చూడాలి.

పెరిగిన సమస్యాత్మక జిల్లాలు

- ఏడు జిల్లాల్లో సెన్సిటివ్ నియోజకవర్గాల గుర్తింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సమస్యాత్మక జిల్లాలు పెరిగాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పరస్పర ఘర్షణలు రెచ్చగొట్టుకునే వాతావరణం ఉండటంతో నేరుగా అందిన పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో ఈసారి రాష్ట్రంలో ఏడు జిల్లాలను అత్యంత సమస్యాత్మకంగా అధికార యంత్రాంగం గుర్తించింది. మొత్తంగా 14 నియోజకవర్గాల్లో ఎక్కువ ఘర్షణలు జరిగే వాతావరణం ఉన్నట్లు గుర్తించింది. మొత్తం 26 జిల్లాల్లో మూడోవంతు ప్రాంతం సమస్యాత్మకం కావడంపై ప్రజాస్వామ్యవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు ప్రశాంతంగా ఎలా జరుగుతాయని ప్రశ్నిస్తున్నారు. సహజంగా గతంలో ఎన్నికల సమయంలో నాయకులు ఎదురుపడితే ఘర్షణలు జరిగేవి, లేదా పరస్పరం గౌరవించుకుని వెళ్లిపోయేవారు. ఒక్క ఫ్యాక్షన్ జిల్లాల్లోనే ఘర్షణ వైఖరి నెలకొని ఉండేది. ఈసారి కోస్తా జిల్లాల్లోనూ సమస్యాత్మక జిల్లాలను ప్రకటించారు. వాస్తవంగా నియోజకవర్గాల్లో కొన్ని ప్రాంతాలను సమస్యాత్మకం, అతి సమస్యాత్మకంగా గుర్తించి వాటిల్లో ప్రత్యేక బందోబస్తు పెట్టేవారు. ఈసారి జిల్లాలనే గుర్తించి వాటిల్లో కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహించాలని నిర్ణయించారు. అన్నమయ్య, సత్యసాయి, నంద్యాల, చిత్తూరు జిల్లాలతోపాటు కోస్తా జిల్లాలైన ఎన్‌టిఆర్, పల్నాడు, ఒంగోలు జిల్లాలను సమస్యాత్మకంగా గుర్తించారు. ఏలూరు జిల్లాలో దెందులూరు, కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, గన్నవరం, గుడివాడలోనూ నిరంతరం ఘర్షణలు జరుగుతున్నాయి. పుంగనూరులో మూడు, దెందులూరులో మూడు, మచిలీపట్నంలో మూడు, ఒంగోలులో నాలుగు, మాచర్లలో నాలుగు ఎన్నికల కేసులు నమోదు చేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఒక ఎన్నికల ప్రచార కేసు నమోదైంది. వీటిల్లోనూ ఎక్కువ నేరుగా ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని వివరణ అడిగిన తరువాత నమోదు చేశారు. ఈ నేపథ్యంలో టిడిపి, వైసిపి నాయకులు పరస్పర ఫిర్యాదులు చేసుకోవడంతో రాష్ట్ర ఎన్నికల అధికారి వాటిని కేంద్రానికి పంపారు. పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం ఆయా జిల్లాల్లో ఘర్షణ వైఖరులున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

హేలాపురిలో వ్యూహాలకు పదును !

- ఢీ అంటే ఢీ అంటున్న వైసిపి, టిడిపి కూటమి
- గట్టి పోటీనిస్తున్న ఇండియా బ్లాక్ అభ్యర్థులు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లాలో ఎన్నికల సమరం రసవత్తరంగా కొనసాగుతోంది. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి-జనసేన-బిజెపి కూటమి, ఇండియా బ్లాక్ అభ్యర్థులు వివిధ రూపాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇప్పటికే ఆయా పార్టీల రాష్ట్ర నేతలు, స్టార్ క్యాంపెయినర్లు ఒక విడత ప్రచారం గావించగా, వచ్చే వారంలో మరికొందరు నేతలు రానున్నారు. జిల్లాలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఇందులో...ఐదు నియోజక వర్గాల్లో సిట్టింగ్ ఎంఎల్ఎలకు వైసిపి సీట్లు ఇవ్వగా, పోలవరంలో సిట్టింగ్ ఎంఎల్ఏ తెల్లం బాలరాజు సతీమణి రాజ్యలక్ష్మిని, చింతలపూడి నుంచి రవాణాశాఖ అధికారిగా పని చేసిన విజయరాజును రంగంలోకి దింపింది. టిడిపి కూటమి తరపున ఉంగుటూరు, పోలవరంల్లో జనసేన, కైకలూరులో బిజెపి, ఏలూరు, నూజివీడు, దెందులూరు, చింతలపూడిల్లో టిడిపి అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

ఏలూరు పార్లమెంట్ స్థానానికి 13 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులతోపాటు వివిధ పార్టీల తరపున, ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు. ఇక్కడ వైసిపి, టిడిపి బిసి- యాదవ సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులను పోటీలోకి దింపాయి. ఇద్దరు ఆర్థికంగా సంపన్నులు కావడంతో పోటీ రసవత్తరంగా మారింది. నూజివీడులో టిడిపి కూటమి తరపున పోటీచేస్తున్న వైసిపి ఎమ్మెల్యే పార్థసారథికి అసమ్మతి పోటు తగ్గింది. ఇక్కడ ఆ కూటమి తరపున టికెట్ ఆశించిన టిడిపి నేత ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేసి చివరి నిముషంలో ఉపసంహరించుకోవడంతో కూటమి నేతలు ఊపిరి పీల్చుకున్నారు.

జిల్లాలో ప్రధానంగా కొల్లేరు, పోలవరం నిర్వాసితుల సమస్య, ఆక్వా రైతుల ఇబ్బందులు, డెల్టా పరిధిలో తాగునీటి సమస్య, చింతలపూడి రైతులకు పరిహారం, కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణం, రోడ్లు వంటి అనేక సమస్యలు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. గత పదేళ్లలో టిడిపి ప్రభుత్వంగానీ, వైసిపి ప్రభుత్వంగానీ తమ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయలేదని ప్రజలు భావిస్తున్నారు.

2019 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, సముద్రపు నీరు కొల్లేరులోకి ప్రవేశించకుండా రెగ్యులేటర్ల నిర్మాణం చేపడతామని, ఆక్వా రైతులను ఆదుకుంటామని, గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని, చింతలపూడి ఎత్తిపోతల బాధిత రైతులకు న్యాయమైన పరిహారం ఇస్తామని, పోలవరం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజి రూ.పదిలక్షలు ఇస్తామని, భూములకు అదనంగా రూ.ఐదు లక్షలు అందిస్తామని, ఏజెన్సీలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పిస్తామని అనేక హామీలను వైసిపి గుప్పించింది. అయితే ఏ ఒక్కటీ నెరవేర్చలేదు.

నియోజకవర్గాలవారీగా స్థానిక అంశాలు సైతం ప్రభావం చూపుతున్నాయి. ఓటర్లను ప్రలోభపెట్టి తమవైపు తిప్పుకునేందుకు వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వైసిపి అభ్యర్థులు చెపుతుండగా, పథకాల్లోని లోపాలను టిడిపి కూటమి అభ్యర్థులు తమ ప్రసంగాల్లో ప్రస్తావిస్తున్నారు. ఏ అంశాలు ఈ ఎన్నికల్లో ప్రభావితం చేస్తాయో వేచిచూడాల్సి ఉంది. పోలింగ్‌కు ఇక పదిరోజులు కూడా లేకపోవడంతో ప్రచారం ఉధృతమైంది. అభ్యర్థులు తమ వ్యూహాలకు మరింత పదును పెడుతూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు శతావిధాలా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయోననే విషయమై బెట్టింగ్‌లూ సాగుతున్నట్లు సమాచారం. వైసిపికి, బిజెపి-టిడిపి-జనసేన కూటమికి ఓటేయడానికి ఇష్టపడని వారు ఇండియా బ్లాక్ వైపు చూస్తున్నారు. దీంతో ఇండియా బ్లాక్ అభ్యర్థులు సైతం మెరుగైన ఓట్లు సాధించే పరిస్థితి ఉంది.

సంపాదకీయం


అయోమయంలో భూహక్కులు!

భూ రికార్డుల ఆధునీకరణ సాకుతో నీతిఆయోగ్ సూచించిన రీతిలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టం భూ యజమానులకున్న హక్కులను అయోమయంలో పడేసింది. భూ హక్కు విషయమై సివిల్ కోర్టుల్లో కేసు సైతం వేయడానికి వీలులేదని చట్టం పేర్కొనడంతో రెవెన్యూ మాయాజాలంతో తమ భూములు ఏమైపోతాయోనన్న గందరగోళం రైతాంగంలో ఏర్పడింది. దాంతో ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఇది ఒక ప్రచారాంశంగా మారింది. టిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన 'ధరణి' పోర్టల్‌పై ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర వివాదం నడిచిన సంగతి గుర్తు చేసుకుంటే భూ హక్కులకు భూ యజమానులు ఎంత ప్రాధాన్యతనిస్తారో బోధపడుతుంది. అయితే, తెలంగాణలో ధరణి తెచ్చింది టిఆర్ఎస్ కాగా కాంగ్రెస్‌కు దానితో సంబంధం లేదు కాబట్టి ప్రతిపక్షం గట్టిగా ఎదుర్కోగలిగింది. అదే ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ఆ చట్టం చేసింది వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వమే అయినా మూల చట్టం రూపొందించింది కేంద్ర బిజెపి సర్కారు. ప్రధాని మోడీ ఏరికోరి ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ నమూనా చట్టాన్ని అన్ని రాష్ట్రాలకు పంపించి ఆమోదించాలని ఆదేశించగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మారుమాటాడకుండా అసెంబ్లీలో వెంటనే ఆమోదించేసింది. అదే బిజెపితో ఇక్కడి ప్రతిపక్ష టిడిపి, జనసేన కూటమి కట్టాయి. కాబట్టి ప్రమాదకరమైన ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి బిజెపి, వైసిపి, టిడిపి, జనసేనలదే బాధ్యత అవుతుంది.

రైతాంగంలో తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్న ఈ చట్టంపై వామపక్షాలు తొలినుండీ అభ్యంతరపెడుతూనే ఉన్నాయి. ప్రజా సంఘాలు పలు ఆందోళనలు చేసినా రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేకపోయింది. వివాదాస్పద చట్టం విషయంలో కాంగ్రెస్ పాత్ర కనిపించదు. కనుక ఇండియా వేదికగా ఏర్పడిన పార్టీలకే ఆ చట్టాన్ని విమర్శించే లేదా ఎదిరించే దమ్ముంటుంది. అంతేతప్ప ఇటు వైఎస్ఆర్‌సిపి, అటు ఎన్‌డిఎ కూటమి పార్టీలూ నేరం చేసినవే! ఈ చట్టంతో భూములపై సొంత హక్కులు ప్రశ్నార్థకం అవుతాయని, తాత ముత్తాతల రికార్డులు చూపించి నిరూపించుకోకపోతే భూములపై హక్కులను పెండింగ్‌లో పెడతారని రైతులు ఆందోళనగా ఉన్నారు. దాంతో ఇక ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో భూములు లాగేసుకుంటారని తెలుగుదేశం,జనసేన నాయకులు కూడా ప్రచారం చేస్తున్నారు. అయితే, ఆ చట్టాన్ని తీసుకొచ్చిన బిజెపితో కలిసి ఎందుకు కూటమి కట్టారో మాత్రం వారు ప్రజలకు చెప్పకపోవడం నయవంచనే కదా!

నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలుతో భూమిని ఒక ఉత్పత్తి వనరు, జీవనాధారం అన్నది కాకుండా కొని అమ్మే ఒక సరుకుగా మార్చే ప్రయత్నం తీవ్రతరమైంది. భూ రికార్డుల ఆధునీకరణ, కంప్యూటరీకరణ పేరుతో కేంద్రం రాష్ట్రాలపై రకరకాల ఒతిళ్లు తీసుకొచ్చింది. దానికితోడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కోసం ప్రపంచంలో ఎక్కడున్నవారైనా ఇక్కడి భూమి గురించిన సకల సమాచారం తెలుసుకోవడమే కాకుండా దాన్ని కొనుకోవడానికి చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ అవకాశం కూడా కల్పించాలన్నది ముందుకొచ్చింది. చంద్రబాబు హయాంలో వచ్చిన 'మీభూమి' పోర్టల్ ఆ క్రమం లోనిదే! దాన్ని ఆయన ఎంతగానో ప్రస్తుతించుకునేవారు. ఆ తరువాత వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఈ టైట్లింగ్ చట్టాన్ని చేసింది. సివిల్ కోర్టుల పరిధి నుండి తొలగించడం, ఇతరత్రా పారదర్శకత కొరవడడంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. అటువంటి స్థితిలో ప్రజాస్వామిక పాలనలో అన్ని విషయాలనూ గ్రామసభలో వివరించి, సందేహాలను నివృత్తి చేశాక రికార్డుల్లో నమోదు చేయడం, వివరాలన్నిటినీ గ్రామ సచివాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించడంతోపాటు దిద్దుబాటు ప్రక్రియ కూడా స్థానికంగా అందుబాటులో ఉండేలా చేయడం జరగాలి. కానీ వివిధ పాలనాపరమైన అంశాల్లో నిరంకుశ పోకడలు పోతున్న వైసిపి ప్రభుత్వం భూ హక్కుల విషయంలోనూ ఏకపక్షంగానే వ్యవహరించింది. పైపెచ్చు సర్వే రాళ్లపైన, పట్టాదారు పాస్‌బుక్‌పైన సిఎం ఫొటో ప్రచురించడం మరిన్ని సందేహాలకు కారణమైనాయి. భూ యజమానుల్లో తీవ్ర గందరగోళానికి కారణమైన వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని ఇప్పటికైనా నిలుపుదల చేయాలి. అందుకోసం ఆ నాలుగు పార్టీలపై మరింతగా ప్రజల ఒత్తిడి పెరగాలి.

మహనీయుని మాట




దురలవాట్లు మొదట్లో సాలెగూళ్ళ లాంటివి. తర్వాత అవి ఇనుప గొలుసులై మిమ్మల్ని బంధిస్తాయి.

- లాంగ్ ఫెలో, కవి, విద్యావేత్త.

రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోని మూడు మ్యానిఫెస్టోలు

విశ్లేషణ



కె.యస్.లక్ష్మణరావు



రాష్ట్ర విభజన అనంతరం జరుగుతున్న మూడవ ఎన్నికలకు...వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలను పరిశీలిస్తే... మూడు ప్రాంతీయ పార్టీలూ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను విస్మరించాయి. గత పదేళ్లుగా ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, పోలవరం నిర్మాణం మొదలగు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి, పోరాడి హక్కులను సాధించుకోవడానికి బదులు కేంద్రానికి సాగిలబడ్డాయి. భావితరాలకు అన్యాయం చేసేవిధంగా మూడు ప్రాంతీయ పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలలో ఈ అంశాలు కనిపించలేదు.

సాధారణంగా ప్రాంతీయ పార్టీలు ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షల నుంచి ఉద్భవించి, తమ రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం పోటీ పడతాయి. తెలుగుదేశం పార్టీ 1982లో 'ఆంధ్రుల ఆత్మగౌరవం' నినాదంతో ఏర్పడింది. 1980వ దశకంలో శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వానగల కేంద్రప్రభుత్వ ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా ఎన్.టి.రామారావు, జ్యోతిబసు, రామకృష్ణ హెగ్డే, ఫరూక్ అబ్దుల్లా మొదలగు నాయకులు సమావేశాలు జరిపి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో మార్పు తెచ్చి, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చేలా సర్కారియా కమిషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే.

18వ లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు కూడా రాష్ట్ర విభజన అనంతరం జరుగుతున్న మూడవ ఎన్నికలకు...వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలను పరిశీలిస్తే...మూడు ప్రాంతీయ పార్టీల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను విస్మరించాయి. గత పదేళ్లుగా ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, పోలవరం నిర్మాణం మొదలగు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి, పోరాడి హక్కులను సాధించుకోవడానికి బదులు కేంద్రానికి సాగిలబడ్డాయి. భావితరాలకు అన్యాయం చేసేవిధంగా మూడు ప్రాంతీయ పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలలో ఈ అంశాలు కనిపించలేదు.

అభివృద్ధి అవసరం లేదా?

సాధారణంగా సాంప్రదాయ అర్థశాస్త్రంలో అభివృద్ధి అంటే ఆర్థికాభివృద్ధి, రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల, తలసరి ఆదాయం పెరుగుదల మొదలగు అంశాలు ఉంటాయి. ఆర్థికాభివృద్ధితో పాటు ఇప్పుడు సమ్మిళిత అభివృద్ధి, సుస్థిర అభివృద్ధి, మానవాభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన మొదలగు అంశాలు కూడా అభివృద్ధిలో భాగంగా ఉన్నాయి. రాష్ట్ర విభజన తరువాత 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం మిగిలిన అంశాలను విస్మరించి కేవలం రాజధాని భూముల సమీకరణ, సింగపూర్ నమూనా తదితర అంశాలకే పరిమితమైంది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ఆలోచనలు చేయలేదు. 2019-2024 మధ్య పాలించిన వై.యస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం 'బటన్ నొక్కుడు' (డిబిటి)కే పరిమితమై మిగిలిన అన్ని అంశాలను నిర్లక్ష్యం చేసింది. మౌలిక వసతులలో భాగంగా కనీసం రోడ్ల నిర్మాణం కూడ చేయలేదు.

టిడిపి-జనసేన కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో అభివృద్ధికి అవసరమైన అంశాలను తాము విస్మరించిన తీరును ప్రజలు గుర్తించకుండా ఉండటానికే ఎన్నికల ప్రచారంలో పరస్పర దూషణలు, వ్యక్తిగత దూషణలు చేసుకుంటున్నాయి. అభివృద్ధి అంశాలను ప్రస్తావించకుండా కేవలం సంక్షేమ అంశాలకే పరిమితమైనారు. అభివృద్ధి-సంక్షేమాన్ని సమతుల్యం చేయాలనే ఉద్దేశం మూడు ప్రాంతీయ పార్టీలకు లేకపోగా, మూడు పార్టీలు కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి అంటకాగటం రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి విషాదకరమైన విషయం. మూడు ప్రాంతీయ పార్టీలు విస్మరించిన అంశాలపై వాటిని నిలదీయాల్సిన అవసరముంది.

ప్రత్యేక హోదా

ప్రత్యేక హోదా గురించి మూడు ప్రాంతీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలలో చేర్చలేదు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్ట ఆమోద సమయంలో ఎ.పి కి ప్రత్యేక హోదా ఐదేళ్ల పాటు ఇస్తామని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రకటించారు. 2014 మేలో ఏర్పడిన మోడీ ప్రభుత్వం గత దశాబ్ద కాలంగా 5 కోట్ల ఆంధ్రులను ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసింది. ప్రత్యేక హోదా వలన రాష్ట్రంలో పారిశ్రామిక రాయితీలు, పన్ను రాయితీలు లభించి పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది. 2014కు ముందు ప్రణాళికా సంఘం సిఫార్సులతో 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా లభించింది. కానీ, గత పదేళ్లుగా అధికారంలో ఉన్న రెండు పార్టీలు కేంద్రంపై ప్రత్యేక హోదా కోసం ఒత్తిడి తేవడంలో పూర్తిగా విఫలం చెందాయి. ప్రత్యేక హోదా కోసం గత దశాబ్ద కాలంలో అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ వాటిని అణచివేయడానికే ప్రయత్నించారు. ఒక్కసారి కూడా ప్రత్యేక హోదాపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించటానికి ప్రయత్నించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలందరూ ప్రత్యేక హోదా కోరుతున్నప్పటికీ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోలలో ప్రత్యేక హోదాను విస్మరించటం శోచనీయమైన విషయం.

విభజన హామీలు - అమలు

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయటంలో దశాబ్ద కాలంగా మోడీ ప్రభుత్వం ఆంధ్రులకు అన్యాయం చేసింది. ముఖ్యంగా 9,10 షెడ్యూళ్లలో వున్న ఉమ్మడి ఆస్తులను రెండు రాష్ట్రాల మధ్య విభజించలేదు. 13వ షెడ్యూల్‌లో వివరించిన 11 జాతీయ విద్యా సంస్థలకు రూ.12 వేల కోట్లు ఖర్చు చేయాలి. కానీ ఇప్పటికి రూ.4 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. విభజన చట్టంలో చెప్పిన కడపలో ఉక్కు కర్మాగారం, దుగ్గరాజ పట్నం వద్ద భారీ ఓడరేవు, విశాఖపట్నంలో రైల్వేజోను ఏర్పాటు చేయాలి. వీటితో పాటు గ్రీన్‌ఫీల్డ్ ముడి చమురు శుద్ధి కర్మాగారం, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పరచాలి. విశాఖపట్నం, విజయవాడలలో మెట్రో రైలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. ఈ చట్టం గుర్తించిన 7 వెనుక బడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి. వీటితోపాటు రాజధాని నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలి. దశాబ్ద కాలంగా ఈ విభజన హామీలు ఏవీ అమలు జరగలేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలలో 3 ప్రాంతీయ పార్టీలూ వీటిని ప్రస్తావించలేదు.

రైతాంగం - నీటిపారుదల రంగం

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగం, రైతాంగం తీవ్రమైన సంక్షోభంలో వున్నది. కౌలు రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. రైతాంగ సమస్యలు పరిష్కరించాలంటే స్వామినాథన్, జయతీ ఘోష్, రాధాకృష్ణన్ కమిటీల సిఫార్సులు అమలు జరపాలి. రైతులందరికీ రుణాలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. కౌలు రైతుల కోసం 2011లో చేసిన చట్టం గానీ, 2019లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన చట్టం గానీ ఉపయోగపడలేదు. కౌలురైతులకు భూయజమాని సంతకం వుండాలనే నిబంధన వలన రుణాలు అందటంలేదు. కౌలు రైతులందరికీ భూయజమాని తీసుకున్న రుణంతో సంబంధం లేకుండా బ్యాంకుల రుణాలు కల్పించాలి. నీటిపారుదల రంగాన్ని తెలుగుదేశం ప్రభుత్వం, వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ నిర్లక్ష్యం చేశాయి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వంశధార, వెలిగొండ, హంద్రి-నీవా, గాలేరు-నగరి మొదలైన ప్రాజెక్టులతో పాటు మధ్య-చిన్న తరహా నీటి ప్రాజెక్టులను కూడా తీవ్రంగా నిర్లక్ష్యం చేశారు. ఉదాహరణకు ఇరిగేషన్‌కు బడ్జెట్‌లో గత నాలుగేళ్లలో రూ.61,573 కోట్లు కేటాయించి, రూ.32,059 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం దారుణమైన విషయం. ప్రాజెక్టుల ద్వారా జలాలను వినియోగించకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి అసాధ్యం.

పోలవరం ప్రాజెక్ట్- నిర్వాసితులు

విభజన చట్టంలో సెక్షన్ 90 ప్రకారం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. పర్యావరణ, అటవీ, పునరావాస, పునర్నిర్మాణ అనుమతులకు కేంద్రానిదే బాధ్యత అని పేర్కొన్నారు. 2017-18 సవరించిన అంచనాల ప్రకారం మొత్తం వ్యయం రూ.55,606 కోట్లుగా అంచనా వేశారు. దీనిలో భూసేకరణకు, పునరావాసానికి రూ.33 వేల కోట్లు ప్రతిపాదించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులకు పునరావాసం కల్పించటం అతి పెద్ద అంశం. 373 గ్రామాలలో 1,05,000 కుటుంబాలు నిర్వాసితులుగా మారతాయి. ఇప్పటికి కేవలం 8,000 కుటుంబాలకు మాత్రమే పునరావాసం జరిగి 9 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పునరావాసం జరగకుండా పోలవరం ప్రాజెక్టు పూర్తికాదు. పునరావాసానికి కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలని విభజన చట్టం తెలుపగా, నిధులతో మాకు సంబంధంలేదని కేంద్రప్రభుత్వం వివరిస్తున్నది. ఈ వారంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్వాసితుల పునరావాసం కోసం రాష్ట్ర ప్రజలపై "సెస్సు" విధిస్తామని ప్రతిపాదించడం దారుణమైన విషయం. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి న్యాయంగా రావలసిన హక్కులను సాధించుకోకుండా, ఈ రకమైన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రజల హక్కులను దెబ్బతీస్తాయి.

విశాఖ ఉక్కు - ప్రయివేటీకరణ

విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని "విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు" నినాదంతో అనేక త్యాగాల ద్వారా సాధించుకున్నాము. ఆనాటి ఉద్యమంలో 32 మంది మరణించి ప్రాణత్యాగం చేశారు. 64 గ్రామాలకు చెందిన రైతులు ఉక్కు కర్మాగారం కోసం 26 వేల ఎకరాలు ఇచ్చి త్యాగం చేసి, నిర్వాసితులుగా మారారు. ఇప్పుడు ఉక్కు కర్మాగారం ఆస్తుల విలువ రెండు లక్షల కోట్లకు పైగా ఉంటుంది. ఉక్కు కర్మాగారం వలన విశాఖ నగరం, గాజువాక వంటి ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయి. ఉక్కు కర్మాగారానికి స్వంత గనులు ఇవ్వకుండా, వివక్షత చూపటంతో ఉక్కు కర్మాగారం కొంత మేరకు నష్టాలు ఎదుర్కొన్నది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరిస్తామని, జిందాల్-అదానీ వంటి క్రోనీ పెట్టుబడిదారులకు అమ్మేస్తామని ప్రకటించడం దారుణమైన విషయం. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత వెయ్యి రోజులకు పైగా పెద్ద ఉద్యమం జరుగుతున్నది. వామపక్షాలు ప్రధాన పాత్ర వహించాయి. మూడు ప్రాంతీయ పార్టీలు ఏదో ఒక సందర్భంలో "సన్నాయి నొక్కులు" తప్పితే నిర్దిష్టంగా ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనలేదు. మూడు పార్టీలు స్పష్టమైన వైఖరి ప్రకటించాలి. ముఖ్యంగా ఎన్‌డిఎలో భాగస్వాములుగా మారిన టిడిపి, జనసేన పార్టీలు మోడీ ప్రభుత్వంపై, బిజెపిపై ఒత్తిడి తేవాలి.

పారిశ్రామికాభివృద్ధి-ఉపాధి

గత దశాబ్ద కాలంలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరగలేదు. మూడు ప్రాంతీయ పార్టీలకు పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనపై స్పష్టమైన దృక్పథం లేదు. రాష్ట్రంలో ఐ.టి రంగం, ఫార్మా రంగం, టెక్స్‌టైల్స్, వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. విశాఖపట్నంతో పాటు తిరుపతి, అనంతపురం, ప్రకాశం జిల్లాలో దొనకొండ, గన్నవరం తదితర ప్రాంతాలను పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. నిరుద్యోగులకు ప్రభుత్వ శాఖలలో ఖాళీగా వున్న ఉద్యోగాలతో పాటు, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయటం ద్వారా ఉపాధి కల్పించాలి. పెద్ద సంఖ్యలో ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులరైజేషన్‌తో ఉద్యోగ భద్రత కల్పించాలి. అనేక రాష్ట్రాలలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో సిపిఎస్ రద్దు గురించి 2014-19 మధ్య తెలుగుదేశం, 2019-2024 మధ్య వైఎస్ఆర్ ప్రభుత్వం మాట తప్పాయి. ఇప్పుడు ఎన్నికల మ్యానిఫెస్టోలలో సిపిఎస్ గురించి చర్చిస్తామని చెప్పారు తప్పితే రద్దు చేస్తామని మూడు పార్టీలూ పేర్కొనలేదు.

మైనారిటీల హక్కులు-రక్షణ

గత దశాబ్ద కాలంగా దేశంలో మోడీ ప్రభుత్వం మైనారిటీలను ముఖ్యంగా ముస్లిం మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నది. జమ్ము - కాశ్మీర్ రాష్ట్రానికి ఆర్టికల్ 370 రద్దు చేసింది. గోరక్షక దళాల పేరుతో మైనారిటీలపై అనేక భౌతిక దాడులు జరిగాయి. ఎన్నికలలో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని, లౌకికవాదాన్ని రద్దు చేస్తామని బిజెపి పార్లమెంట్ సభ్యులు ప్రకటిస్తున్నారు. 2019లో చేసిన "పౌరసత్వ సవరణ చట్టం" (సిఎఎ) అమలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం 2024 మార్చి 11న నోటిఫికేషన్ విడుదల చేసినది. దీనివలన పౌరసత్వం ఇవ్వడం మతం ఆధారంగా జరుగుతుంది. ప్రజలను మతపరంగా విభజించటానికే ఈ చట్టం చేశారు. ఈ మూడు ప్రాంతీయ పార్టీలు ఈ చట్టం గురించి ఇంతవరకు వ్యాఖ్యానించటంగాని, ఖండించటంగాని చేయలేదు. ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షా అనేక సభలలో మాట్లాడుతూ ముస్లింలకు ఇస్తున్న రిజర్వేషన్లు రద్దు చేస్తామని పదే, పదే ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాలలో విద్యాలయాలలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయి. ఈ అంశంపై కూడా ఈ పార్టీలు ఇంతవరకు ఖండించలేదు.

స్పష్టమైన వైఖరి ఎవరిది?


ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ పట్ల, అభివృద్ధి పట్ల మూడు ప్రాంతీయ పార్టీలు స్పష్టంగా లేవు. 'సంక్షేమమే' మొత్తం అభివృద్ధి అన్న విధంగా వ్యవహరిస్తున్నాయి. వ్యక్తిగత దూషణలు, నిందలతో ఎన్నికల ప్రచారం చేస్తున్నాయి. కులతత్వాన్ని రెచ్చగొడుతున్నాయి. అదే సమయంలో 'ఇండియా' వేదికలో భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే 'ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా' కల్పించే ఫైల్‌పై సంతకం చేస్తామని ప్రకటించింది. విభజన హామీలు అమలు చేస్తామని ప్రకటించింది. సిపిఎం రాష్ట్ర అభివృద్ధిపై అనేక వర్క్‌షాప్‌లు నిర్వహించి 'రాష్ట్ర సమగ్ర అభివృద్ధి' ప్రణాళికను ప్రకటించింది. సిపిఐ రాష్ట్ర అభివృద్ధి కోసం స్పష్టమైన విధానాలను ప్రకటించింది.

ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయమే అన్నిటికంటే శక్తివంతమైనది. ప్రజలు, ప్రజాసంఘాలు, వామపక్ష సంఘాలు, దళిత-బహుజన సంఘాలు, అభ్యుదయ వాదులు, మేధావులు అందరూ కలసి ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి కోసం జరిగే కృషిలో భాగస్వాములై, రాజకీయ పార్టీలపై ఒత్తిడి తేవాలి. పౌర సమాజం నుండి కృషి కొనసాగుతూ ఉండాలి.

/వ్యాసకర్త శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083 /

'ఓటు' శక్తివంతమైన ఆయుధం

వ్యాఖ్య



నీరా చందోక్

మనల్ని సమానత్వ మార్గంలో నడిపించే సరైన పార్టీకి ఓటు వేయడమే నవ భారతం కోసం జరిగే పోరాటానికి నాంది. నవ భారతంలో చిన్న పిల్లలు ట్రాఫిక్ లైట్ల దగ్గర యాచించరు. ఇక్కడ చిన్న పిల్లలు చెత్తా చెదారం కోసం చెత్త డబ్బాల్లో చేతులతో వెతికే పని చెయ్యరు. 'సమానత్వం అన్న మాటను కూడా ఉచ్ఛరించని పార్టీకి ఓటు వేయడం, లేక 'నోటా'పై ఓటు వేయడం ద్వారా మన ఓటును వృధా చెయ్యవద్దు.



మనకు ఎన్నికల వ్యవస్థ ఉంది. ప్రజాస్వామ్య దేశాల చరిత్రలో ఎన్నికలు ప్రాముఖ్యత గల ఘట్టం. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. అది స్వేచ్ఛ, సమానత్వం, న్యాయాలను సాధించే ఏకైక ప్రభుత్వ రూపం కాబట్టి చాలా విలువైనది. ఇవన్నీ మంచి సమాజానికి చాలా ముఖ్యం. ప్రజలను, ఒక వ్యక్తి నిరంకుశత్వం కంటే కూడా రాజ్యాంగమే పాలి స్తుంది. పౌరులుగా, మానవులుగా మన హోదాను ప్రాథమిక హక్కులు రక్షిస్తాయి. పౌరుల మినహాయింపు, వారిపై విధించే నేరపూరిత చర్యలకు ఎన్నుకోబడిన నాయకులే బాధ్యత వహించాలి. ఈ నేపథ్యం ఉన్న ఎన్నికల మార్కెట్లో పార్టీలు ఓట్ల కోసం పోటీ పడుతున్నాయి.

సంక్లిష్టమైన 2024 ఎన్నికల షెడ్యూల్‌లో ఇప్పటికే మనలో కొందరు ఓటు వినియోగించుకోగా, కొందరు ఇంకా వినియోగించుకోవాల్సి ఉంది. సమ న్యాయ పాలన, క్రమబద్ధీకరించే స్వతంత్ర సంస్థలు, పౌరహక్కులు, బలహీన వర్గాల సంరక్షణ (ముఖ్యంగా మైనార్టీలు), పార్లమెంట్‌కు బాధ్యత వహించే కార్యనిర్వాహక వర్గం, అప్రమత్తంగా ఉండే మీడియా, పౌర సమాజం లాంటి ప్రజాస్వామిక మూల స్తంభాలు కూల్చివేయబడిన సమాజంలో మనం మన ఓటు హక్కును వినియోగిస్తున్నాం. తోటి పౌరులను మత ప్రాతిపదికన నిరంతరం లక్ష్యంగా చేసుకున్న సమాజంలో మనం ఓటును వినియోగిస్తున్నాం. ప్రజాస్వామ్యం అనే ధనిక ప్రపంచం ఏమీ లేనిదిగా బహిరంగమైంది. ఇప్పుడు మనకు కేవలం ఓటు హక్కు మాత్రమే ఉంది. రాజకీయ ప్రసంగాల్లో, ఆచరణల్లో నీచత్వాన్ని ప్రవేశపెట్టిన పార్టీని ఓడించడానికి మనం ఉపయోగించే ఓటు ఒక శక్తివంతమైన ఆయుధం. పున:పంపిణీ గురించి, రాజకీయాల్లో అట్టడుగున ఉన్న భారతీయులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం గురించి మాట్లాడే పార్టీకి ఓటు వేసే అవకాశం మనకు ఉంది.

బిజెపి మ్యానిఫెస్టో దేనికి సంబంధించింది అనేది స్పష్టంగా లేదు. ఎందుకంటే, ఆ పార్టీ మోడీ పేరుతో హామీలకు, కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను నిందించే రాజకీయ ప్రసంగాలకు మాత్రమే పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో, సుదీర్ఘకాలంగా స్త్రీవాదులు డిమాండ్ చేస్తున్నట్లు గృహిణులకు అలవెన్సులు ప్రకటించారు. ప్రభుత్వ సంస్థల్లో, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల్లోకి ప్రవేశించే యువకులకు స్టైఫెండ్‌తో కూడిన శిక్షణ ఇస్తామని, ప్రభుత్వ రంగంలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, మహిళలకు, కార్మికులకు, రైతులకు, వ్యాపారంలో, ప్రభుత్వ ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో అట్టడుగున వున్న వారికి సంవత్సరానికి లక్ష రూపాయల గ్రాంట్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసింది. కాని మన తోటి పౌరులు జీవించడానికి విలువైన జీవితాన్ని అందించే విషయంలో రాజకీయ చైతన్యం గల ప్రజలుగా మనం ఎందుకు మాట్లాడలేకపోతున్నాం?

ఉదాహరణకు పేదరికాన్ని తీసుకుంటే, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభా వివరాలు ప్రభుత్వం విడుదల చేయనప్పటికీ, దారిద్ర్య రేఖ అంటే ఏమిటో మనకు చెప్పనప్పటికీ, పేదలు, ధనవంతులు, కానటువంటి మనం పూరి గుడిసెలు దాటి వెళ్ళేటప్పుడు అది మన రోజువారీ జీవితాల వెంట వస్తూనే ఉంటుంది. మండు వేసవిలో, ఎముకలు కొరికే చలిలో, వర్షాకాలంలో, తుఫాన్ సమయంలో మన దేశ రాజధాని వీధుల్లో ప్రజలు నిద్రించడం మనం చూస్తాం. ట్రాఫిక్ లైట్ల దగ్గర వికలాంగులు, చంటి పిల్లల్ని భుజాన వేసుకొన్న మహిళలు, చిన్న పిల్లలు బిచ్చమెత్తుకుంటూ మన చుట్టూ చేరతారు. చాలామంది భారతీయులు పేదరికం నుండి బయటపడ్డారని చెప్పే నాయకుల మాటలు విశ్వసించే సంశయవాదులకు ఇదే తగిన రుజువు. ఎనభై మూడు కోట్ల మంది భారతీయులకు ఉచిత రేషన్ పంపిణీ గురించి ప్రధానమంత్రి మాట్లాడతారు. కానీ తినడానికి తిండిని సంపాదించుకోలేని స్థితిలో ఉన్నవారు కూడా ఈ ప్రజలే. పేదరికానికి ఇంతకన్నా పెద్ద రుజువు అవసరమా?

అయితే పేదరికం గురించి సంగ్రహంగా మాట్లాడడానికి ఇది సరిపోదు. పేదరికానికి, అనారోగ్యానికి ఆర్థిక క్రమమే కారణమైతే పేదలపై విధించిన తప్పిదాలను సరిచెయ్యడానికి మనం బాధ్యత వహించాలి. నేను కారు నడుపుతూ, ఎలాంటి హెచ్చరికలు లేకుండా అకస్మాత్తుగా రద్దీగా ఉండే రోడ్డుపై కారును నిలిపివేస్తే, నా వెనుక ఉన్న కార్లకు జరిగే నష్టానికి నేనే బాధ్యత వహించాలి. ఒకవేళ ట్రాఫిక్ లైట్ల దగ్గర స్థిరంగా నిల్చొని ఉన్న నా కారుపై, ఎవరైనా తమ కారుతో దూసుకొని వస్తే నాకు జరిగే నష్టానికి ఆ కారు నడిపే వ్యక్తి బాధ్యత వహించాలి. మన సమాజం చరిత్ర అంచులకు నెట్టి వేసిన వారికి, సామాజిక వివక్షతకు గురైన వారికి, మంచి జీవితాన్ని ప్రసాదించే వనరులు నిరాకరించబడిన వారికి, ఓటుకు భిన్నమైన రీతిలో గొంతెత్తి చాటే హక్కును కోల్పోయిన వారికి మనం రుణపడి ఉండాలి. చరిత్ర నుండి ప్రయోజనాలు పొందిన వారు, నష్టపోయిన వారికి రుణపడి ఉండాలి. ఇది, మంచి సమాజానికి ఉండే ప్రాథమిక నిబంధన. పేదరికాన్ని సృష్టించి, పున: సృష్టించిన సమాజంలో మనం భాగంగా ఉన్నాం కాబట్టి మనం తోటి పౌరులకు రుణపడి ఉండాలి. పేదలకు విధించ బడిన తప్పిదాలను సవరించాలి. పెరుగుతున్న ఆదాయాలకు అనుగుణంగా పౌరులు చెల్లించే ప్రగతిశీల పన్నుల విధానాన్ని సంపన్నులు అంగీకరించాలి. మానవ జీవన ప్రమాణాలకు దిగువన జీవిస్తున్న మన సొంత ప్రజలకు కనీసంగా మనం రుణపడి ఉండాలి. ప్రభుత్వం ఈ పన్నులను తమ స్వంత విజయాలను ప్రచారం చేసుకోవడం కోసం కాక ప్రజా సంక్షేమం కోసం వినియోగిస్తుంది.

నియంతలు ఉచిత రేషన్లను తమ వ్యక్తిగత సంచుల్లో ఇవ్వడానికి, పౌరుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు వెయ్యడానికి కూడా సిద్ధపడి ఉన్నారు కాబట్టి, డబ్బు మంజూరు చేసే విధానం కచ్చితంగా సామాజిక ప్రజాస్వామ్యం ఏర్పాటుకు దోహదం చెయ్యదు. తరువాత, పని చేసే సాధారణ హక్కుకు చాలా ప్రాధాన్యత ఉంది. కారల్ మార్క్స్ చెప్పినట్లు శ్రమ, మనిషి యొక్క స్వీయ వ్యక్తీకరణ. అందుకే పని చేసే హక్కును చట్టం చెయ్యాల్సిన అవసరం ఉంది. ఇది ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ఉన్న సామాజిక ప్రజాస్వామ్య రాజ్య లక్షణం. కొన్ని నిధులను మంజూరు చేయడం వల్ల మాత్రమే అసమానతలను అధిగమించలేం. దానికి ఒకవైపు ప్రగతిశీల పన్నుల విధానం అవసరం కాగా, అది ప్రతి పౌరునికి పని చేసే సాధారణ హక్కును కల్పిస్తుంది.

సంస్థాగతంగా వనరులను పున: పంపిణీ చేసే ప్రగతిశీల పన్నుల విధానాన్ని రాజకీయ చైతన్యం గల ప్రజలు సమర్థించాలి. మనం, మన తోటి పౌరుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. మనం ఒకే దేశంలో నివసిస్తున్నాం, దేశ రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నాం, జాతీయ జెండాకు వందనం చేస్తున్నాం. అవే చట్టాలకు లోబడి ఉంటున్నాం. రాజకీయ చైతన్యం గల సమాజంలో ప్రతీ పౌరుడు సమానమైన నైతిక, రాజకీయ విలువల్ని కలిగి ఉండాలి. రాజకీయ జోక్యం, సమానత్వ సమాజాన్ని సృష్టించి, పోషించాలి. చివరగా, ఇతరుల పట్ల మన బాధ్యత, కనీస సామాజిక ఆదాయం మంజూరు చేయడంతోనే నిలిచిపోతుందా? సంతృప్తిగా జీవించగలిగే సమాజం వైపు మనం కలిసి పయనించకూడదా? మనల్ని సమానత్వ మార్గంలో నడిపించే సరైన పార్టీకి ఓటు వేయడమే నవ భారతం కోసం జరిగే పోరాటానికి నాంది. మనకున్న ప్రజాస్వామిక సాధనం, ఓటు ఒక్కటే. ప్రజాస్వామ్యం మనకందించిన అత్యంత అద్భుతమైన బహుమతి 'సమానత్వం'. ఈ మాటను కూడా ఉచ్ఛరించని పార్టీకి ఓటు వేయడం, లేక 'నోటా'పై ఓటు వేయడం ద్వారా మన ఓటును వృధా చెయ్యవద్దు.

(వ్యాసకర్త ఢిల్లీ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ పూర్వ ఆచార్యులు, 'ద వైర్' సౌజన్యంతో)

ఎవడు వాడు!

ఎవడన్నాడురా ఈ దేశం
ముందుకు పోవట్లేదని...?
రోజుకో సరికొత్త స్కాముతో
ప్రపంచంలో ముందుంటే...
నీతులు వల్లిస్తూ, అవినీతిలో
అందరికంటే ముందుంటే ...
'ఖనిజ' సంపద యథేచ్ఛగా
సరిహద్దులు దాటుతుంటే
ఎవడన్నాడురా?
చదువు, ఉపాధి పేరుతో
యువత ఉరకలేస్తూ విదేశీ
వలసల్లో దూసుకుపోతుంటే
ఎవడన్నాడురా?
'సెక్యులరిజం' కబుర్లు చెపుతూ
ఫాసిజం' పాలనలో దూసుకు పోతుంటే
ప్రజాస్వామ్యమంటూ గద్దెలెక్కి ప్రజాధనం
దోచుకుంటూ నాయకులే 'జైళ్ల' దగ్గర
వసతుల కోసం 'కుస్తీ' పడుతుంటే ....
అంబరాన్నంటు అప్పులతో,
చుక్కలను ఢీ కొంటున్న ధరలతో
నిత్యం కళకళలాడుతుంటే
ఎవడన్నాడురా?
బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల
అణచివేతలో ముందుండి
పన్నుల పేరిట 'పంజా' విసురుతూ
సామాన్యుడి నడ్డి విరుస్తుంటే ...
ఎవడన్నాడురా...?
ఇంకా నా దేశం 'పేద దేశం' అని
ఇదీ నా సుసంపన్నమైన
స్వతంత్ర 'భారతదేశం' నా దేశం
అని సమాధాన పడుతుంటే
ఎవడన్నాడురా ఈ దేశం
ముందుకు పోవట్లేదని ???

- న్యాలకంటి నారాయణ, 9550833490

గాజా పునర్నిర్మాణానికి 4వేల కోట్ల డాలర్లు!

- రఫాపై దాడి చేస్తే వేల సంఖ్యలో ప్రాణాలకు ముప్పు!
- ఐక్యరాజ్య సమితి సంస్థ హెచ్చరిక



గాజా : రఫా నగరంపై మిలటరీ దాడితో ముందుకెళ్లవద్దని అంతర్జాతీయంగా విజ్ఞప్తులు వచ్చినప్పటికీ వాటిని ఖాతరు చేయకుండా దాడి చేస్తామని ఇజ్రాయిల్ చెబుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో దాడి జరిగితే వేల సంఖ్యలో పాలస్తీనియన్ల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని ఐక్యరాజ్య సమితి మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయం (ఒసిహెచ్ఎ) హెచ్చరించింది. రఫాలోని ఒక ఇంటిపై మిలటరీ బాంబు దాడి చేయడంతో నలుగురు పిల్లలు సహా ఏడుగురు మరణించారు. గత 24గంటల్లో ఇజ్రాయిల్ దాడుల్లో 26మంది మరణించగా, 51మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత ఏడు మాసాలుగా ముమ్మరంగా సాగిస్తున్న యుద్ధంతో తీవ్ర విధ్వంసాన్ని చవి చూసిన గాజాను పునర్నిర్మించాలంటే దాదాపు 4వేల కోట్ల డాలర్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత నుండి ఇప్పటివరకు ప్రపంచం ఎన్నడూ చూడని స్థాయిలో పునర్ నిర్మాణ కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరం వుందని ఐక్యరాజ్యసమితి పేర్కొంది. అనూహ్యమైన రీతిలో మానవ నష్టంతోపాటు ఆర్థిక నష్టం కూడా అదే స్థాయిలో వుందని పేర్కొంది. ఇప్పటివరకు ఈ యుద్ధంలో 34,622మంది పాలస్తీనియన్లు మరణించగా, 77,867మంది గాయపడ్డారు.

నెతన్యాహునే అడ్డంకి : హమాస్

కాల్పుల విరమణ కోసం ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రధాన అవరోధంగా నిలిచిందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహునే అని హమాస్ సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. రఫాపై దాడి చేసి తీరుతామని పదే పదే హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఒప్పందం కుదిరే అవకాశాలను భగ్నం చేయాలన్నదే వారి లక్ష్యంగా వున్నట్లు కనిపిస్తోందన్నారు. గత చర్చలు, సంప్రదింపులన్నింటిలోనూ నెతన్యాహునే ప్రధాన అవరోధకుడిగా నిలిచారని అన్నారు.

కైరోకు హమాస్ బృందం

కాల్పుల విరమణపై చర్చల కోసం ఈజిప్ట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపుతున్నట్లు హమాస్ గురువారం తెలిపింది. ఎలాగైనా ఒక ఒప్పందాన్ని కుదర్చాలని అంతర్జాతీయ మధ్యవర్తులు చేస్తున్న ప్రయత్నాల్లో ఇదొక కొత్త పరిణామం. నెలల తరబడి చర్చలు మొదలు కావడం, నిలిచిపోవడంతో కాల్పుల విరమణ ప్రయత్నాలు ఒక కీలకమైన దశకు చేరుకున్నాయి.

ఇటీవలి రోజుల్లో ఏదో కాస్త రాజీ కుదురుతుందని కనిపించినా, ఇజ్రాయిల్ యుద్ధం ముగించాలన్న కీలక డిమాండ్‌ను అంగీకరించకపోవడంతో ఒప్పందం కుదిరే అవకాశాలు మృగ్యమయ్యాయి. ఒప్పందం దిశగా కృషిచేయాలన్న లక్ష్యంతోనే ప్రస్తుత చర్చల ప్రక్రియను పూర్తి చేయాలని కోరుకుంటున్నామని, అందుకే కైరోకు ప్రతినిధి బృందాన్ని పంపుతున్నామని హమాస్ ఒక ప్రకటనలో పేర్కొంది.

రఫా కోసం డబ్ల్యుహెచ్ఓ తాత్కాలిక ప్రణాళిక

రఫా నగరంపై మిలటరీ దాడి జరిగిన పక్షంలో స్పందించేందుకు తాము ఒక తాత్కాలిక ప్రణాళికను రూపొందించామని, మృతుల సంఖ్య గణనీయంగా పెరగకుండా నివారించేందుకు ఈ ప్రణాళిక సరిపోదని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికారి తెలిపారు. తమ ప్రణాళిక కేవలం 'బ్యాండ్ ఎయిడ్' వంటిదని ఆయన వ్యాఖ్యానించారు. మిలటరీ ఆపరేషన్ వల్ల ఎదురయ్యే మరణాలను ఇది పూర్తిగా నివారించలేదన్నారు.

ఇజ్రాయిల్‌తో వాణిజ్యాన్ని నిలిపివేసిన టర్కీ

అంకారా : ఇజ్రాయిల్‌తో వాణిజ్యాన్ని నిలిపివేస్తున్నట్లు టర్కీ శుక్రవారం ప్రకటించింది. గాజాలో పెరుగుతున్న మానవతా సంక్షోభ పరిస్థితి దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఇజ్రాయిల్‌కు ఎగుమతులు, ఆ దేశం నుండి దిగుమతులు పూర్తిగా నిలిపివేయనున్నట్లు టర్కీ వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. "ఇజ్రాయిల్‌కు సంబంధించిన ఎగుమతి, దిగుమతి లావాదేవీలు నిలిపివేయబడ్డాయి. అన్ని రకాల ఉత్పత్తులు దీని కిందకు వస్తాయి" అని పేర్కొంది. ఇజ్రాయిల్ ప్రభుత్వం గాజాకు నిరంతరాయంగా, మానవతా సాయాన్ని అనుమతించేవరకు టర్కీ ఈ చర్యలను అమలు చేస్తుందని వెల్లడించింది.

రాజ్‌భవన్‌లోకి ప్రవేశం నిషేధం!

పోలీసులు, ఆర్థిక సహాయ మంత్రి రాకుండా బెంగాల్ గవర్నర్ ఆదేశాలు

కోల్‌కత్తా : రాష్ట్రంలో ఉన్న రాజ్‌భవన్‌లోకి పోలీసులు, రాష్ట్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి చంద్రిమా భట్టాచార్య ప్రవేశించకుండా పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్ నిషేధం విధించారు. ఈ మేరకు రాజభవన్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గవర్నర్‌పై పరువునష్టం, రాజ్యాంగ వ్యతిరేక ప్రకటనలు చేసినందుకు కోల్‌కతా, డార్జిలింగ్, బరాక్‌పూర్‌లోని రాజ్‌భవన్‌ల ప్రాంగణంలోకి ప్రవేశించకుండా నిషేధించడమైనదని ఉత్తర్వులో పేర్కొంది. మంత్రి పాల్గొనే ఏ కార్యక్రమంలో కూడా గవర్నర్ పాల్గొనరని కూడా ఉత్తర్వు పేర్కొంది. మంత్రికి వ్యతిరేకంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు భారత అటార్నీ జనరల్‌ను సలహా కోసం గవర్నర్ సంప్రదించినట్లు కూడా ఉత్తర్వు తెలిపింది. మరొక ఉత్తర్వులో 'ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులను శాంతింపజేసేందుకు అనధికార, చట్టవిరుద్ధమైన, బూటకపు, ప్రేరేపిత 'విచారణ' చేసే ముసుగులో రాజ్‌భవన్ ఆవరణలోకి ప్రవేశించకుండా పోలీసులపై కూడా గవర్నర్ నిషేధం విధించారు' అని పేర్కొన్నారు.

ఈ దేశపు కుమార్తెలు ఓడిపోయారు

- బ్రిజ్‌భూషణ్ కుమారుడికి బిజెపి టిక్కెట్‌పై రెజ్లర్ల ఆవేదన
- ప్రభుత్వం అంత బలహీనంగా ఉందా? సాక్షి మాలిక్
- ఈ దేశ దౌర్భాగ్యం : బజరంగ్ పునియా



మన దేశ దౌర్భాగ్యం : బజరంగ్ పునియా

న్యూఢిల్లీ : బిజెపి నిర్ణయం ముందు ఈ దేశంలోని కుమార్తెలు ఓడిపోయారని అంతర్జాతీయ రెజ్లర్లు సాక్షి మాలిక్, బజరంగ్ పునియా ఆవేదన వ్యక్తం చేశారు. రెజ్లర్లపై డబ్ల్యుఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడినప్పటికీ, ఆయన కుమారుడు కరణ్‌భూషణ్ సింగ్‌ను ఉత్తర ప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ లోక్‌సభ అభ్యర్థిగా బిజెపి ప్రకటించడంపై వారు మండిపడ్డారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఒలింపిక్స్‌లో పతకం సాధించిన సాక్షి మాలిక్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 'అరెస్ట్ సంగతి పక్కన పెట్టండి. ఈ రోజు అలాంటి వ్యక్తి కుమారుడికి బిజెపి టిక్కెట్ ఇచ్చి దేశంలోని కోట్లాది మంది కుమార్తెల మనోధైర్యాన్ని దెబ్బతీశారు. ఆ కుటుంబానికే టికెట్ ఇచ్చారంటే, అతని ముందు దేశ ప్రభుత్వం ఇంత బలహీనంగా ఉందా! ఓట్ల కోసమే శ్రీరాముడి పేరు అవసరం. ఆయన చూపిన మార్గం సంగతి ఏమిటి?' అని ప్రశ్నించారు.

'పతకాలు సాధించిన కుమార్తెలను వీధుల్లోకి లాగడం, కుమార్తెలను లైంగికంగా వేధించిన వ్యక్తి కుమారుడికి టిక్కెట్ ఇచ్చి గౌరవించడం మన దేశ దౌర్భాగ్యం' అని మరోక ప్రముఖ రెజ్లర్ బజరంగ్ పునియా ఆవేదన వ్యక్తం చేశారు. 'లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు ఉన్న బిజెపిని ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీల్లో ఒకటిగా పరిగణిస్తారు. అయితే ఇలాంటి బిజెపి కూడా ప్రజ్వల్ రేవణ్ణ వంటి సమస్య చుట్టుముట్టిన సమయంలోనూ బ్రిజ్‌భూషణ్ కుమారుడికి టిక్కెట్ ఇచ్చింది' అని బజరంగ్ పునియా ఎక్స్ ఖాతాలో విమర్శించారు. 'పంజాబ్, హర్యానాల్లో ఆందోళనలు జరుగుతున్న సమయంలో ప్రజలు 'ప్రభుత్వాల నుంచి ఏమీ ఆశించవద్దు, మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోండి' అని మాత్రమే నినదించారు' అని పునియా గుర్తు చేశారు.

హనీబాబు పిటిషన్ ఉపసంహరణకు సుప్రీంకోర్టు అనుమతి

న్యూఢిల్లీ : భీమా కొరెగావ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ హనీబాబు అప్పీలు ఉపసంహరణకు సుప్రీంకోర్టు శుక్రవారం అనుమతించింది. బాంబే హైకోర్టు తన బెయిల్ దరఖాస్తును తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ హనీబాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని, బెయిల్ కోసం బాంబే హైకోర్టును ఆశ్రయిస్తామని హనీబాబు తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇదే కేసులో ఎన్ఐఎ ఆరోపణలతో అరెస్టయిన సహచరులు బెయిల్ పొందిన పరిస్థితులు వేరని కోర్టుకు తెలిపారు.

ఇదే కేసులో ఇటీవల నాగ్‌పూర్ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ సోమాసేన్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. మావోయిస్టు గ్రూపులతో సంబంధాలున్నాయంటూ అమానుషమైన యుఎపిఎ చట్టం కింద ఆమెపై ఎన్ఐఎ కేసు నమోదు చేసింది. గతేడాది జులైలో మానవ హక్కుల కార్యకర్తలు అరుణ్ ఫెరీరా, వెర్నాన్ గోన్సాల్వేస్‌లకు బెయిల్ మంజూరు చేసింది. నిషేధిత సిపిఐ (మావోయిస్టు) సంస్థ నేతల సూచనల మేరకు మావోయిస్టు కార్య కలాపాలు, సిద్ధాంతాలను ప్రచారం చేయడంలో హనీబాబు సహకరించారని ఎన్ఐఎ ఆరోపించింది. హనీబాబును 2020 జులైలో అరెస్ట్ చేయగా, ప్రస్తుతం ఆయన తలోజా జైలులో ఉన్నారు. 2022 సెప్టెంబర్‌లో, బాంబే హైకోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. ఆ తర్వాత హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హనీబాబు బెయిల్ పిటిషన్‌పై జనవరిలో సుప్రీంకోర్టు ఎన్ఐఎ స్పందన కోరింది. 2018 జనవరిలో పూణె సమీపంలోని భీమా కొరెగావ్‌లో కులహింసను ప్రోత్సహించారని ఆరోపిస్తూ ఎన్ఐఎ 16 మంది అధ్యాపకులు, మానవ హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులను యుఎపిఎ చట్టం కింద అక్రమంగా నిర్బంధించింది. వీరిలో ఒకరైన గిరిజన హక్కుల కార్యకర్త స్టాన్ స్వామి కస్టడీలోనే మరణించారు.

ఛత్తీస్‌గఢ్ లిక్కర్ స్కామ్‌లో రూ.205 కోట్ల ఆస్తులు జప్తుచేసిన ఇడి

న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్ లిక్కర్ స్కామ్ విచారణలో భాగంగా రూ.205 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం వెల్లడించింది. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి అనిల్ తుతేజాకు చెందిన రూ.15.82 కోట్ల విలువైన 14 ఆస్తులను, అన్వర్ దేబార్ (రాయ్‌పూర్ మేయర్, కాంగ్రెస్ నాయకుడు అయిజాజ్ దేబార్ సోదరుడు)కు చెందిన రూ.116.16 కోట్లు విలువైన 115 ఆస్తులను, వికాశ్ అగర్వాల్ అలియాస్ సుబ్బుకు చెందిన రూ.1.54 కోట్ల విలువైన ఆస్తులను, అర్వింద్ సింగ్ కు చెందిన రూ.12.99 కోట్ల విలువైన 33 ఆస్తులను జప్తు చేసుకున్నట్లు ఇడి ఒక ప్రకటనలో తెలిపింది. ఇండియన్ టెలికాం సర్వీసెస్ అధికారి అరుణ్‌పతి త్రిపాటికి చెందిన రూ.1.35 కోట్ల విలువైన ఒక ఆస్థిని, మద్యం వ్యాపారికి చెందిన రూ.28.13 కోట్లు విలువైన తొమ్మిది ఆస్తులను, నవీన్ కెడియాకు చెందిన రూ.27.96 కోట్లు విలువైన అభరణాలను కూడా జప్తు చేసుకున్నట్లు ఇడి తెలిపింది. ఆశీష్ సౌరభ్‌కు చెందిన రూ.1.2 కోట్లు ఆస్థులను కూడా ఇడి జప్తు చేసుకుంది. మొత్తంగా రూ. 205.49 కోట్లు విలువైన 18 చరాస్థులను, 161 స్థిరాస్థులను ఇడి జప్తు చేసుకుంది. 2003 బ్యాచ్ అనిల్ తుతేజాను ఈ కేసులో ఇడి ఇటీవలే అరెస్టు చేసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మద్యం సిండికేట్‌ను తుతేజా నిర్వహించేవాడని ఆరోపించింది. తుతేజా చర్యల కారణంగా రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని, మరోవైపు మద్యం సిండికేట్ వ్యాపారుల మాత్రం రూ. 2,161 కోట్ల నగదును ఆర్జించారని ఇడి ఆరోపించింది. ఈ కేసులో ఇడి గతంలో దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను సుప్రీంకోర్టు ఇటీవల కొట్టివేయడంతో, ఇడి తాజాగా మరో మనీలాండరింగ్ కేసును నమోదు చేసింది.




తిరుమలలో వడగళ్ల వాన

ప్రజాశక్తి -తిరుమల

వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగేలా తిరుమలలో భారీ వర్షం కురిసింది. దాదాపు 42 డిగ్రీలు ఉన్న ఉష్ణోగ్రతలు వరుణుని రాకతో 20 డిగ్రీలకు తగ్గుముఖం పట్టింది. తిరుమలలో వాతావరణం చల్లబడగా ఉదయం నుంచి తన ప్రభావాన్ని చూసిన సూర్యుడు శుక్రవారం మధ్యాహ్నం వేళకు వేడి నుంచి భారీ ఈదురు గాలులతో కూడిన వర్షంతో ఉపశమనం కలిగింది. వేసవి కాలంలో కురిసే వర్షం కావడంతో వడగండ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. భక్తులు కొద్దిపాటి ఇబ్బందులకు గురి అయిన వేసవిలో ప్రకతి ఇస్తున్న చల్లదనాన్ని ఆస్వాదించారు. తిరుమలలో రోడ్లు అన్ని వర్షపు నీటితో నిండి పోయాయి. భారీగా కురిసిన వర్షానికి నాలుగు మాఢ వీధులు జలమయం కాగా స్వామి వారి దర్శనానికి వెళ్ళిన భక్తులు, స్వామి వారి దర్శనం అనంతరం బయటకు వచ్చిన భక్తులు వర్షానికి తడిచి ముద్ద అయ్యారు. అకాల వర్షంతో తిరుమలలో వాతావరణం మరింత చల్లగా ఆహ్లాదకరంగా ఉండడంతో భక్తులు చల్లదనాన్ని ఎంజాయ్ చేసారు.

జలదిగ్బంధంలో జర్మనీ



భారీ వర్షాలతో జలమయమైన రోడ్లు

జర్మనీ : జర్మనీని వరదలు ముంచెత్తుతున్నాయి. ఉరుములతో కూడిన భారీ వర్షం కురుస్తుండటం తో అక్కడి రోడ్లు, ఇళ్లు జలమయమయ్యాయి. నిత్యావసర వస్తువులు అందక.. చాలా చోట్ల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు రంగంలోకి దిగి సహాయకచర్యలు చేపట్టారు. వరదలో చిక్కుకున్న ఇళ్ల ఖాళీ చేయిస్తున్నారు. మరోవైపు అగ్నిమాపక సిబ్బంది, రెడ్‌క్రాస్ రంగంలోకి దిగి సహాయ సహకారాలు అందిస్తున్నారు. బిసింగర్ మార్కెట్ చౌరస్తాలో మీటరు ఎత్తులో వరదనీరు నిలిచిపోయింది. గుటెన్‌బర్గ్ కిండర్ గార్డెన్ ఎదుట ఉన్న నిర్మాణ స్థలం వరద ధాటికి కొట్టుకుపోయింది. ఇక పలు ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. వాహనాలన్నీ ఒక దగ్గర పోగుపడ్డాయి. వరదలు కారణంగా పలు రోడ్లు మూసివేసినట్లు అధికారులు తెలిపారు.






మీ కోసం

రసం పిండిన నిమ్మ చెక్కలతో కత్తులు, కత్తిపీటలు రుద్దితే వాటికి అంటుకున్న ఉల్లిపాయ వాసన పోతుంది.

జీవన సౌరభం

ప్రయత్నాలను, పోరాటాలను.. పిరికివాళ్లు మొదలుపెట్టరు, బలహీనులు పూర్తిచేయరు, విజేతలు విడిచిపెట్టరు..

అడవికి రాజు




సింహగిరి అడవికి రాజు సింహం. అది తన రాజ్యాన్ని చక్కగా పాలించేది. ఆ సింహానికి ముసలితనం రావడం వల్ల రాజ్యపాలన కష్టమయ్యింది. ఒకరోజు అడవిలో ఉన్న జంతువులన్నింటినీ సమావేశపరచి, "నేనింక రాజ్యపాలన చేయలేను. దుర్బుద్ధి అనే తోడేలు చాలా చాకచక్యం కలది, ధైర్యం కలది అందుకు దాన్ని, సుబుద్ధి అనే కుందేలు చాలా తెలివి కలది, ఇతరుల మేలుకోరేది. అందుకుగాను కుందేలుని, వీళ్ళిద్దరికీ పోటీ పెడుతున్నాను. మీరందరూ ఎవరికి ఎక్కువ మద్దతు ఇచ్చి గెలిపిస్తే వారినే రాజును చేస్తా" అని చెప్పింది. సింహం మాటలకు అన్ని జంతువులు 'సరే' అన్నాయి.

కుందేలు పార్టీ గుర్తు కోడిపుంజు. తోడేలు పార్టీ గుర్తు క్యారెట్. ఈ రెండు జంతువులు అడవి అంతా తిరుగుతూ ఓట్లు అడుగుతున్నాయి. ఇలా రెండు రోజులు అయ్యాక తోడేలుకి కుందేలు గాని, దాని పార్టీ గుర్తుగాని గుర్తుకు వస్తే చాలా కోపం వచ్చేది. ఆ కోపంతో అడవిలో ఒక్క కోడిపుంజు కూడా లేకుండా అన్నీ చంపి తినేసింది. ఈ సంగతి తెలిసిన మిగిలిన జంతువులు తోడేలిది చాలా కుటిల బుద్ధి అనుకున్నాయి. కుందేలు మాత్రం తన పని తాను చేసుకుపోతోంది. ఎక్కడా ఈర్ష్య, అసూయ, ద్వేషాలకు పోకుండా జంతువులన్నింటితో చక్కగా మాటలు కలిపింది. తనకే ఓటు వేయాలని అభ్యర్థించింది. కానీ తోడేలు భయంతో చివరి వరకు ఎవరు ఎవరికి ఓటు వేస్తారో దానికి అర్థంకాలేదు.

ఇంతలో పోటీ జరిగే సమయం వచ్చింది. అడవిలో జంతువులన్నీ తమ ఓటు హక్కుని సద్వినియోగం చేసుకున్నాయి. ఆ తరువాత రోజు రాజైన ముసలి సింహం తన మంత్రితో కలసి, పోటీ చేసిన ఇద్దరి జాబితా ఓట్లను లెక్కింపు చేసి, ఎక్కువ ఓట్లు వచ్చిన సుబుద్ధిని విజేతగా ప్రకటించి రాజును చేసింది. జంతువులన్నీ ఆనందించాయి. బలవంతుడి కంటే బుద్ధి బలం ఉన్నవాడినే రాజుగా ఎంచుకున్నారని సింహం కూడా వాటిని అభినందించింది.

- బల్ల కృష్ణ వేణి
పలాస, శ్రీకాకుళం జిల్లా



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఈ చిత్రంలో పది తేడాలు ఉన్నాయి. అవి ఏమిటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ



డి.ఉమ
4వ తరగతి,
దిగువ సాంబయ్య పాళెం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నిప్పులుకక్కే ఆకాశం కింద నిరంతర శ్రమజీవులు



ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్నాయి. ఉదయం 7 గంటల నుండే ఎండ మండిపోతోంది. రాత్రి 7 గంటల వరకు ఒకటే వేడి గాలులు.. ఊపిరి తీసుకోనివ్వడం లేదు. ఇంత భయంకర వాతావరణంలో ఇంటి నుండి బయట కాలు పెట్టడానికి కూడా చాలామంది ఆలోచిస్తారు. సాయంత్రం వేళల్లోనే బయట పనులు చక్కబెట్టుకోవాలని ప్రణాళికలు వేసుకుంటారు. అయితే ఇంకొంత మంది మాత్రం ఆ ఎండలోనే బయటికి రావాలి. ఆరోగ్యం బాగున్నా, బాగోలేకపోయినా తప్పదు. వాతావరణ మార్పులు కొంతమందికి ఆహ్లాదాన్ని అందిస్తే, అవే మార్పులు మరికొంతమంది ప్రాణాలకు అపాయం కలిగిస్తాయి. అనారోగ్యాలకు కారణమవుతాయి. ప్రస్తుతం వేడెక్కిన వాతావరణం ఆ ప్రమాదాలను మరింత దగ్గర చేస్తోంది.

వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణరంగ కార్మికులు, గిగ్ కార్మికులు, ఏసీలు, ఫ్యాన్లు మరమ్మతులు చేసేవారు, రాపిడో, ఉబర్ వంటి ఆన్‌లైన్ ప్రయాణ సర్వీసులు ఇచ్చేవారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు.. ఇలా ఎంతోమంది కార్మికులు ఎండలోనే పనిచేస్తారు. ప్రస్తుత వాతావరణం వారి ప్రాణాలను హరించేస్తోందని ప్రపంచ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. భవిష్యత్తులో వారు ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని కూడా హెచ్చరిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులకు ప్రభావితం అయ్యే వారి సంఖ్య చాలా ఎక్కువగానే ఉంది. మొత్తం ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది ఏటా అధిక వేడికి గురవుతున్నారని నివేదికలో చెప్పారు. వారిలో దాదాపు 23 మిలియన్ల (2 కోట్లా మూడు లక్షలకు పైగా జనాభా) మంది పని ప్రదేశంలో ప్రమాదాలకు గురవుతున్నారు.

ఏయే ప్రమాదాలు అంటే..

నివేదిక ప్రకారం, అధిక వేడి, అతినీలలోహిత వికిరణం, విపరీత వాతావరణ సంఘటనలు, పని ప్రదేశాల్లో వాయు కాలుష్యం, వెక్టర్-బోర్న్ (చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాలు), వ్యవసాయ రసాయనాలు వంటివి ఒత్తిడి, స్ట్రోక్, అలసట వంటి అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి.

అభివృద్ధి చెందుతున్న మనదేశ వర్కర్స్ కమ్యూనిటీలో వ్యవసాయం, అనుబంధ రంగాల కార్మికుల సంఖ్య కంటే గిగ్ కార్మికులు అంటే యాప్ డ్రైవర్లు, ఫుడ్ అండ్ గ్రాసరీ డెలివరీలు, ఎలక్ట్రికల్ వస్తువుల మరమ్మతులు చేసేవారు, ఇంటి మరమ్మతులు చేసేవారు, కొరియర్ సర్వీస్ ఉద్యోగుల సంఖ్య క్రమంగా వృద్ధి చెందుతోంది.

నాస్కామ్ అధ్యయనం ప్రకారం మన దేశ మొత్తం కార్మిక శక్తిలో గిగ్ కార్మికుల సంఖ్య 1.5 శాతం ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య 4.5 నాటికి చేరుకోనుందని అంచనా వేస్తున్నారు. నివేదిక ప్రకారం మన దేశ మొత్తం కార్మిక శక్తిలో అంటే 60 కోట్ల మందిలో 80 శాతం మంది వేడి వాతావరణానికి ప్రభావితమై ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని నివేదిక సూచిస్తోంది. ఈ సంఖ్య దక్షిణ అమెరికా మొత్తం జనాభా 18 కోట్ల కంటే ఎక్కువ.

ఏయే రంగాలు ఎక్కువ ప్రభావితం?

వ్యవసాయం రంగ కార్మికులు వేడి వాతావరణానికి ఎక్కువగా ప్రభావితమవుతారు. ఎటువంటి రక్షణ లేకుండా పనిచేయడం వల్ల వాతావరణ మార్పులకు వారు త్వరగా గురవుతారు. మనదేశ మొత్తం శ్రామిక శక్తిలో వ్యవసాయ రంగం, దాని అనుబంధ రంగాలలో 45.76 శాతం మంది పనిచేస్తున్నారని గత నివేదికలు తెలుపుతున్నాయి. అలాగే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) రంగం దేశంలోని శ్రామిక శక్తిలో 21 శాతం అంటే 12 కోట్ల 3 లక్షల మంది కంటే ఎక్కువ మంది కార్మికులు వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనిచేస్తున్నారు. దాదాపు 6.4 కోట్ల ఎంటర్‌ప్రైజెస్‌తో కూడిన ఈ రంగం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద విభాగం. అయినా..

దేశం మొత్తం ఉత్పాదక ఉత్పత్తిలో మూడవ వంతు కంటే ఎక్కువ వాటాను కలిగివున్న ఈ రంగంలో కార్మికుల రక్షణ కోసం ఏవిధమైన చర్యలూ లేవు. కార్మికుల పని పరిస్థితులపై ఎటువంటి పర్యవేక్షణ లేక, వేడి వాతావరణానికి తీవ్రంగా ప్రభావితమవుతారు. ఈ రంగాన్ని, భవన నిర్మాణ రంగం అనుసరిస్తుంది. ఇందులో దాదాపు 7 కోట్ల మంది అంటే భారత దేశ శ్రామిక శక్తిలో దాదాపు 12 శాతం మంది ఆధారపడుతున్నారు. ఈ రంగం ఎక్కువగా పట్టణాల్లోనే వేగంగా వ్యాపిస్తోంది. ఇక్కడ పనిచేసే కార్మికులు తరచూ శారీరక గాయాలతో గురవుతారు. అలాగే దేశంలో అనేక నగరాలు కాలుష్య కారకాలుగా మారడం వల్ల ఆస్మా వంటి వాయు కాలుష్య సంబంధ ఆరోగ్య ప్రమాదాలకు గురయ్యే అవకాశం కూడా ఉంది.

ఎండకు, వానకు, గజగజ వణికే చలికి ఏమాత్రం లొంగకుండా రెక్కలు ముక్కలు చేసుకునే కష్టజీవులకు వాతావరణ మార్పులు పెను ప్రమాదాన్ని తెచ్చిపెట్టడం విచారించదగ్గ అంశం. కార్మిక చట్టాల అమల్లో ఉన్న లోటుపాట్ల వల్ల సరైన రక్షణ సదుపాయాలు వారికి కల్పించడం లేదు. పాలకుల చర్యల్లో మార్పులు రానంత వరకు ఆ కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టాల్సిందే!





త్వరలో రజనీకాంత్ బయోపిక్




సెలబ్రిటీల జీవిత చరిత్రలు వెండితెరకెక్కడం సహజమే. అలా ఇప్పటికే రాజకీయ రంగంలో మహాత్మాగాంధీ, కామరాజర్, జయలలిత, వైఎస్ఆర్.. క్రీడా రంగంలో మహేంద్రసింగ్ ధోని వంటి పలువురు బయోపిక్స్ సినిమాగా రూపొందాయి. ఇందిరాగాంధీ, సంగీత దర్శకుడు ఇళయరాజా బయోపిక్‌లు తెరకెక్కుతున్నాయి. తాజాగా సూపర్‌స్టార్ రజనీకాంత్ బయోపిక్‌ను చిత్రంగా రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని ప్రచారం జోరందుకుంది. కర్ణాటకకు చెందిన శివాజీరావ్ గైక్వాడ్ అనే ఒక సాధారణ బస్సు కండెక్టర్ నేడు దక్షిణ భారత సినీ రంగంలో సూపర్‌స్టార్‌గా రాణిస్తున్నారు. ఆయన ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో కష్టాలు, అవమానాలు ఎదుర్కొన్నారు. రజనీకాంత్ జీవితాన్ని వెండి తెరకెక్కించడానికి హిందీ చిత్రాల నిర్మాత సుజిత్ నడియద్వాలా సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

హీరోలతో అఫైర్లు నిర్మాతల సృష్టే

సోనాలీ బింద్రే



'1994లో నేను ఇండస్ట్రీలోకి వచ్చా. ఇప్పటికంటే అప్పటి పరిస్థితులు చాలా డిఫరెంట్‌గా ఉండేవి. అప్పట్లో సహనటులతో నాపై ఎన్నో రూమర్స్ సృష్టించారు. కానీ వాటిలో ఒక్కటంటే ఒక్కటి నిజం లేదు. ఇప్పటికీ ఈ చెత్త ట్రెండ్ కొనసాగుతూనే ఉంది. 1990ల్లో సినిమా నిర్మాతలే కావాలనే హీరో హీరోయిన్ల మధ్య ఎఫైర్స్ క్రియేట్ చేసేవారు. సినిమా ప్రమోషన్స్ కోసం ఈ విధంగా చేసేవారని తెలిసి ఆశ్చర్యపోయా' బాలీవుడ్ హీరోయిన్ సోనాలీబింద్రే వ్యాఖ్యానించారు. మహేశ్ బాబు సరసన 'మురారి' సినిమాతో ఆమె టాలీవుడ్‌కు పరిచయమైంది. తర్వాత చిరంజీవితో ఇంద్ర, నాగార్జునతో 'మన్మధుడు' చిత్రాల్లో నటించింది. 2002లోనే నిర్మాత, వ్యాపార వేత్త గోల్డీబెల్‌ను ఆమె వివాహం చేసుకొని, సినిమాలకు గుడ్ బై చెప్పారు. 1990ల్లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన ఆమె ఇటీవల ది బ్రోకెన్ న్యూస్ సీజన్-2తో ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశారు.



పాతికేళ్ల తరువాత కలిశారు!

దాదాపు పాతికేళ్ల తర్వాత ప్రభుదేవా, ఏఆర్ రెహమాన్ కలిసి పనిచేయబోతున్నారు. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి మనోజ్ ఎన్ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎఆర్ఆర్‌పిడి6 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అయినట్లు తెలుపుతూ ప్రభుదేవా సోషల్ మీడియాలో కొన్ని ఫొటోస్ షేర్ చేశారు. ఈ చిత్రంలో యోగి బాబు, అజు వర్గీస్, అర్జున్ అశోక్, సాట్జ్, నిష్మా చెంగప్ప వంటి తదితరులు కీలక పాత్ర పోషిస్తున్నారు. డాన్స్, కామెడీ, మ్యూజిక్ ప్రధాన అంశాలుగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాను దివ్య మనోజ్, ప్రవీణ్ ఎలక్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



నటుడు జయరాం కుమార్తె వివాహం

ప్రముఖ నటుడు జయరాం కుమార్తె మాళవిక వివాహం సింపుల్‌గా జరిగింది. నవనీత్ గిరిశ్‌తో ఆమె ఏడడుగులు వేశారు. కేరళలోని గురువాయూర్‌లోని ఓ గుడిలో వీరి వివాహం సంప్రదాయబద్ధంగా జరిగింది. ఇరు కుటుంబసభ్యులతో పాటు బాగా దగ్గరి బంధువులు మాత్రమే ఈ పెళ్లికి హాజరయ్యారు. ఈ పెళ్లి ఫొటోలు బయటకురాగా నూతన వధూవరులకు నెటిజన్లు, అభిమానులు శుభాకాంక్షలు చెబుతున్నారు. శుక్రవారంనాడు రిసెప్షన్ ఏర్పాటు చేయగా సినీ రంగ ప్రముఖులు పెద్దఎత్తున హాజరయ్యారు. గిరీశ్ ప్రస్తుతం అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. మలయాళ నటుడైన జయరాం తెలుగు వారికి కూడా బాగా సుపరిచితమే. తాజాగా 'గుంటూరు కారం' సినిమాలో మహేశ్‌కు తండ్రి పాత్రలో నటించారు. 'అల వైకుంఠపురంలో' అల్లు అర్జున్‌కు తండ్రిగా కనిపించారు.

'కన్నప్ప'లో అక్షయ్ షూట్ పూర్తి



మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో దక్షిణాది అగ్ర నటీనటులతో పాటు ఉత్తరాది హీరోలు కూడా నటిస్తున్నారు. ఇటీవలె బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ షూటింగ్‌లో పాల్గొన్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో అక్షయ్ కుమార్ తన పాత్ర సన్నివేశాల చిత్రీకరణను పూర్తి చేశారు. ఈ విషయమై విష్ణు మంచు సోషల్ మీడియాలో అక్షయ్ కుమార్‌తో కలిసి పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. 'అక్షయ్ కుమార్‌తో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందని, ఆయన నుంచి చాలా నేర్చుకున్నాన'ని విష్ణు చెప్పారు. ప్రయాణం విలువైనది, మళ్లీ మళ్లీ ఇలాగే కలవాలని ఉందని తెలిపారు. మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఈ ప్రాజెక్ట్ షూటింగ్ చివరి దశకు చేరుకుంది. త్వరలో పూర్తి చేసి ప్రమోషన్ కార్యక్రమాన్ని విస్తృతం చేస్తామని చిత్రబృందం తెలిపింది.

వాంఖడేలో కోల్‌కతా హవా

- ముంబయి ఇండియన్స్‌పై 24 పరుగుల తేడాతో గెలుపు
- స్టార్క్‌కు నాలుగు వికెట్లు



ముంబయి: వాంఖడే స్టేడియంలో కోల్‌కతా హవా కొనసాగింది. 57పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డా.. వెంకటేశ్ అయ్యర్, మనీష్ పాండే రాణించడంతో 169 పరుగులు చేసింది. అనంతరం ముంబయిని 18.5ఓవర్లలో 145పరుగులకే ఆలౌట్ చేసి 24పరుగుల తేడాతో విజయం సాధించింది. బౌలర్లకు సహకరించిన వాంఖడే స్టేడియంలో తొలుత ముంబయి బౌలర్లు చెలరేగారు. టాపార్డర్ బ్యాటర్లను తుషార కూల్చగా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్ల పని జస్ప్రీత్ బుమ్రా పని పట్టాడు. కోల్‌కతా పవర్ ప్లే ముగిసేలోపే నాలుగు వికెట్లను కోల్పోయింది. ఏడో ఓవర్‌లో ఐదో వికెట్‌ను కూడా చేజార్చుకొని మరింత కష్టాల్లో పడింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన వెంకటేశ్ అయ్యర్(70), మనీశ్ పాండే(42) ఆదుకున్నారు. వెంకటేశ్ అయ్యర్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా.. మనీష్.. హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆండ్రూ రస్సెల్ ఎక్కువసేపు క్రీజులో నిలబడలేకపోయాడు. రనౌట్ అయి పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత బుమ్రా మరింత రెచ్చిపోయి బౌలింగ్ చేశాడు. దీంఓ కోల్‌కతా వరుస వికెట్లను చేజార్చుకుంటూ ఆలౌటయింది. తుషారా వేసిన తొలి ఓవర్‌లో నాలుగో బంతికి ఫిలిప్ సాల్ట్ (5) తిలక్‌వర్మకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. మూడో ఓవర్‌లో రెండో బంతికి రఘువంశీ (13) కూడా క్యాచ్ ఔటవ్వగా.. చివరి బంతికి శ్రేయస్ అయ్యర్ (6) కూడా ఔటయ్యాడు. హార్దిక్ పాండ్యా వేసిన ఐదో ఓవర్‌లో రెండో బంతికి నరైన్ (8) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఏడో ఓవర్‌లో తొలి బంతికే రింకు (9) పీయూష్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. టాపార్డర్ విఫలమైన వేళ క్రీజులోకి వచ్చిన వెంకటేశ్ అయ్యర్ (70), మనీశ్ పాండే (42) విజంభించారు. వీళ్లిద్దరూ కలిసి జట్టుకు కీలక స్కోర్‌ను అందించారు. కానీ 17వ ఓవర్‌లో కోల్‌కతాకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. హార్దిక్ పాండ్యా వేసిన ఈ ఓవర్‌లో రెండు వికెట్లను కోల్‌కతా కోల్పోయింది. మూడో బంతికి మనీశ్ పాండే బ్రెవిస్‌కు క్యాచ్ ఇచ్చాడు. చివరి బంతికి పరుగు తీసే క్రమంలో రసెల్ (7) రనౌట్ అయ్యాడు. బుమ్రా వేసిన 18వ ఓవర్‌లోనూ రెండు వికెట్లు పడ్డాయి. ఈ ఓవర్‌లో నాలుగో బంతికి రమణ్‌దీప్ (2) క్యాచ్ ఔటవ్వగా.. స్టార్క్ (0) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఇక 19.5 ఓవర్ల వద్ద వెంకటేశ్ అయ్యర్ కూడా ఔటయ్యాడు. దీంతో కోల్‌కతా 19.5ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో ముంబయి కష్టాలతోనే ఇన్నింగ్స్ ప్రారంభించింది. సూర్యకుమార్(56), టిమ్ డేవిడ్(24) మాత్రమే రాణించారు. స్టార్క్ చివర్లో వరుసగా మూడు వికెట్లు తీసి కోల్‌కతా గెలుపులో కీలకపాత్ర పోషించాడు.

స్కోర్‌బోర్డు..

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి)తిలక్ వర్మ (బి)తుషార 5, నరైన్ (బి)హార్దిక్ 8, రఘువంశీ (సి)సూర్యకుమార్ (బి)తుషార 13, శ్రేయస్ (సి)టిమ్ డేవిడ్ (బి)తుషార 6, వెంకటేశ్ అయ్యర్ (బి)బుమ్రా 70, రింకు సింగ్ (సి అండ్ బి)చావ్లా 9, మనీష్ పాండే (సి)బ్రెవీస్ (బి)హార్దిక్ పాండ్యా 42, రస్సెల్ (రనౌట్) తుషార/హార్దిక్ 7, రమణ్‌దీప్ సింగ్ (సి)కొర్జె (బి)బుమ్రా 2, మిఛెల్ స్టార్క (బి)బుమ్రా 0, వైభవ్ అరోరా (నాటౌట్) 0, అదనం 7. (19.5ఓవర్లలో ఆలౌట్) 169పరుగులు. **వికెట్ల పతనం:** 1/7, 2/22, 3/28, 4/43, 5/57, 6/140, 7/153, 8/155, 9/155, 10/169 **బౌలింగ్:** తుషార 4-0-42-3, బుమ్రా 3.5-18-3, కొర్జె 2-0-24-0, హార్దిక్ 4-0-44-2, నమన్ 3-0-25-0, చావ్లా 3-0-15-1.

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (బి)స్టార్క్ 13, రోహిత్ శర్మ (సి)మనీష్ పాండే (బి)నరైన్ 11, నమన్ ధీర్ (బి)చక్రవర్తి 11, సూర్యకుమార్ యాదవ్ (సి) సాల్ట్ (బి)రస్సెల్ 56, తిలక్ వర్మ (సి)నరైన్ (బి)చక్రవర్తి 4, వధేరా (బి)నరైన్ 6, హార్దిక్ పాండే (సి)మనీష్ పాండే (బి)రస్సెల్ 1, టిమ్ డేవిడ్ (సి)శ్రేయస్ (బి)స్టార్క్ 24, కోర్జె (బి)స్టార్క్ 8, పియూష్ చావ్లా (సి)నరైన్ (బి)స్టార్క్ 0, బుమ్రా (నాటౌట్) 1, అదనం 10. (18.5 ఓవర్లలో ఆలౌట్) 145పరుగులు **వికెట్ల పతనం:** 1/16, 2/38, 3/46, 4/61, 5/70, 6/71, 7/120, 8/144, 144/9, 10/145 **బౌలింగ్:** వైభవ్ అరోరా 3-0-35-0, స్టార్క్ 3.5-0-33-4, చక్రవర్తి 4-0-22-2, నరైన్ 4-0-22-2, రస్సెల్ 4-0-30-2.

వన్డే, టి20ల్లో టీమిండియాకు అగ్రస్థానం

టెస్టుల్లో టాప్‌లో ఆస్ట్రేలియా ● ఐసిసి ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ వైట్‌బాల్ సిరీస్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఐసిసి శుక్రవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత్ వన్డే, టి20ల్లో అగ్రస్థానంలో నిలువగా.. టెస్టుల్లో ఒక స్థానం దిగజారి రెండోస్థానంలో నిలిచింది. వన్డేల్లో భారత్(122పాయింట్లు) టాప్‌లో నిలువగా.. ఆస్ట్రేలియా(116), దక్షిణాఫ్రికా(112) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక టి20ల్లో భారత్(264పాయింట్లు) అగ్రస్థానంలో ఉంది. ఆస్ట్రేలియా(257), ఇంగ్లండ్(252) టాప్-3లో నిలిచాయి. ఇక టెస్టుల్లో భారత్ రెండోస్థానానికి పడిపోయింది. భారత్(120పాయింట్లు) రెండోస్థానంలో నిలువగా.. ఆస్ట్రేలియా(124) టాప్‌లో ఉంది. ఇక ఇంగ్లండ్(105) మూడోస్థానంలో నిలిచింది. జూన్ 2023లో ఇంగ్లండ్‌లోని ఓవల్‌లో జరిగిన వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్ తర్వాత 2024-25 డబ్ల్యుటిసి ఛాంపియన్‌షిప్ ఫైనల్లో నిలవాలంటే టీమిండియా మరింత రాణించాల్సిన అవసరం ఉంది. ఇక సౌతాఫ్రికా (103), న్యూజిలాండ్ (96) వరుసగా 4,5 స్థానాల్లో ఉన్నాయి. న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ 859 రేటింగ్ పాయింట్స్‌తో టెస్టుల్లో టాప్‌లో నిలువగా.. రోహిత్ శర్మ(6), జైస్వాల్(7), కోహ్లీ(9) టాప్-10లో ఉన్నారు.

ఐపిఎల్‌లో నేడు

బెంగళూరు × గుజరాత్

వేదిక: బెంగళూరు; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	10	8	2	16	0.62
కోల్‌కతా	10	7	3	14	1.09
లక్నో	10	6	4	12	0.09
సన్‌రైజర్స్	10	6	4	12	0.07
చెన్నై	10	5	5	10	0.62
ఢిల్లీ క్యాపిటల్స్	11	5	6	10	-0.44
పంజాబ్‌కింగ్స్	10	4	6	8	-0.06
గుజరాత్	10	4	6	8	-0.11
ముంబయి	11	3	8	6	-0.35
బెంగళూరు	10	3	7	6	-0.41

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

మోడీ కోడ్‌ను ఉల్లంఘిస్తుంటారు
ఇసి చోద్యం చూస్తూనే ఉంటుంది

- 27 ఫిర్యాదులొస్తే ఒక్క దాంట్లో నోటీసు..
- ప్రతిపక్షాలపై ఫిర్యాదులొస్తే తక్షణ స్పందన





న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్నారని ఆరోపిస్తూ 2019 నుండి ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల కమిషన్‌కు 27 ఫిర్యాదులు చేశాయి. విద్వేష ప్రసంగాలను చేయడం, ఓట్లను అడిగేందుకు సాయుధ బలగాలను ఉపయోగించుకోవడం, మతం పేరుతో ఓట్లను అడగడం, ప్రధాని ఎన్నికల ప్రసంగాలను రూపొందించేందుకు మంత్రిత్వ శాఖలను వాడుకోవడం తదితర అంశాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదులొస్తే, వీటిలో ఏ ఒక్కదానిపైనా చర్యల్లేవు. బిజెపి స్టార్ క్యాంపెయినర్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించేలా ప్రసంగాలను చేస్తున్నారంటూ ఈ ఏడాది ఏప్రిల్ 25న బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులో కూడా మోడీ పేరు ఎక్కడా పేర్కొనలేదు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నోటీసులు జారీ చేస్తున్నట్లు ఇసి పేర్కొంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులను ఎక్కువ మంది పిల్లలు కనేవారికి, చొరబాటుదారులకు పంచి పెడుతుందంటూ రాజస్థాన్‌లోని బాన్స్‌వారా ర్యాలీలో మోడీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆ ఫిర్యాదుల్లో ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. 2019 నుండి చేసిన ఈ ఫిర్యాదుల కాపీలు 'ది క్వింట్' వద్ద వున్నాయి. వీటిని విశ్లేషించగా, మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలకు సంబంధించి 12 ఫిర్యాదులు, సాయుధ బలగాలను ఉపయోగించి ఓట్లు అడగడానికి సంబంధించి 8 ఫిర్యాదులు ఉన్నాయి. అలాగే రాజకీయ అడ్వర్టయిజ్‌మెంట్లలో ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవడం, మతం పేరుతో ఓట్లు దండుకోవడం, ఎన్నికల ప్రసంగాల తయారీకి ప్రభుత్వ మంత్రిత్వ శాఖలను దుర్వినియోగపరచడం, ఎన్నికల ప్రచారం కోసం మైనర్లను ఉపయోగించడం, గడువు ముగిసిన తర్వాత కూడా ఎన్నికల ప్రచారం చేయడం, ప్రచారానికి ఉపయోగించిన ప్రధాని హెలికాప్టర్‌లో అనుమానాస్పద రీతిలో కనిపించిన బ్లాక్ బాక్స్‌ల ఉదంతానికి సంబంధించిన ఫిర్యాదులు కూడా వీటిలో ఉన్నాయి. అయినా, వీటిలో ఏ ఒక్కదానిపైనా ఇంతవరకు చర్యల్లేవు. 2019 మార్చి 27న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు రాసిన లేఖలో ప్రధాని మోడీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో డిఆర్‌డిఒ వంటి సంస్థల కృషిని తన ఖాతాలో వేసుకునేందుకు యత్నించారని, ఇది కచ్చితంగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు.. ఉపగ్రహ విధ్వంసక క్షిపణి ప్రయోగం విజయవంతమైన విషయాన్ని సాధారణంగా డిఆర్‌డివోనో, సంబంధిత శాస్త్రవేత్తలో ప్రకటిస్తారు. దీనికి భిన్నంగా మోడీ ఆనాడు ప్రకటన చేశారు. అంతటితో ఆగలేదు. ఈ దేశ భూభాగానికే కాకుండా ఆకాశానికి, అంతరిక్షానికి కూడా చౌకీదార్‌నని మోడీ చెప్పుకున్నారు.. దీనిపై ఇసి ఒక కమిటీ వేసి మమ అనిపించడం మినహా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ప్రతిపక్ష నేతలపై ఫిర్యాదులొస్తే వెంటనే స్పందిస్తుంది

అధికారంలో ఉండే పెద్దల పట్ల ఒక విధంగా, ప్రతిపక్షాల నేతల పట్ల ఇంకొక విధంగా వ్యవహరించడం ఎన్నికల సంఘం నిష్పాక్షికతను ప్రశ్నార్థకం చేస్తోంది. తమ పార్టీ రూపొందించిన ఆడియో క్యాసెట్‌లో జై భవాని, హిందూ అనే పదాలను తొలగించాలంటూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు మీద తనకు నోటీసులు జారీ చేసిన ఎన్నికల సంఘం, ప్రధాని బహిరంగంగా కోడ్ ఉల్లంఘిస్తున్నా ఎందుకు స్పందించడం లేదని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే ప్రశ్నిస్తే దానికి కూడా సమాధానం లేదు. హనుమాన్ పేరుతో మోడీ రెచ్చగొట్టే ప్రసంగాలను చేస్తున్నారని గతేడాది మే 4న కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. అయినా, ఆయనపై ఎలాంటి చర్యలు లేవు. అదే ఏడాది నవంబరులో మోడీని విమర్శించినందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సంపన్నులకు రుణాల రద్దు, పిక్‌పాకెట్, పనౌటి వంటి పదాలు వాడడం, రాజకీయ ప్రత్యర్థులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం ఎన్నికల కోడ్ కింద నిషిద్ధమని చెప్పింది. ఎన్నికల కోడ్ అనేది మోరల్ సెన్సార్ అని పేర్కొంది. ఎంతటి వారైనా సరే కోడ్ ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ పద్దెనిమిదో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా ప్రకటించారు. దానిని ఇసి ఆచరణలో ఎందుకు చూపడం లేదన్నదే ప్రశ్న.

మొదటి దశ పోలింగ్‌లో
ఆరు శాతం ఓట్ల తేడా ఎందుకు ?

- అనవసర జాప్యానికి కారణమేంటి
- ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ఏచూరి లేఖ

ఇండియా న్యూస్ నెట్‌వర్క్, న్యూఢిల్లీ

భారత ఎన్నికల కమిషన్ ఓటింగ్ గణాంకాలను విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యాలు, వ్యత్యాసాల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు సీతారాం ఏచూరి ఒక లేఖ రాశారు.

అసాధారణమైన రీతిలో ఆలస్యం జరిగిన తర్వాత, మొదటి దశ పోలింగ్‌లో నమోదైన ఓట్ల శాతానికి సంబంధించి తుది గణాంకాలు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయని, ఇది నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని, ఇక రెండో దశ పోలింగ్‌లో వివరాలపై ఇప్పటికే నాలుగు రోజుల ఆలస్యం జరిగిందని ఏచూరి ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ అనవసరమైన జాప్యానికి కారణమేంటో వివరిస్తూ ఎన్నికల కమిషన్ ఎలాంటి ప్రకటన చేయకపోవడం దురదృష్టకరమని అన్నారు. తొలిగా ప్రకటించిన గణాంకాలకు, తుది అంకెగా ఇసిఐ వెల్లడించిన దానికి మధ్య ఆరు శాతం ఓట్లు పెరిగాయని దీనికి కూడా సమాధానమే లేకుండా పోయిందన్నారు. తొలి, తుది గణాంకాలకు స్వల్పంగా వ్యత్యాసం వుండడం ఆమోదయోగ్యం కానీ ఆరు శాతం ఓట్లు అన్న ఈ తేడా చాలా అసాధారణంగా వుందని, కొంత అనుమానాలకు కూడా తావిస్తోందని ఏచూరి పేర్కొన్నారు. పైగా శాతాల సమాచారం వెల్లడించినప్పటికీ ఓటింగ్ గణాంకాలు (పోలైన ఓట్ల సంఖ్య) ను ఇంకా అందించలేదు. ఈ ప్రక్రియకు సంబంధించి పారదర్శకత, విశ్వసనీయత ప్రయోజనాల దృష్ట్యా వీటిపై చెలరేగిన సందేహాలను ఎన్నికల కమిషన్ నివృత్తి చేయడం తప్పనిసరని ఏచూరి పేర్కొన్నారు. రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా, అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా తొలి, తుది ఓట్ల శాతాన్ని, ఆలాగే పోలైన ఓట్ల సంఖ్యను అందచేయాలి. అలాగే, ఏ కేటగిరీలో –ఇవిఎంలు, పోస్టల్ బ్యాలెట్లు, విధుల్లో వున్న సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో – ఇంతలా ఓట్ల శాతం పెరిగిందో, ఎలా పెరిగిందో కూడా వివరణ ఇవ్వాల్సిన అవసరం వుందని ఏచూరి ఆ లేఖలో కోరారు.



ఈ ఎన్నికల్లో మోడీని తిరస్కరించాలి

ప్రధాని నరేంద్ర మోడీ మాటలు, చేష్టలు అయనలోని భయం, నిరాశ నిస్పృహలకు తిరుగులేని సంకేతాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. దశాబ్ద కాలం పాటు ప్రధానిగా ఆయన చేసే ఊకదంపుడు ప్రసంగాలు, తిమ్మిని బమ్మిని చేసే ఆయన వాగాడంబరాలు ఏవీ పనిచేయడం లేదు. ఈ ఎన్నికల్లో ప్రజలు మార్పును కోరుకుంటున్నారనే విషయం అంతకంతకూ స్పష్టమవుతుం డడంతో నిరాశా నిస్పృహలకు లోనైన మోడీ అసత్యాలు, విద్వేషపు వ్యాఖ్యలతో ప్రజల మధ్య చీలిక తెచ్చి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారు. కాబట్టి మోడీని వట్టి కరిపించేలా ప్రజలు తీర్పు ఉండాలి అని ఏచూరి ఓ ట్వీట్‌లో కోరారు.

20 తర్వాతే సిబిఎస్ఇ 10, 12వ తరగతి ఫలితాలు

న్యూఢిల్లీ : 10, 12వ తరగతి పరీక్షల ఫలితాలు ఈ నెల 20 తర్వాత వెలువడతాయని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) శుక్రవారం ప్రకటించింది. సిబిఎస్ఇ బోర్డు ఫలితాలు మే 20 తర్వాత ప్రకటించే అవకాశం ఉందని cbseresults.nic.in అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ ఏడాది సిబిఎస్ఇ పదో తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి మార్చి 13వరకు, 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 12 తేదీ వరకు నిర్వహించారు. దేశవ్యాప్తంగా సుమారు 39లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

'ఓటుకు నోటు' కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఓటుకు నోటు' కేసు విచారణను తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని బిఆర్ఎస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు జులై చివరి వారానికి వాయిదా వేసింది. మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బిఆర్ఎస్ నేతలు జగదీష్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, సత్యవతి రాథోడ్, మహ్మూద్ అలీ సుప్రీంకోర్టులో ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ సతీష్ చంద్రశర్మ, జస్టిస్ సందీప్ మెహతతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఇదే రోజు (శుక్రవారం) రిజిస్ట్రార్ కోర్టులో ఈ పిటిషన్‌పై విచారణ జరగాల్సి ఉండగా... పిటిషనర్లు ఉద్దేశపూర్వకంగా రెగ్యులర్ బెంచ్ ముందుకు మెన్షన్ చేసి తీసుకువచ్చారని తెలంగాణ ప్రభుత్వం తరపున ముకుల్ రోహత్గి, మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు. మధ్యలో జోక్యం చేసుకున్న ధర్మాసనం, దేశంలో ఇన్ని రాష్ట్రాలు ఉండగా మధ్యప్రదేశ్ హైకోర్టుకు మాత్రమే ఎందుకు ఎంపిక చేసుకున్నారని పిటిషనరు తరపున న్యాయవాదిని ప్రశ్నించింది. మరోసారి రోహత్గి వాదనలు కొనసాగిస్తూ రాజకీయ ప్రమేయం ఉన్న ఈ కేసును ఉద్దేశపూర్వకంగానే కోర్టు ముందుకు తెచ్చారని వాదించారు. ఇందుకు న్యాయవాది సిద్ధార్థ దవే అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా రోహత్గి, దవే ఒకరి వాదనలను ఒకరు అడ్డుకున్నారు. పదేపదే ధర్మాసనం చెప్పినా, న్యాయవాదులు ఒకరి లక్ష్యంగా చేసుకుని మరొకరు వాదనలు కొనసాగించడంతో జస్టిస్ గవాయి జోక్యం చేసుకొని... 'నేను ముంబాయి, ఔరంగబాద్, నాగ్‌పూర్, పంజీ హైకోర్టులో పనిచేశాను. ఎప్పుడూ ఇలాంటి క్రమశిక్షణ రాహిత్యాన్ని చూడలేదు' అని అన్నారు. దీంతో న్యాయవాదులు ధర్మాసనానికి క్షమాపణలు చెప్పారు.

బెదిరించి... అత్యాచారం చేశారు

- ప్రజ్వల్‌పై పార్టీ కార్యకర్త ఫిర్యాదు

బెంగళూరు : తనను, తన భర్తను చంపేస్తానని బెదిరించి హస్సన్ నగరంలోని ఎంపి క్వార్టర్స్‌లో జెడి(ఎస్) ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ తనపై అత్యాచారానికి పాల్పడినట్లు పార్టీకి చెందిన 44 ఏళ్ల మహిళా కార్యకర్త ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 1న బెంగళూరులో కేసు నమోదయింది. ఒక హాస్టల్లో కొంతమంది విద్యార్థినులకు సీట్లు కోరుతూ 2021లో ఎంపిని కలవడానికి వెళ్లినప్పుడు తరువాత రోజు రమ్మని చెప్పారని, తరువాత రోజు ఎంపి క్వార్టర్స్‌లో తుపాకీతో బెదిరించి బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డారని మహిళ తెలిపింది. ఫోన్‌లో రికార్డు చేసి, బెదిరిస్తూ జనవరి 1, 2021 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 25 వరకూ అనేకసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని బాధిత మహిళ తెలిపింది.

హెచ్.డి. రేవణ్ణపై కిడ్నాప్ కేసు ..

ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ తండ్రి, జెడి(ఎస్) ఎమ్మెల్యే హెచ్.డి. రేవణ్ణపై కేసు నమోదైంది. బాధితురాలు గతంలో హెచ్‌డి రేవణ్ణ ఇంట్లో పనిమనిషిగా ఆరేళ్ల పాటు పనిచేసిందని, ప్రజ్వల్ ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఇటీవల విడుదలైన వీడియోల్లో ఉందని పోలీసులు తెలిపారు. కిడ్నాపైన మహిళ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పకుండా నిరోధించేందుకే ఆమెను ఏప్రిల్ 29న సతీష్ బాబన్న కిడ్నాప్ చేసి, హెచ్‌డి రేవణ్ణ ఇంటికి తీసుకెళ్లారని బాధితురాలి కుమారుడు గురువారం సాయంత్రం మైసూరు జిల్లాలోని కె.ఆర్. నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆమె ప్రాణాలకు ముప్పు ఉందని ఫిర్యాదులో తెలిపారు.

బెయిల్ పిటీషన్ వెనక్కి తీసుకున్న హెచ్‌డి రేవణ్ణ

లైంగిక వేధింపుల కేసులో జెడిఎస్ ఎమ్మెల్యే హెచ్‌డి రేవణ్ణ తన ముందస్తు బెయిల్ దరఖాస్తును వెనక్కి తీసుకుంటూ బెంగళూరు సెషన్స్ కోర్టులో పిటీషన్ వేశారు. హెచ్‌డి రేవణ్ణపై నాన్ బెయిలబుల్ అభియోగాలు ఏమీ లేవని సిట్ తెలిపింది.

ఎన్నికల నేపథ్యంలో

కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్ పరిశీలన

- 7న విచారణ జరుపుతాం
- సుప్రీంకోర్టు ధర్మాసనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌ను పరిగణనలోకి తీసుకుంటామని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈనెల 7న ఈ అంశంపై విచారణ జరుపుతామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కు తెలిపింది. కేజ్రీవాల్ బెయిల్ అంశంపై సిద్ధంగా ఉండాలని ఇడి న్యాయవాదికి సూచించింది. 'మేం బెయిల్ మంజూరు చేయవచ్చు లేదా మంజూరు చేయకపోవచ్చు. దీని గురించి ఇరు పక్షాలు ఆశ్చర్యపోనవసరం లేదు' అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం పేర్కొంది. బెయిల్ అంశంపై ఇరు పక్షాల వాదనలు వింటామని కోర్టు స్పష్టం చేసింది. అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తున్నట్లుగా ఇరుపక్షాలు భావించవద్దని సుప్రీంకోర్టు హెచ్చరించింది. కేజ్రీవాల్‌కు ఒకవేళ మధ్యంతర బెయిల్ మంజూరైతే ఆయనకు విధించే షరతులు, సిఎంగా ఏదైనా ఫైళ్లపై సంతకం చేయాలా? వద్దా? అన్న అంశాలను పరిశీలించాలని ఇడిని సుప్రీంకోర్టు కోరింది.



రాయ్‌బరేలి నుంచి రాహుల్ నామినేషన్

- ఖర్గే, సోనియా, ప్రియాంక హాజరు
- అమేథి నుంచి కిషోరీ లాల్ శర్మ నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి నుంచి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా భావించే అమేథి నియోజకవర్గం నుంచి గాంధీ కుటుంబ విధేయుడు కిషోరీ లాల్ శర్మ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. శుక్రవారం అమేథి రిటర్నింగ్ అధికారికి ఆయన తన నామినేషన్ పత్రాలు సమర్పించారు.

రాహుల్ గాంధీపై బిజెపి నేతలు చేస్తున్న విమర్శలకు మల్లికార్జున్ ఖర్గే స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ సొంత రాష్ట్రాన్ని వదిలేసి వారణాసికి ఎందుకు పారిపోయారని ప్రశ్నించారు. 'రాహుల్ గాంధీ గురించి ప్రశ్నించే ముందు ఆయన (ప్రధాని మోడీ) తనకు తానుగా వారణాసికి ఎందుకు పారిపోయారో అడగండి' అని మీడియా ప్రతినిధులకు ఖర్గే సూచించారు. యుపిలోని రాయ్‌బరేలి, అమేథి నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన అనంతరం పార్టీ నిర్ణయాన్ని ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ సమర్థించారు. రాయ్‌బరేలి నుంచి రాహుల్ గాంధీని బరిలోకి దింపడం బిజెపిని, ఆ పార్టీ మద్దతుదారులను షాక్‌కు గురిచేసిందని వ్యాఖ్యానించారు. విస్తృత చర్చ అనంతరం భారీ వ్యూహం, ఎత్తుగడల్లో భాగంగా పార్టీ నాయకత్వం ఈ నిర్ణయాలు తీసుకుందని అన్నారు. ఈ నిర్ణయం బిజెపి సహా దాని మద్దతుదారులను వణికిస్తోందని జైరాం రమేష్ ట్వీట్ చేశారు. అమిత్ షాను ఉద్దేశిస్తూ అపర చాణక్యుడిగా చెప్పుకునే బిజెపి నేతకు ఇప్పుడెలా స్పందించాలో తెలియడం లేదని అన్నారు.

పత్రికా స్వేచ్ఛలో 159వ స్థానం

- పాలస్తీనా ర్యాంకు 157
- మనకంటే టర్కీ, పాక్, శ్రీలంక బెటర్
- రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ 'ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్'



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ పాలనలో భారత్‌లో పత్రికా స్వేచ్ఛ ఎలా పడిపోయిందనటానికి ఇది మరొక ఉదాహరణ. రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్(ఆర్ఎస్ఎఫ్) ఏటా ప్రచురించే ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్–2024 ఎడిషన్‌లో భారత్ 159వ స్థానంలో ఉన్నది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినం నాడు ఈ నివేదిక విడుదలైంది. భారత్‌తో పోల్చుకుంటే పలు అంశాల్లో వెనకబడిన దేశాలుగా బిజెపి చెప్పే టర్కీ, పాకిస్థాన్, శ్రీలంకలు మాత్రం పత్రికా స్వేచ్ఛలో మనకంటే ముందున్నాయి. టర్కీ 158వ స్థానంలో నిలవగా.. పాక్ 152, శ్రీలంక 150వ ర్యాంకులను సాధించాయి.

ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్ సమాచారం ప్రకారం.. ఇజ్రాయెల్ అతి దారుణ యుద్ధంతో తీవ్రంగా నష్టపోతున్న పాలస్తీనాలో అనేక మంది జర్నలిస్టులు ఇప్పటికే మరణించారు. అయినప్పటికీ, ఆ దేశం పత్రికా స్వేచ్ఛలో ఒకే స్థానం దిగజారి 156 నుంచి 157కి చేరింది.

ఈ ర్యాంకింగ్ రాజకీయ సందర్భం, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్, ఆర్థిక సందర్భం, సామాజిక సాంస్కృతిక సందర్భం, జర్నలిస్టుల భద్రత అనే ఐదు సూచికలపై ఆధారపడి ఉంటుంది. టర్కీ, బంగ్లాదేశ్, యుఎఇ, భారతదేశం, రష్యాతో సహా 22 దేశాల కంటే మెరుగ్గా ఉన్న పాలస్తీనా కేవలం ఒక ర్యాంక్‌ను ఎలా మార్చుకున్నదనేది ఆశ్చర్యకరంగా అనిపించొచ్చనీ, అయితే ఇజ్రాయెల్ దాడి కారణంగానే పాలస్తీనాలో అశాంతి కనిపించినా.. అక్కడ పత్రికా స్వేచ్ఛకు అంతగా భంగం వాటిల్లలేదని అంతర్జాతీయ నిపుణులు అంటున్నారు. 2023లో, ఇజ్రాయెల్–గాజా యుద్ధంలో ప్రపంచవ్యాప్తంగా మరణించిన జర్నలిస్టులు, మీడియా ఉద్యోగులలో మూడొంతుల మంది మరణించారనీ, వారిలో ఎక్కువ మంది పాలస్తీనియన్లు గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో చనిపోయారని గుర్తు చేశారు. ఇక ఖతార్ 84వ స్థానంలో ఉన్నది. కేంద్రంలోని మోడీ సర్కారు ఇటీవల మరింత క్రూరమైన చట్టాలను అవలంబించిందనీ, ఇప్పటికీ "ప్రజాస్వామ్యానికి అనర్హమైనది" అని ఆర్ఎస్ఎఫ్ పేర్కొన్నది. ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛకు "దాని హామీదారులుగా ఉండవలసిన వ్యక్తులు, రాజకీయ అధికారంతో ముప్పు వాటిల్లుతున్నదని వివరించింది. ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో పత్రికా స్వేచ్ఛ పరిస్థితి మరింత దిగజారిందనీ, 2024 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో 32 దేశాలు, భూభాగాల్లో 26 స్కోర్లు పడిపోయాయని ఆర్ఎస్ఎఫ్ వివరించింది. నియంతృత్వ ప్రభుత్వాలు పెరుగుతున్న శక్తితో వార్తలు, సమాచారంపై తమ పట్టును కఠినతరం చేస్తున్నాయని పేర్కొన్నది. ఇక హాంకాంగ్(135), కంబోడియా(151), ఫిలిప్పీన్స్(134) వంటి దేశాలు భారత్ కంటే ముందుండటం గమనార్హం.

నాలుగో విడతలో 1,717 అభ్యర్థులు పోటీ

- 13న పోలింగ్, 10 రాష్ట్రాల్లో 96 నియోజకవర్గాలకు పోటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నాలుగో విడతలో లోక్‌సభ ఎన్నికలకు ఈ నెల 13న పోలింగ్ జరగనుంది. ఇక, నాలుగో విడతలో పది రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. లోక్‌సభ ఎన్నికల బరిలో 1,717 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పది రాష్ట్రాల్లో 96 పార్లమెంటు స్థానాలకు పోలింగ్ జరగనుంది. లోక్‌సభ ఎన్నికల బరిలో ఎపిలో మొత్తం 25 పార్లమెంటు స్థానాలకు గానూ 454 మంది పోటీలో నిలిచారు. అలాగే, తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు గానూ 525 మంది పోటీలో ఉన్నారు.

బీహార్‌లో ఐదు పార్లమెంటు స్థానాలకు 55 మంది, జమ్మూ కాశ్మీర్‌లో ఒక్క పార్లమెంటు స్థానానికి బరిలో 24 మంది, జార్ఖండ్‌లో నాలుగు పార్లమెంటు స్థానాలకు 45 మంది, మధ్యప్రదేశ్‌లో ఎనిమిది స్థానాలకు 74 మంది, మహారాష్ట్రలో 11 పార్లమెంటు స్థానాలకు 209 మంది, ఒడిశాలో నాలుగు పార్లమెంటు స్థానాలకు బరిలో 37 మంది, ఉత్తరప్రదేశ్‌లో 13 స్థానాలకు 130 మంది, పశ్చిమబెంగాల్లో ఎనిమిది పార్లమెంటు స్థానాలకు 75 మంది పోటీ చేస్తున్నారు. 96 నియోజకవర్గాలకు 4,264 నామినేషన్లు వచ్చాయి. అయితే 1,717 మాత్రమే ఆమోదం పొందాయి. మిగిలిన నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎపిలో 25 స్థానాలకు 1,103 నామినేషన్లు దాఖలు కాగా, 454 నామినేషన్లు మాత్రమే ఆమోదం పొందాయి. తెలంగాణలో 17 స్థానాలకు 1,488 నామినేషన్లు దాఖలు కాగా, 525 నామినేషన్లు ఆమోదం పొందాయి. తెలంగాణలో మల్కాజ్‌గిరి స్థానానికి అత్యధికంగా 177 నామినేషన్లు దాఖలయ్యాయి. నల్గొండ, భువనగిరి స్థానాలకు కూడా 114 నామినేషన్ల చొప్పున దాఖలయ్యాయి.

ధర్మానికి.. అధర్మానికి మధ్య యుద్ధం

- జగన్ భూ దోపిడీని సాగనివ్వను : చంద్రబాబు
- రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు: పవన్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి/పొదిలి (ప్రకాశం జిల్లా)

ఇవి ధర్మానికి- అధర్మానికి, అభివృద్ధికి- విధ్వంసానికి మధ్య జరిగే ఎన్నికలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా పొదిలో ప్రజాగళం సభ, నెల్లూరు నర్తకి సెంటర్‌లో జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌తో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం జగన్‌ను ఇంటికి సాగనంపాలని కోరారు. ఈ నెల 13న జరిగే ఎన్నికలు తెలుగుజాతికి, అవినీతిపరుడికి మధ్య జరిగే ఎన్నికలన్నారు. ప్రజలకు పది రూపాయాలిచ్చి, వంద రూపాయలు దోచుకుంటున్నారని విమర్శించారు. ఇటీవల జగన్ తీసుకొచ్చిన భూ చట్టం ప్రజల ఆగ్రహానికి గురవుతుందన్నారు. తాతలు, ముత్తాలు భూములిస్తే ఆ రికార్డులు జగన్ వద్ద పెట్టుకొని ఆక్రమణ చేయడానికి సిద్ధమయ్యారని విమర్శించారు. జగన్ భూ దోపిడీని సాగనివ్వనని తెలిపారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం డిఎస్‌సిపై పెడితే, రెండో సంతకం జగన్ తీసుకొచ్చిన భూ చట్టాన్ని రద్దు చేయడానికేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులు కనిపిస్తున్నాయని, తాము 140 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. జూన్ 4 తరువాత జగన్ ఇంటికి పోడానికి సిద్ధమయ్యారన్నారు. రాష్ట్రాభివృద్ధికి దోపిడీ చేసే స్మగ్లర్లు కావాలో, అభివృద్ధి చేసే నాయకులు కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పేదలకు పింఛన్లు ఇవ్వడంలోనూ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో లక్షా 40 వేల మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారని, ఒక్కొక్కరు 40 మందికి పింఛన్ ఇంటి వద్దనే ఇచ్చే అవకాశం ఉన్నా.. వారిని ఉపయోగించకుండా ఈ నెలలో బ్యాంకులో జమ చేయడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ దుర్మార్గానికి పింఛన్‌దారులు బలైపోతున్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛన్ రూ.4 వేలు ఇంటి వద్ద ఇచ్చే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టును సిఎం జగన్ నీళ్ల లేకుండానే రిబ్బన్ కట్ చేశారని విమర్శించారు. తానే వెలిగొండ పూర్తిచేసి పొదిలి మండలాన్ని కూడా సాగునీటి ఆయకట్టులో చేరుస్తానన్నారు. మూతపడ్డ దొనకొండ పారిశ్రామికవాడను తెరిపించి ఉపాధి అవకాశాలు పెంచుతానని హామీ ఇచ్చారు. రామాయపట్నం పోర్టు అభివద్ధి కోసం అప్పట్లో కషి చేశానన్నారు. అన్ని విధాల వెనుకబడ్డ ఈ జిల్లాకు న్యాయం జరగాలంటే టిడిపితోనే సాధ్యమన్నారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని దోచేసిన జగన్.. క్లాస్ వార్ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కూటమి నేతలంతా కలిసి రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తామని తెలిపారు.


నెల్లూరులో రోడ్ షో నిర్వహిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

బిజెపి అభ్యర్థి కంగనపై రైతు సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థి కంగన రనౌత్‌పై రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 2021–22లో సాగు చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన రైతులను కించపరచినందుకు ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. సంయుక్త కిసాన్ మంచ్ కన్వీనర్ హరీశ్ చౌహాన్ మీడియాతో మాట్లాడుతూ రైతు ఉద్యమంలో పాల్గొన్న పంజాబ్ మహిళా రైతును బిల్కిస్‌బానోగా కంగన తప్పుగా చిత్రీకరించి, రైతులను కించపరిచారని చెప్పారు. రాష్ట్రానికి చెందిన ఎంపిలు ఎన్నడూ రైతు సమస్యలు లేవనెత్తలేదని అన్నారు. రైతుల కోసం పోరాడే అభ్యర్థులకే ఎస్‌కెఎం మద్దతు ఇస్తుందని తెలిపారు. యాపిల్‌ను దిగుమతి చేసుకోవడం ద్వారా యాపిల్ పరిశ్రమను నాశనం చేశారని విమర్శించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) కింద పండ్లకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) నిర్ణయించాలని డిమాండ్ చేసిన చౌహాన్, కేంద్ర ప్రభుత్వం ఎంఐఎస్‌ను రద్దు చేసిందని, రైతులకు రూ.70 కోట్ల బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. సిమ్లా బిజెపి సిట్టింగ్ ఎంపి సురేష్ కశ్యప్ తమ డిమాండ్లను ఎప్పుడూ లేవనెత్తలేదన్నారు. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పండ్లు, పంటలకు ఎంఎస్‌పిని చేర్చిందని, ఇది ఆమోదయోగ్యంగా ఉంటుందని చెప్పారు.

అంజన్ కుమార్‌కు అశ్రునివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



రైతు నేత, సిపిఐ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ (70) మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అంజన్ మరణం పట్ల అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం(ఎఐకెఎస్), ఆలిండియా అగ్రికల్చరల్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ (ఎఐఎడబ్ల్యుయు) తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశాయి. ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. అతుల్ కుమార్ అంజన్ దేశవ్యాప్తంగా వామపక్ష ఉద్యమం, రైతుల ఉద్యమం రెండింటినీ బలోపేతం చేయటంలో గణనీయమైన పురోగతి సాధించారని పేర్కొంది. అంతర్జాతీయ సంఘీభావ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనేవారు, దక్షిణాసియా అంతటా రైతు సంస్థలను ఏకం చేయటానికి కృషి చేశారు

2015 భూసేకరణ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించడంలో, ఆలిండియా కిసాన్ సంఘర్ష్ కోఆర్డినేషన్ కమిటీ, సంయుక్త్ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన వివిధ ఉద్యమాలలో ఆయన కీలక పాత్ర పోషించారు. రైతులు–వ్యవసాయ కార్మికుల మధ్య ఐక్యతను కోరుకునేవారు. మతతత్వ శక్తులను తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పనిచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు, తోటి సహచరులకు ఎఐకెఎస్ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నదని అధ్యక్షులు అశోక్‌ధావలే, ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఎఐఎడబ్ల్యుయు అధ్యక్షులు విజయరాఘవన్, ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు.

తొలి నుంచి ఉద్యమ బాటలోనే...

రైతు, ప్రజా సమస్యలపై పలు పోరాటాలు నిర్వహించారు. ఆయన తండ్రి ఎ.పి సింగ్ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ (హెచ్ఎస్ఆర్ఎ) కార్యకలాపాల్లో పాల్గొన్నారు. 20 ఏళ్ల ప్రాయంలోనే అంజన్ కుమార్ నేషనల్ కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. నాలుగు పర్యాయాలు లక్నో యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులుగా గెలిచారు. అరడజను భాషల్లో ప్రతిభావంతుడైన వక్తగా పేరొందారు. యూనివర్సిటీలో చదువుకునే రోజుల్లో సిపిఐలో చేరారు. అంజన్ నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలల జైలు జీవితం గడిపారు. 1979లో ఎఐఎస్ఎఫ్ లూథియానా సమావేశంలో ఆయన అధ్యక్షులయ్యారు. 1985 వరకు ఆ బాధ్యతలు నిర్వర్తించారు. 1989లో కోల్‌కతాలో జరిగిన 14వ సిపిఐ మహాసభలో పార్టీ జాతీయ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. 1992లో హైదరాబాద్‌లో జరిగిన 15వ మహాసభలో జాతీయ కార్యవర్గానికి ఎన్నికయ్యారు. 1995లో ఢిల్లీలో జరిగిన 16వ మహాసభలో జాతీయ సెక్రటేరియట్ సభ్యులుగా ఎన్నికయ్యారు. చివరి శ్వాస వరకు ఆ బాధ్యతల్లోనే కొనసాగారు. 1997లో త్రిసూర్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అఖిల భారత కిసాన్ సభకు ప్రధాన కార్యదర్శి అయ్యారు. 2001, 2006, 2010, 2016లలో అదే పదవికి ఎన్నికయ్యారు. రైతుల ఉత్పత్తులకు ఎంఎస్‌పితో సహా అనేక సిఫార్సులు చేసిన స్వామినాథన్ కమిషన్‌లో ఏకైక రైతు సభ్యులుగా ఆయన విశేష కృషి చేశారు. విద్యార్థుల ఉద్యమం, రైతుల ఉద్యమం, దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణంలో అతుల్ కుమార్ అంజన్ కీలక పాత్ర పోషించారు. ఆయన మితవాద, ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేశారు. ఆయన మృతితో దేశంలోని రైతు ఉద్యమానికి, సిపిఐకి తీరని లోటని రైతు సంఘాలు పేర్కొన్నాయి. అంజన్ మృతికి సిపిఐ నివాళులర్పిస్తూ, అన్ని రకాల దోపిడీ, వివక్షల నుండి విముక్తి పొంది నవ భారతదేశం కోసం పోరాడటానికి ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు పిలుపునిచ్చింది.



కర్నూలులోని కల్లూరు అర్బన్ 34వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న డి.గౌస్‌దేశాయ్



జివిఎంసి 73వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు, కాంగ్రెస్ విశాఖ ఎంపి అభ్యర్థి సత్యారెడ్డి

వాడవాడలా సిపిఎం ప్రచారం

- రోడ్ షోలు, ఇంటింటి ప్రచారాలతో ప్రజల ముందుకు

ప్రజాశకి-యంత్రాంగం

ఎన్నికల సమయం దగ్గపడుతుండడంతో సిపిఎం అభ్యర్థులు ఇంటింటికి ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. స్థానిక ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారితో కొద్దిసేపు గడిపారు. పలు దుకాణాలు, బడ్డీకొట్లు, తోపుడు బండ్ల వారి వద్దకు వెళ్లి ముచ్చటించారు. వ్యాపారులతో మాట్లాడారు. అందరి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల రోడ్ షోలు, బహిరంగ సభలు నిర్వహిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. పేదలు, కార్మికులు, కష్ట జీవుల కోసం నిరంతరం పోరాడే సిపిఎం పార్టీని ఈ ఎన్నికల్లో గెలిపించి చట్టసభల్లోకి పంపించాలని కోరారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం భీంపోలు, గుమ్మకోట, గరుగుబిల్లిల్లో శుక్రవారం అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్య, ఉపాధి, వైద్యం, తాగునీరు వంటి ప్రధాన అంశాలపై కేంద్రీకరించి పని చేస్తానని తెలిపారు. సిపిఎం గెలుపు ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. అరకు వారపుసంతలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం ప్రచారం చేపట్టారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స, కాంగ్రెస్ అరకు ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధరస్వామిని గెలిపించాలని కోరారు.

రంపచోడవరంలోని టీచర్స్ కాలనీ, సీతంశెట్టి నగర్, ఎస్‌టి కాలనీ, మెయిన్ రోడ్డు, రెడ్డి పేట, గంగాలమ్మ వీధి, బందులు దొడ్డి వీధి, గొట్టాలరేవు తదితర ప్రాంతాల్లో నియోజకవర్గ అభ్యర్థి లోతా రామారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గిరిజనులకు అడవులపై హక్కును కోల్పోయేలా చేసిన బిజెపిని, దానికి మద్దతిస్తున్న టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.అరుణ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సిపిఎంను గెలిపిస్తే రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. విశాఖ 73వ వార్డులో సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, కాంగ్రెస్ విశాఖ ఎంపి అభ్యర్థి సత్యారెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. వార్డు పరిధిలోని సింహగిరి కాలనీ, పైడిమాంబ కాలనీ, సనత్‌నగర్, గొంతివానిపాలెం తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై గొంతెత్తే నాయకులను చట్టసభలకు పంపాలని కోరారు.

కర్నూలు జిల్లా కల్లూరు అర్బన్ 34వ వార్డులోని శివయ్య నగర్, సంపత్ నగర్, కృష్ణారెడ్డి నగర్, గోపి నగర్, నిర్మల నగర్, బృందావన్ నగర్‌లలో సిపిఎం అభ్యర్థి డి.గౌస్ దేశాయ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని, తాగునీరు అందించే విషయంలో పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారిందన్నారు. తనను గెలిపిస్తే ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడతానని తెలిపారు.

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని రాజీవ్ గృహకల్ప, టిప్పర్ల బజార్, నిడమర్రు రోడ్డు, పార్క్ రోడ్డు, గౌతమ్ బుద్ధ రోడ్, భగత్ సింగ్ నగర్ ప్రాంతాల్లో నియోజకవర్గ అభ్యర్థి జొన్న శివశంకరరావు ప్రచారం నిర్వహించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, రైతులు, అనేక సమస్యలపై సిపిఎం చేసిన పోరాటాలను చెప్పి తమను బలపర్చాలని కోరారు.

నెల్లూరు 47వ డివిజన్ పరిధిలోని కుక్కలగుంట, కామాటి వీధి, రాజేంద్రనగర్, మసీద్ సెంటర్, కోటమిట్ట సెంటర్, గరిస వీధి సెంటర్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్ ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. తనను గెలిపిస్తే నియోజకవర్గంలో తాగునీటి సమ స్యను పరిష్కరిస్తానని, డంపింగ్ యార్డును తొలగిస్తానని, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు.

విజయవాడ 26వ డివిజన్‌లోని మాచవరం, మారుతీనగర్, కాలవకట్ట ప్రాంతాల్లో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ బిజెపి, వైసిపి, టిడిపి విధానాలతో భవిష్యత్తులో మరింత ప్రమాదం ఉందన్నారు. మోడీని గద్దె దించకపోతే దేశానికి, రాష్ట్రానికి భవిష్యత్తు లేదన్నారు. శాసనసభలో నికరమైన, నిబద్ధతతో కూడిన ప్రతిపక్షం అవసరమని తెలిపారు. అందుకే కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు.

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో కళ్లం వెంకటేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న బిజెపిని, దానికి మద్దతిస్తున్న పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఇండియా వేదిక నాయకత్వంలో ప్రజా పరిపాలన వచ్చేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

విజయనగరం జిల్లా మెంటాడ మండలం ఆండ్రలో అరకు పార్లమెంటు అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం గిరిజన హక్కులను కాలరాస్తుంటే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు దానికి మద్దతివ్వడం దారుణమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోన్న బిజెపిని ఈ ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలంలో ఆ నియోజకవర్గం అభ్యర్థి మండంగి రమణ విస్తృత ప్రచారం నిర్వహించారు. గి రిజన సమస్యల పరిష్కారానికి తనను ఆదరించాలని కోరారు.

తిరుమలలో విస్తృత ఏర్పాట్లు : ఇఒ


ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే సందర్శకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందని, అందుకు తగ్గట్టు టిటిడి విస్తృత ఏర్పాట్లు చేస్తోందని ఇఒ ఎవి ధర్మారెడ్డి పునరుద్ఘాటించారు. డయల్ యువర్ ఇఒ కార్యక్రమం అనంతరం ఇఒ మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో 20.17 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారని తెలిపారు. రూ. 101.63 కోట్లు హుండీ ఆదాయం కానుకల రూపంలో వచ్చిందని చెప్పారు. 94.22 లక్షలు లడ్డూలు విక్రయించామని తెలిపారు. 39.73 లక్షల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారని, 8.08 లక్షల మంది తలనీలాలు సమర్పించారని చెప్పారు.

నూజివీడులో బాలుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

బాలుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా నూజివీడులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నూజివీడులోని అమరావతి ఫర్నిచర్స్ యజమాని కోవూరి రామిరెడ్డి కుమారుడు సాయి యశ్వంత్‌రెడ్డి (16) స్థానిక ఆర్ఆర్ పేటలో మృతి చెంది ఉన్నాడు. శుక్రవారం ఉదయం సాయియశ్వంత్‌రెడ్డి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావించారు. అయితే బాలుని బెడ్‌రూమ్‌లో రక్తపు మరకలలు ఉండడంతో తమకు, సమీపంలోని మరో షాపు వారికి తగాదాలున్నాయని, తన కుమారుడిని వారే హత్య చేసి ఉంటారని మృతుని తండ్రి అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



శ్రీరామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సుబ్బరావమ్మ, రెడ్డి వేణు తదితరులు

డబ్బు ప్రమేయం లేకుండా పోటీ చేయాలి

- బిజెపి, టిడిపి, వైసిపిలకు వి శ్రీనివాసరావు సవాల్

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి/బలిజిపేట

చంద్రబాబు గెలిచినా, జగన్ గెలిచినా రాష్ట్రంలో పాలన సాగించేది మోడీ, అమిత్ షా లేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బిజెపి, టిడిపి, వైసిపిలు రాజకీయాలను వ్యాపారంగా మార్చుకున్నాయని విమర్శించారు. ఆ మూడు పార్టీలకు చిత్త శుద్ధి ఉంటే డబ్బు ప్రమేయం లేకుండా ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ చేశారు. సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా పూర్వ కార్యదర్శి కీర్తిశేషులు రెడ్డి శ్రీరామమూర్తి తృతీయ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామం సీతానగరం మండలం రెడ్డివానివలసలో నిర్వహించిన సభలో శ్రీనివాసరావు ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోడీ, వైసిపి, టిడిపి అధినేతలు జగన్, చంద్రబాబు మాయల మరాఠీలని విమర్శించారు. కేంద్రంలో బిజెపి మరోసారి అధికారంలోకొస్తే ప్రజలు స్వేచ్ఛగా ప్రేమానురాగాలతో బతికే పరిస్థితి ఉండబోదన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు రిజర్వేషన్లు తదితర వాటి అమలుకు పోరాడుతుంటే, బిజెపి ఏకంగా రిజరేషన్లను ఎత్తివేయాలని చూస్తోందన్నారు. హైడ్రో పవర్ పేరుతో పచ్చటి అడవులు, భూములు లాగేసుకుని ఆదివాసీల పొట్ట కొడుతోందని తెలిపారు. పార్లమెంట్‌లో మన రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్కరూ మాట్లాడలేదన్నారు. సంక్షేమ పథకాల మీట నొక్కుతున్నానంటూ గొప్పలు చెప్పుకుంటున్న జగన్... వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలకు, ఉద్యోగాల కల్పనకు, ధరల తగ్గింపునకు, సబ్సిడీ పెంపునకు ఎందుకు మీట నొక్కడం లేదని ప్రశ్నించారు. భూమిపై ప్రజల హక్కును కాలరాసే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కేంద్ర ప్రభుత్వ సూచన మేరకే అమలు చేశామని వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి నిస్సిగ్గుగా చెప్తున్నారన్నారు. బిజెపితో చంద్రబాబు సిగ్గు లేకుండా పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. భూమిపై ప్రజల హక్కులు కాలరాసే విషయంలో మోడీ, బాబు, జగన్ ముగ్గురూ ఒక్కటేనని అర్థమవుతోందన్నారు.

కులవివాదం పరిష్కారం కాకుండా కొత్తపల్లి గీతకు టికెట్ ఎలా ఇచ్చారు

అరకు బిజెపి ఎపి అభ్యర్థి కొత్తపల్లి గీత బ్యాంక్ రుణాలు ఎగ్గొట్టి కేసుల ఎదుర్కొంటున్నారని, కులవివాదం పరిష్కారం కాకుండా బిజెపి, టిడిపి, జనసేన కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పోటీకి పెట్టడం ఎంతవరకు సమంజసమని శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఎన్నికల్లో డబ్బు ఖర్చుపెట్టి పోటీ చేయాల్సిన అవసరం ఎర్ర జెండాకు లేదన్నారు. ప్రజలు తమ కష్టార్జితం నుంచి ఇచ్చిన విరాళాలను ఖర్చు పెడతామని చెప్పారు. గెలిచేవారికి ఓటు వేయాలనే దోపిడీ శక్తుల నినాదాన్ని పక్కన బెట్టి, ఓట్లేసేవారే గెలుస్తారన్న నమ్మకంతో సిపిఎంకు ఓటు వేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, పార్టీ సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, విజయనగరం జిల్లా నాయకులు రెడ్డి శంకరరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పి.రమణి తదితరులు పాల్గొన్నారు.

నిధులు, భూములు, వనరులు దోచుకుని ఉచితాలా?

నిధులు, భూములు, వనరులను దోచుకొని పప్పు బెల్లంలా వైసిపి, టిడిపి ఉచిత పథకాలు ప్రకటిస్తున్నాయని వి.శ్రీనివాసరావు విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు కావాలంటే బిజెపిని, దాని పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలని కోరారు. ఇండియా వేదిక తరపున పోటీ చేస్తున్న సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకిలో ఆయన ప్రచారం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులకు మహిళలు స్వాగతం పలికి హారతులిచ్చారు. అనంతరం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడారు. పోలవరం కడుతున్న కాంట్రాక్టు కంపెనీ వద్ద ఎన్నికల బాండ్ల పేరిట రూ.1000 కోట్లు తీసుకున్నారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ ప్రసంగించారు.

బిజెపితో పొత్తు నయవంచనే

- అభివృద్ధి కోసమంటూ ప్రజల చెవుల్లో పువ్వులు
- మోడీని గద్దె దించకపోతే దేశానికే ముప్పు
- వడ్డే శోభనాద్రీశ్వరరావు



నయవంచన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శోభనాద్రీశ్వరరావు, విజయరావు తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

బిజెపితో తాము పొత్తు పెట్టుకున్నది రాష్ట్రాభివృద్ధి కోసమే అంటూ టిడిపి, జనసేన నయవంచనకు పాల్పడుతున్నాయని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు విమర్శించారు. వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టి ప్రజలపై భారాలు మోపుతూ మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపితో అభివృద్ధి ఎలా సాధ్యమని, అలా చెప్పడం రాష్ట్ర ప్రజల చెవ్వుల్లో పువ్వులు పెట్టడమేనని పేర్కొన్నారు. బిజెపిని సార్వత్రిక ఎన్నికల్లో ఓడించి ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, లౌకిక భారతదేశాన్ని కాపాడుకోవాలంటే 'ఇండియా' ఫోరం అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. అనకాపల్లిలోని రోటరీ క్లబ్‌లో శుక్రవారం ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పాలక పార్టీల మోసాలను ఎండగడుతూ రూపొందించిన 'నయవంచన' పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. అనంతరం శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రాన్ని వంచిన మోడీతో టిడిపి, జనసేన, వైసిపి అంటకాగుతున్నాయని తప్పుబట్టారు. 2014 ఎన్నికల్లో మోడీతో పొత్తుపెట్టుకొని ఏం సాధించారని చంద్రబాబును ప్రశ్నించారు.

12 ఏళ్ల రాజ్యసభ సభ్యునిగా ఉన్న ప్రస్తుత అనకాపల్లి పార్లమెంట్ బిజెపి అభ్యర్థి సిఎం రమేష్ ప్రజలకు చేసిందేమీలేదని తెలిపారు. స్థానికుడు కాని, అందుబాటులో లేని వ్యక్తి కంటే సమస్యలపై పనిచేసే 'ఇండియా' అభ్యర్థి వేగి వెంకటేష్‌ను గెలిపించుకోవాలని కోరారు. మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించుకోవాలన్న దృక్పథం కలిగిన అభ్యర్థులను బలపరచాలన్నారు.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కో-కన్వీనర్ విజయరావు మాట్లాడుతూ బిజెపి పాలనలో అసమానతలు, నిరుద్యోగం పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఎఎస్ అధికారి బి శ్రీనివాస్, 'ఇండియా' అభ్యర్థి వేగి వెంకటేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కన్వీనర్ పిఎస్ అజయ్ కుమార్, ఆమ్ ఆద్మీ రాష్ట్ర నాయకులు రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు పాల్గొన్నారు.

వేగవంతంగా సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్

- వైద్యారోగ్యశాఖ కమిషనరు ఎస్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్‌ను వేగవంతం చేయాలని, ఆయా జిల్లాల్లో వైద్యపరమైన ప్రాధాన్యతల్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వైద్యాధికారులు వ్యవహరించాలని వైద్యారోగ్యశాఖ కమిషనరు ఎస్ వెంకటేశ్వర్ ఆయా జిల్లాల వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం మంగళగిరిలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాల్లో డిసిహెచ్‌ఒలు, ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో డిఎంహెచ్‌ఒలు సమన్వయం చేసుకుంటూ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. మలేరియా, డెంగీ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యశ్రీ క్లెయిమ్‌ల అంశంలో డిఎంహెచ్‌ఒలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. టిబి పరీక్షలకు సంబంధించి మైక్రోస్కోపిక్ టెస్టులపై ఫోకస్ పెట్టాలని, నూటికి నూరు శాతం సిజేరియన్స్ చేస్తున్న ఆస్పత్రులకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. విలేజ్ హెల్త్ క్లీనిక్, పిహెచ్‌సిలలో వడగాడ్పులకు చికిత్స అందించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, సరిపడా ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

పేర్ని కిట్టుపై హత్యాయత్నం కేసు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కృష్ణా జిల్లా మచిలీపట్నం వైసిపి అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)పై హత్యాయత్నం కేసు నమోదైంది. మచిలీపట్నం 8వ డివిజన్ విశ్వబ్రాహ్మణ కాలనీలో గురువారం వైసిపి శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. ఈ క్రమంలో జనసేన నేత కర్రి మహేష్ ఇంటి వద్ద వైసిపి, జనసేన కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వైసిపి కార్యకర్తలు తన ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశారని, ఇంట్లోని వస్తువులను పగులగొట్టారని కర్రి మహేష్ మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి పేర్ని కిట్టుతోపాటు మొత్తం ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఏ1గా పేర్ని కిట్టును పోలీసులు పేర్కొన్నారు. ఆయనతో పాటు చిలకలపూడి గాంధీ, చిలంకుర్తి వినయ్, శీనయ్య, ధనబాబు, లంకే రమేశ్‌ను నిందితులుగా చేర్చారు. వీరిలో కిట్టు మినహా మిగతా ఐదుగురిని అరెస్ట్ చేశారు. మరోవైపు బాధితుడు కర్రి మహేష్‌తో పాటు మరో ముగ్గురిపైన ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు నమోదైంది. తనను కులంపేరుతో దూషించారంటూ వైసిపికి చెందిన నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు.

వైఎస్ వివేకా హత్య కేసు...
సునీల్, ఉదయ్‌కుమార్‌లకు బెయిల్ నిరాకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న సునీల్ యాదవ్, ఉదయ్ కుమార్ రెడ్డికి బెయిల్ ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. నిరాకరించింది. మరో నిందితుడు వైఎస్ భాస్కర్‌రెడ్డికి పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేసింది.సునీల్ యాదవ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై జరిగిన విచారణలో పలు కీలక అంశాలను కోర్టు దృష్టికి సిబిఐ తీసుకెళ్లింది. వివేకా హత్యకు సునీల్ సహకరించినట్లు అన్ని ఆధారాలూ ఉన్నాయని నివేదించింది. హత్య జరిగిన సమయంలో వివేకా ఇంట్లో ఆయన ఉన్నట్లు గూగుల్ టేక్ అవుట్ ద్వారా తేలిందని పేర్కొంది. దీనిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, హత్య సంఘటనలో ఆయన పాల్గొన్నారనడానికి అదొక్కటే ఆధారం కాదని వివేకా ఇంటి వద్ద వాచ్‌మెన్ రంగన్న, అప్రూవర్ దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలాల ప్రకారం సునీల్ యాదవ్ పాత్ర ఉందని సిబిఐ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వివేకా హత్య అనంతరం గంగిరెడ్డి, దస్తగిరి, సునీల్ యాదవ్ పారిపోతుండగా గుర్తించినట్లు రంగన్న వాంగ్మూలం ఇచ్చారని వివరించారు. దీనికితోడు సిసి టివి ఫుటేజీ, హత్యకు ముందు, తరువాత నిందితుల మధ్య ఫోన్ సంభాషణల కాల్ డేటా రికార్డు ఉందని తెలిపారు. సిబిఐ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. ఇదే కేసులో అరెస్టయి కండీషనల్ బెయిల్‌పై ఉన్న భాస్కర్‌రెడ్డికి పూర్తిస్థాయి బెయిల్ మంజూరుచేసింది. మరోవైపు ఈ కేసులో నిందితుడిగా ఉన్న కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డికి మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలంటూ ఈ కేసులో దస్తగిరి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

అదానీ కంపెనీల లిస్టింగ్ నిబంధనల ఉల్లంఘన

- ఆరు సంస్థలకు సెబీ నోటీసులు
- 6,000 లావాదేవీలపై ప్రశ్నలు..



న్యూఢిల్లీ : గౌతం అదానీ కంపెనీల కార్యకలాపాల్లో మరోసారి డొల్లతనం బయటపడింది. అదానీ కంపెనీలు లిస్టింగ్ నిబంధనలు ఉల్లంఘించడంతో వాటికి సెక్యూరిటీ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) నోటీసులు జారీ చేసింది. పార్టీ లావాదేవీలలో ఉల్లంఘనలు, లిస్టింగ్ నిబంధనలు పాటించనందుకు ఆరు అదానీ గ్రూప్ సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇదే విషయాన్ని స్టాక్ ఎక్స్చేంజీలలకు తమ రెగ్యూలేటరీ ఫైలింగ్‌లో అదానీ గ్రూపు సమాచారం ఇచ్చింది. నోటీసులు అందుకున్న వాటిలో అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్, అదానీ పవర్, అదనీ ఎనర్జీ సోల్యూషన్స్, అదానీ విల్మార్, అదానీ టోటల్ గ్యాస్ కంపెనీలున్నాయి. అదానీకి చెందిన కీలక కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ మార్చి 31 తో ముగిసిన త్రైమాసికంలో రెండు షోకాజ్ నోటీసులను అందుకుంది. థర్డ్ పార్టీలతో కొన్ని లావాదేవీలు, పీర్ చెల్లుబాటుకు సంబంధించిన సంబంధిత పార్టీ లావాదేవీలకు సంబంధించిన లిస్టింగ్ ఒప్పందం, ఎల్ఒడిఆర్ నిబంధనలను పాటించడం లేదని అదానీ ఎంటర్ ప్రైజెస్‌కు సెబీ నోటీసులిచ్చింది. 6,000కు పైగా సంబంధిత పార్టీ లావాదేవీలపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది. అదానీ గ్రూపునపై అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలపై సెబి పలు పరిశీలనలు, దర్యాప్తు చేసింది. అనంతరం ఈ నోటీసులు జారీ చేయడం విశేషం. కరేబియన్, మారిషస్, యుఎఇ దేశాల్లో అదానీ కుటుంబం పలు డొల్ల కంపెనీలను కలిగి ఉందని హిండెన్‌బర్గ్ తన రిపోర్ట్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. "వీటి ద్వారానే అవినీతి, అక్రమ నగదు బదలాయింపులకు పాల్పడుతోంది. అదానీ గ్రూప్ ఆర్థిక ఫలితాలను పరిశీలించినప్పుడు ఏడు కీలక నమోదిత కంపెనీల షేర్ల విలువలు ఆకాశాన్నంటాయి. వీటిని తనఖా పెట్టి ఆయా కంపెనీలపై భారీ అప్పులు చేశారు. అదానీ కంపెనీలు అనేక ఆర్థిక మోసాలకు పాల్పడ్డాయి." " అని హిండెన్‌బర్గ్ తన రిపోర్ట్‌లో పేర్కొంది. వీటిపై సెబీ విచారణలో పలు వాస్తవాలు బయటపడ్డాయని తెలుస్తోంది. సెబీ పరిశోధనలు అదానీ కంపెనీల భవిష్యత్ ఆర్థిక నివేదికలపై ప్రభావం చూపవచ్చని నిపుణులు భావిస్తున్నారు.



రూ.10వేల కోట్ల టివిల వ్యాపారం లక్ష్యం : సామ్‌సంగ్

గూర్‌గావ్ : ప్రస్తుత ఏడాదిలో రూ.10,000 కోట్ల విలువ చేసే టివిల వ్యాపారం నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తెలిపింది. 2024లో తమ కొత్త నియో క్యూఎల్ఇడి 8కె ఎఐ టివిల విక్రయాలను పెంచుకోవడం ద్వారా ఈ స్థాయికి చేరుకోవాలని నిర్దేశించుకున్నామని ఆ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మోహన్‌దీప్ సింగ్ తెలిపారు. గతేడాది తమ కంపెనీ టివిల విభాగంలో 21 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉందన్నారు.

మర్చంట్ భాగస్వాముల కోసం బిజినెస్ సొల్యూషన్ సూట్

- ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ వెల్లడి

న్యూఢిల్లీ : తమ మర్చంట్ భాగస్వాముల కోసం బిజినెస్ సూట్‌ను పరిచయం చేశామని ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఎండి, సిఇఒ అనుబ్రత బిశ్వాస్ తెలిపారు. దీనితో తమ మర్చంట్ భాగస్వాముల బ్యాంకింగ్, పేమెంట్ అవసరాలను తీర్చడానికి వినూత్నమైన, విభిన్నమైన ఆఫర్‌గా దీన్ని రూపొందించామన్నారు. చిన్న, మధ్య-తరహా వ్యాపారుల మధ్య డిజిటల్ బ్యాంకింగ్‌ను స్వీకరించడాన్ని ప్రోత్సహించడానికి రూపొందించిన ఈ పరిష్కారం పరిశ్రమలో ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. రానున్న రోజులలో బ్యాంక్ తన మర్చెంట్ ఆఫరింగ్‌లను విస్తరించనున్నామన్నారు.

దలాల్ స్ట్రీట్‌లో అమ్మకాల ఒత్తిడి

- సెన్సెక్స్‌కు 732 పాయింట్ల నష్టం

ముంబయి : దలాల్ స్ట్రీట్ భారీ కుదుపునకు గురైంది. శుక్రవారం అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్, నిఫ్టీలు భారీ నష్టాలను చవి చూశాయి. ప్రధానంగా రిలయన్స్, ఎల్అండ్‌టి, హెచ్‌డిఎఫ్‌సి షేర్లలో అమ్మకాల వెల్లువ కొనసాగడంతో బిఎస్ఇ సెన్సెక్స్ ఓ దశలో 1100 పాయింట్లు పైగా పతనమయ్యింది. తుదకు కొంత కోలుకుని 733 పాయింట్ల నష్టంతో 73,878కి దిగజారింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 192 పాయింట్లు కోల్పోయి 22,457 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎల్అండ్‌టి, మారుతీ, రిలయన్స్, నెస్లే ఇండియా, భారతీ ఎయిర్‌టెల్ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్, ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లు అధిక లాభాలు నమోదు చేసిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరికొంత కాలం అధిక వడ్డీ రేట్లనే కొనసాగించనుందనే అంచనాలు ప్రపంచ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించింది.

మూడో వారంలోనూ మారకం నిల్వలు పతనం



న్యూఢిల్లీ : వరుసగా మూడో వారంలోనూ భారత విదేశీ మారకం నిల్వలు పడిపోయాయి. ఏప్రిల్ 26తో ముగిసిన వారంలో 2.4 బిలియన్ డాలర్లు క్షీణించి 637.9 బిలియన్లుగా నమోదయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం తన రిపోర్ట్‌లో తెలిపింది. అదే విధంగా ఐఎంఎఫ్ వద్ద భారత మారకం నిల్వలు కూడా 8 మిలియన్ డాలర్లు కరిగి 4.639 బిలియన్లకు పరిమితమయ్యాయి. ఇంతక్రితం వారంలోనూ భారత విదేశీ మారకం నిల్వలు 2.28 బిలియన్ కరిగిపోయి 640.33 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షా వారంలో బంగారం నిల్వలు 1.275 బిలియన్ డాలర్లు తగ్గి 55.533 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బిఐ తెలిపింది.

యుఎస్ మార్కెట్లోకి డాక్టర్ రెడ్డీస్ డాక్సీసైక్లిన్ ఔషధాలు

హైదరాబాద్ : పలు రకాల బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ల చికిత్సకు ఉపయోగించే జెనరిక్ ఔషధం డాక్సీసైక్లిన్ క్యాప్సూల్స్ (40ఎంజి)ని అమెరికా మార్కెట్‌లో విడుదల చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ వెల్లడించింది. ఈ ఔషధానికి యుఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యుఎస్ఎఫ్‌డిఎ) ఆమోదించిన ఒరేసియా క్యాప్సూల్స్‌కు సమానమయ్యిందని పేర్కొంది. ఒక్క ప్యాక్‌లో 30 ట్యాబ్లెట్స్ ఉంటాయని తెలిపింది.